

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 15
సంచిక: 240

సోమవారం 21-11-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



టీ20లో సూర్య ప్రతాపం

భారత బ్యాట్స్‌మెన్ మెరుపు సెంచరీ.. న్యూజిలాండ్‌పై భారత్ గెలుపు - 12లో



భారం తగ్గేది ఎలా..?

ఆరోగ్య బీమా ఉన్నా వైద్య ఖర్చులు ఎలా తగ్గించుకోవాలనే దానిపై కథనం -13లో



'పరిహార నిధి'కి సై

వాతావరణ మార్పులతో నష్టపోయిన దేశాలకు పరిహార నిధిని ఏర్పాటు చేయాలని కాప్-27 సదస్సు నిర్ణయం తీసుకుంది.

వివరాలు 6లో



ట్రంప్ ట్విట్టర్ ఖాతా పునరుద్ధరణ

గతంలో రద్దు చేసిన అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్ ట్విట్టర్ ఖాతాను పునరుద్ధరించినట్లు సంస్థ సీఈవో మస్క్ ప్రకటించారు.

వివరాలు 6లో



చైనాలో కోవిడ్ మరణం నమోదు

6 నెలల తర్వాత చైనా రాజధాని బీజింగ్ తొలి కోవిడ్ మరణం నమోదైందని చైనా అధికారులు ఆదివారం వెల్లడించారు.

వివరాలు 6లో



నైట్‌క్లబ్‌లో కాల్పులు


అమెరికాలోని కొలర్యాడోలోని నైట్‌క్లబ్‌లో జరిగిన కాల్పుల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. 18 మంది గాయపడ్డారు.

వివరాలు 6లో

సాటిలేని 'వృద్ధి'

రూ.1.20 లక్షల కోట్లు పెరిగిన రాష్ట్ర స్థూల ఉత్పత్తి

- మూడేళ్లలో జీఎస్‌డీపీలో గణనీయ వృద్ధి.. మొత్తం 19.19 శాతం
- 2021–22లో పొరుగు రాష్ట్రాలు, పెద్ద రాష్ట్రాలకన్నా అధికం
- తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, పంజాబ్, రాజస్థాన్, యూపీ దిగదుడుపే
- 11.42 శాతం వృద్ధితో అన్ని రాష్ట్రాలనూ అధిగమించిన ఏపీ
- చంద్రబాబు హయాంలో వ్యవసాయం తిరోగమనం
- 2017–18తో పోలిస్తే 2018–19లో వృద్ధి –6.49 శాతం
- వైఎస్సార్ సీపీ వచ్చాక మూడేళ్లలో వ్యవసాయ వృద్ధి 20.05 శాతం.. వార్షిక సగటు 6.68 శాతం
- కోవిడ్ ఉన్నా గత మూడేళ్లలో పారిశ్రామిక రంగంలో 17.58 శాతం వృద్ధి నమోదు
- తయారీ రంగం వృద్ధి 10.85%.. సేవా రంగంలో వృద్ధి 20.76%
- 2021–22 ఆర్థిక ఏడాది గణాంకాలను వెల్లడించిన ఆర్బీఐ




సాక్షి, అమరావతి: గత మూడేళ్లుగా ప్రధాన రంగాలలో వృద్ధి రేటు పరుగులు తీస్తుండటం లక్ష్య సాధనలో రాష్ట్ర ప్రభుత్వ దృఢ సంకల్పం, కార్య దక్షతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఆర్థిక మంద గమనం, కోవిడ్ సంక్షోభంలోనూ ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా మూడేళ్లుగా రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల నమోదైంది. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.1,20,298.54 కోట్ల మేర పెరిగింది. రాష్ట్రంలో మూడేళ్లలో జీఎస్‌డీపీలో 19.19 శాతం వృద్ధి నమోదు కాగా ఏటా సగటున 6.39 శాతం వృద్ధి సాధించింది. దేశవ్యాప్తంగా 2021–22 ఆర్థిక ఏడాదికి సంబంధించి ఆర్బీఐ విడుదల చేసిన నివేదికలో ఈ అంశాలను పొందుపరిచింది. ప్రస్తుత ధరల కన్నా స్థిర ధరలు మాత్రమే వాస్తవ ప్రగతిని ప్రతిబింబిస్తాయి. ఈ నేపథ్యంలో స్థిర ధరల ఆధారంగా 2019–20 నుంచి 2021–22 వరకు వరుసగా మూడేళ్లుగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి పెరుగుతూనే ఉందని ఆర్బీఐ నివేదిక వెల్లడించింది. వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగం, తయారీ రంగాలలో మూడేళ్లుగా భారీ వృద్ధి నమోదైనట్లు తెలిపింది. మరోవైపు కోవిడ్ లాంటి సంక్షోభాలేవీ లేనప్పటికీ టీడీపీ హయాంలో వ్యవసాయ రంగం తిరోగమనంలోకి వెళ్లడం గమనార్హం. వ్యవసాయంలో మూడేళ్లలో 20.05 శాతం వృద్ధి

మిగతా 3వ పేజీలో ▶



విశ్వ సంబరానికి మోగిన విజిల్

అట్టహాసంగా ఫిఫా ప్రారంభోత్సవ వేడుక



■ 'మనల్నందరినీ కలిపే ఈ క్షణం మనందరినీ విడదీసే ఘటనలకంటే ఎంతో గొప్పది...అయితే ఈ ఒక్క రోజుకు పరిమితం కాకుండా శాశ్వతంగా నిలిచిపోయేందుకు ఏమేం చేయాలి'...హాలీవుడ్ స్టార్ మోర్గన్ ఫ్రీమన్ గంభీర స్వరంతో అడిగిన ఈ ప్రశ్నతో విశ్వ సంబరానికి విజిల్ మోగింది. ఖతర్ దేశం అంచనాలకు తగినట్లుగా అద్భుతమైన ఫిఫా ప్రారంభోత్సవ వేడుకలతో ప్రపంచ అభిమానుల మనసులు దోచింది. తమ దేశ సంస్కృతిని ప్రతిబింబించేలా కార్యక్రమాలను రూపొందించారు. అల్ బైత్ స్టేడియం మధ్యలో ఫ్రీమన్ ఆద్యంతం తన వ్యాఖ్యానంతో రక్తి కట్టించారు.

- వివరాలు 12లో

న్యూస్‌రీల్

సీఎం జగనే ప్రాణం పోశారు



కరోనా బాధితులకు వైద్యం చేస్తూ.. తానూ కరోనాకు గురై మృత్యువు అంచుకు చేరిన ఓ ప్రభుత్వ వైద్యుడిని సీఎం జగన్ ఆదుకున్నారు. తనకు ప్రాణ దానం చేసిన సీఎంకు ఆ వైద్యుడు కృతజ్ఞతలు చెప్పాడు. మళ్లీ విధులకు హాజరు కానున్నాడు.

వివరాలు 3లో ▸

గేటు వరకే అనుమతి



హైకోర్టు జువెనైల్ జస్టిస్ కమిటీ ఆదేశాల మేరకు గిరిజన విద్యాసంస్థల ఆవరణలోకి ఇతర వ్యక్తుల ప్రవేశాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

వివరాలు 3లో ▸

26న పీఎస్‌ఎల్‌వీ సీ54 ప్రయోగం



సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఈ నెల 26న ఉదయం 11.56 గంటలకు తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ లో పోలార్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (పీఎస్‌ఎల్‌వీ సీ54) ఉపగ్రహ వాహకనౌకను ప్రయోగించేందుకు సన్నాహాలు చేస్తోంది. ప్రయోగం ద్వారా భారత్‌కు చెందిన 960 కేజీల బరువు కలిగిన ఓషన్‌శాట్–3 (ఈవోఎస్–06) ఉపగ్రహంతో పాటు మరో 8 ఉపగ్రహాలను అంతరిక్ష కక్ష్యలోకి పంపనున్నారు. భారత్‌కే చెందిన థైబోల్ట్–1, థైబోల్ట్–2, ఆనంద్, ఇండియా–భూటాన్ దేశాలు సంయుక్తంగా తయారు చేసిన అకా ఐఎన్‌ఎస్–2బీ, స్విట్జర్లాండ్‌కు చెందిన ఆస్ట్రోకాస్ట్ –2 పేరుతో 4 ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపనున్నారు.

ఆక్వా వర్సిటీ... ఫిషింగ్ హార్బర్

నరసాపురంలో నేడు శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి జగన్



- ఉప్పుటేరు నదిపై మూలపర్రు రెగ్యులేటర్‌కూ శంకుస్థాపన.. నరసాపురం ప్రాంతీయ వైద్యశాల నూతన భవనం ప్రారంభం
- మంచినీటి అభివృద్ధి పథకాన్ని కూడా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- రూ.1400 కోట్లతో జిల్లా రక్షితనీటి సరఫరా ప్రాజెక్టుల శంకుస్థాపన.. 1,623 మంది రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ

2 లో


భూగర్భ జలం పుష్కలం



- నీటి సంరక్షణలో దేశంలో అగ్రగామి ఆంధ్రప్రదేశ్
- ఆరు నెలల్లో 2.5 మీటర్ల మేర పెరిగిన భూగర్భ జలాలు
- 5.56 మీ. పెరుగుదలతో తొలి స్థానంలో శ్రీ సత్యసాయి జిల్లా
- భూగర్భ జలాల లభ్యతలో 1.99 మీటర్లతో మొదటి స్థానంలో విజయనగరం
- రాష్ట్రంలో ప్రస్తుతం భూగర్భ జలాల రూపంలో 961.61 టీఎంసీల లభ్యత

3 లో

వాయుగుండంగా మారిన తీవ్ర అల్పపీడనం



■ ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం ఆదివారం వాయుగుండంగా బలపడింది. ఇది అదే తీవ్రతతో నెమ్మదిగా కొనసాగుతూ రానున్న 24 గంటల్లో ఉత్తర వాయవ్య దిశగా ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర తీరాల వైపు పయనిస్తుందని ఐఎండీ తెలిపింది.

14 లో

చిరంజీవికి అరుదైన గౌరవం

- ఇండియా ఫిలిం పర్సనాలిటీ ఆఫ్ ద ఇయర్'గా చిరంజీవిని ఎంపిక చేసిన కేంద్రం
- కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి ఠాకూర్ ప్రకటన
- ట్విట్టర్‌లో కేంద్రానికి కృతజ్ఞతలు తెలియజేసిన మెగాస్టార్

2 లో



రాజకీయాల్లో రాణించడం కష్టం

- అనాలి.. అనిపించుకోవాలి..
- ఒక దశలో అవి నాకు అవసరమా అనిపించింది
- ఈ రాజకీయాలకు పవన్ కళ్యాణ్ తగిన వాడు
- పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో సినీ నటుడు చిరంజీవి వ్యాఖ్య

2 లో

ధనవంతులూ వలసబాట

అది పేదలకే పరిమితం కాదు.. పెద్దలకూ తప్పడంలేదు




2022లో 88 వేల మంది హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (10 లక్షల డాలర్ల సంపద కలిగి ఉన్న వ్యక్తులు) తమ మాతృదేశాన్ని వదిలి మరో దేశానికి వలస వెళతారని 'హెన్లీ గ్లోబల్ సిటిజన్ రిపోర్ట్' అంచనా వేసింది. ధనవంతుల వలసలు పెరుగుతాయే తప్ప తగ్గే అవకాశం లేదని స్పష్టం చేసింది.

- 2022లో ప్రపంచవ్యాప్తంగా 88 వేల మంది అవకాశాల కోసం ఇతర దేశాలకు వెళ్తారని అంచనా
- కనీసం 10 లక్షల డాలర్ల పెట్టుబడి పెట్టే వ్యక్తుల డేటా విశ్లేషణ
- రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఫలితంగా ఆ దేశాల నుంచి ఎక్కువ మంది ధనికులు వలసబాట
- భారత దేశం నుంచి 8 వేల మంది కోటీశ్వరులు వలస వెళ్తారని అంచనా
- వలస వెళ్తున్న పెట్టుబడిదారుల తొలి చిరునామా యూఏఈ
- తర్వాత స్థానంలో ఆస్ట్రేలియా
- ఇప్పటికే వీసా నిబంధనలను సరళతరం చేసిన యూఏఈ
- గత రెండు దశాబ్దాల్లో పలు దేశాల నుంచి ఆస్ట్రేలియాకు వలస వెళ్లిన 80 వేల మంది కోటీశ్వరులు

14 లో

హెన్లీ గ్లోబల్ సిటిజన్ రిపోర్టు వెల్లడి

ఇదండీ సంగతి



క్లుప్తంగా

సజావుగా ధాన్యం సేకరణ

పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి



సాక్షి, అమరావతి: ధాన్యం సేకరణలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ధాన్యం సేకరణలో ఈసారి నుంచి సరికొత్త విధానం అమలు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ధాన్యం సేకరణ విషయంలో అక్కడక్కడా తలెత్తుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ, పౌర సరఫరాల శాఖల ఉన్నతాధికారులతో ఆదివారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించి 21 రోజుల్లోనే నగదు చెల్లిస్తున్నామని చెప్పారు. కనీస మద్దతు ధరతో పాటు గోనె సంచుల డబ్బులు, హమాలీ చార్జీలు నేరుగా రైతుల అకౌంట్లలో జమ చేస్తున్నామని వివరించారు.

ప్రభుత్వ ఆదేశాలు ధిక్కరిస్తే క్రిమినల్ చర్యలు

ఈ క్రాప్ ద్వారా నమోదు చేసుకున్న రైతులు తమ పంటను నేరుగా ఆర్బీకేల వద్దకు తీసుకుని రావాలని మంత్రి కారుమూరి సూచించారు. రైస్ మిల్లర్ల వద్దకు వెళ్లవద్దని చెప్పారు. ధాన్యం సేకరణ విషయంలో మిల్లర్ల జోక్యం తగదని.. ఈ మేరకు ఇప్పటికే వారికి ఆదేశాలు ఇచ్చామని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాలను ధిక్కరిస్తే మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి వారిని బ్లాక్ లిస్టులో పెడతామన్నారు. ఆర్బీకేల ద్వారా సేకరించిన ధాన్యాన్ని మాత్రమే మిల్లింగ్ చేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆర్బీకేల్లో అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట ఆర్బీకేల సంఖ్యను పెంచాలన్నారు. గత ముఖ్యమంత్రుల కన్నా సీఎం జగన్ రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. రైతుల ముసుగులో కొందరు ధాన్యం సేకరణ విషయంలో రాజకీయం చేస్తున్నారని, అలాంటి వారిని ఉపేక్షించమని హెచ్చరించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల సంస్థ ఎండీ జి.వీరపాండ్యన్, పశ్చిమ గోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

బస్సు డ్రైవర్‌కు ఫిట్స్

- ఇంటిపైకి దూసుకెళ్లిన బస్సు
- బాలుడి మృతి

శృంగవరపుకోట: బస్సు నడుపుతున్న డ్రైవర్‌కు ఆకస్మికంగా ఫిట్స్ రావడంతో స్టీరింగ్‌పై పడిపోయాడు. బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ ఇంటిని, బాలుడిని ఢీకొట్టింది. బాలుడు మృతిచెందగా, ఇంటి వద్ద ఉన్న మరో మహిళకు గాయాలయ్యాయి. ఎస్.కోట ఆర్టీసీ డిపో నుంచి ఆదివారం ఉదయం విజయనగరం బయలుదేరిన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు ధర్మవరం శివారు మారుతీనగర్ మలుపు వద్దకు వచ్చేసరికి డ్రైవర్ గంగునాయుడుకు ఒక్కసారిగా ఫిట్స్ వచ్చింది. డ్రైవర్ స్టీరింగ్‌పై పడిపోవడంతో బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న ఇంటిపైకి దూసుకుపోయింది. ఇంటి ముందు ఉన్న బాలుడు శిరికి అభిషేక్ (12)ను, సమీపంలో వంట చేస్తున్న తొత్తడి పాపను ఢీకొట్టింది. అభిషేక్‌ను 108లో ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పాపకు కూడా గాయాలయ్యాయి.

నేటి భవితలో..



- కెరీర్ ట్రెండ్స్: ఈవీ రంగం..కొలువుల తరంగం: ఈవీ.. ఎలక్ట్రిక్ వాహన రంగం. ప్రపంచవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తోంది. మన దేశంలోనూ రోజురోజుకీ విద్యుత్ వాహనాల సంఖ్య పెరుగుతోంది! ఫలితంగా ఈ రంగంలో వేల సంఖ్యలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తున్న పరిస్థితి! ఈ నేపథ్యంలో..ఎలక్ట్రిక్ వాహన రంగంలో తాజా ట్రెండ్స్, కెరీర్ అవకాశాలు, అవసరమైన నైపుణ్యాలు తదితర అంశాలపై విశ్లేషణ..
- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్: అంతర్జాతీయం,జాతీయం,రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ, క్రీడలు తదితర వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండ్ అప్..
- విద్య, ఉద్యోగ సమాచారం

నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కలివి కోడి జాడేది

- ప్రపంచంలోనే అత్యంత అరుదైన పక్షి
- లంకమల అడవుల్లోని కలివి పొదలే వీటి ఆవాసం
- పదేళ్ల క్రితం దీన్ని చూసిన ఎస్వీ యూనివర్సిటీ బృందం
- ఆ పక్షి పాద ముద్రలు, కూతను నమోదు చేసిన బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ
- రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీతో దీనిని కనుగొనే అవకాశం
- కలివి కోడిని పరిరక్షించాలంటున్న పర్యావరణ ప్రేమికులు



వైఎస్సార్ జిల్లాలో ఓ వైపు శేషాచలం.. మరోవైపు నల్లమల అడవులు విస్తరించి ఉన్నాయి. అదే జిల్లాలోని సిద్ధవటం-బద్వేలు ప్రాంత అడవిని 'లంకమల'గా పిలుస్తారు. ప్రపంచంలో ఎక్కడా కనిపించని ఓ పక్షి 'ట్విక్-టూ.. ట్విక్-టూ' అని అరుస్తోంది. ఎంత అన్వేషించినా దాని జాడ మాత్రం కనిపించడం లేదు. ఈ ప్రాంతంలో పెరిగే కలివి పొదల్లో నివసించే ఈ నిశాచర పక్షిని 'కలివి కోడి' అని పిలుస్తున్నారు. ఈ పక్షి జాతి పూర్తిగా అంతరించిపోయిందని ప్రపంచ పక్షిశాస్త్ర నిపుణులు తేల్చేయగా.. ఇప్పటికీ సిద్ధవటం అటవీ ప్రాంతంలోని పొదల్లో ఇవి సజీవంగా ఉన్నాయని ఎస్వీ యూనివర్సిటీ బృందం చెబుతోంది. రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీతో కలివి కోడి జాడను కనిపెట్టవచ్చంటోంది. కలివికోడి ఆవాసం కోసం సిద్ధవటం ప్రాంతంలో సుమారు 3 వేల ఎకరాలను రూ.28 కోట్లతో సేకరించి 177 కెమెరాలతో పరిశోధకులు అన్వేషిస్తున్నారు.

సాక్షి, అమరావతి: 'కలివి కోడి'.. నిజానికి ఇది కోడి కాదు. కానీ.. ప్రపంచంలోనే అత్యంత అరుదైన పక్షి. రంగు రంగుల ఈకలు.. చిన్నపాటి ఆకారం.. వినసొంపైన కూతలతో ఆకట్టుకునే కలివి కోడి (జర్డాన్స్ కోర్సర్) సంక్షోభంలో పడింది. అత్యంత అరుదైన ఈ పక్షి అంతరించిపోతున్న జాతుల్లో మొదటి స్థానంలో ఉంది. మన రాష్ట్రంలోని లంకమల అడవుల్లో తప్ప ప్రపంచంలో మరెక్కడా కలివి కోడి కనిపించదు. ఇది వందేళ్ల క్రితమే అంతరించిపోయిందని ప్రపంచ పక్షి శాస్త్రవేత్తలు భావించినా.. లంకమల అడవుల్లో ఇంకా సంచరిస్తూనే ఉందని అడపాదడపా వార్తలు వెలువడుతున్నాయి. వైఎస్సార్ జిల్లా రెడ్డిపల్లి ప్రాంతంలోని చిట్టడవుల్లో వీటి జాడ కనిపించడంతో ఆ ప్రాంతాన్ని లంకమల్లేశ్వర అభయారణ్యం పేరిట కలివికోడి నివాసంగా ప్రభుత్వం ప్రకటించింది.

రెండేళ్లపాటు శోధించినా..

కలివి కోళ్ల ఆచూకీ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.50 కోట్లు ఖర్చు చేసి రెండేళ్లపాటు అలుపెరగని ప్రయత్నాలు జరిపినా ఫలితం కనిపించలేదని ఎస్వీ వర్సిటీ జువాలజీ విభాగానికి చెందిన మాణిక్యం తెలిపారు. అన్నీ కాలాలు, అన్ని ప్రాంతాల్లో శోధించి, పరిశోధనలు చేస్తే తప్ప కలివి కోడి పూర్తిగా అంతరించిందని చెప్పలేమంటున్నారు. లంకమల అభయారణ్యంలోని వీటి ఆవాసాలను పోలిన ఆవాసాలు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకుని సమగ్ర సర్వే చేస్తే ఈ పక్షి జాతిని గుర్తించే అవకాశం ఉందని పరిశోధకులు భావిస్తున్నారు. ఈ పక్షి కోసం అన్వేషణను కొనసాగించి.. వీటిని పరిరక్షించడం అందరి బాధ్యతని పక్షి ప్రేమికులు చెబుతున్నారు.

పగలు నిద్రించి.. రాత్రి వేటాడుతుంది

వీటి జాడ 2002 తర్వాత కనిపించలేదు. ఈ పక్షుల సమగ్ర గణన సైతం జరగలేదు. రిమోట్ సెన్సింగ్ టెక్నాలజీతో వీటి ఆవాసాల్లో గత రెండు దశాబ్దాలుగా వచ్చిన మార్పులను గమనిస్తే.. అరుదైన ఈ పక్షి జాతి ఉనికిని తెలుసుకునే అవకాశం ఉంటుందని తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ జువాలజీ ప్రొఫెసర్ ఎం.రాజశేఖర్ అభిప్రాయపడ్డారు. ఈ పక్షి ముదురు గోధుమ రంగులో.. పొడవాటి కాళ్లతో ఉంటుంది. మెడలో రెండు వెండి గొలుసుల వంటి చారలతో ఉంటుంది. ఇతర పక్షుల్లా ఎత్తుకు ఎగరలేవు. పగటిపూట నిద్రపోతూ.. రాత్రి పూట ఆహార సేకరణ కోసం బయటకు వస్తాయి. 2 నుంచి 10 అడుగుల ఎత్తు వరకు కలివి పొదలు (ముళ్లతో ఉండేవి) వీటి ఆవాసాలు. పొదల మాటున దాగి ఉంటూ వాటి మధ్యలోని ఖాళీ ప్రదేశాల నుంచి ఆహారాన్ని సేకరిస్తాయి. చెదలు, పురుగులు, చీమలు, కీటకాలను తింటూ పంట పొలాలకు వ్యాధుల రాకుండా సంరక్షించడంతో పాటు పర్యావరణ సమతుల్యతకు ఇవి దోహదపడతాయి. ఇవి గులక రాళ్లను సేకరించి.. వాటి మధ్యలో గుడ్లు పెట్టి ఇతర జంతువులు గుర్తించకుండా జాగ్రత్తపడతాయి.

పదేళ్ల క్రితం కడపటి చూపు

కలివి కోడిని 1848లో పెన్నా నది పరీవాహక ప్రాంతంలో థామస్ జర్డాన్స్ మొదటిసారి కనుగొన్నారు. 1985 జనవరి 5న అట్లూరు మండలం రెడ్డిపల్లె వాసి చిన్న ఐతన్నకు ఈ పక్షి కనిపించగా.. దాన్ని పట్టుకుని అటవీ అధికారులకు అప్పగించారు. ఈ విషయం తెలిసి ప్రఖ్యాత పక్షి శాస్త్రవేత్త సలీం అలీ వెంటనే వచ్చి ఆ పక్షిని పరిశీలించారు. 1998 నుంచి 2002 వరకు తిరుపతి ఎస్వీ విశ్వవిద్యాలయం జంతు శాస్త్ర విభాగం పరిశోధకులు ప్రొఫెసర్ నందకుమార్, అమీర్‌బాషా, మారం రాజశేఖర్ బృందం దాదాపు 8 పక్షులను గుర్తించింది. వీటి ఆవాసాన్ని రిమోట్ సెన్సింగ్ విధానంలో పరిశీలించి ఏ పరిసరాల్లో ఎక్కువగా ఉంటాయి, వాటి అభివృద్ధికి అక్కడ చేయాల్సిన మార్పులు ఏమిటనేది ఆ బృందం సూచించింది. ఆ తర్వాత 2002లో కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం, రాయల్ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ బర్డ్స్ సహకారంతో బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ కలివి కోడి పాద ముద్రను, కూతను నమోదు చేసింది. ఈ పక్షి 'ట్విక్-టూ.. ట్విక్-టూ' అంటూ అరుస్తుంది.

రాజకీయాల్లో రాణించడం కష్టం



ఆత్మీయ సమ్మేళనంలో చిరంజీవి సెల్ఫీ

- అనాలి.. అనిపించుకోవాలి..
- ఒక దశలో అవి నాకు అవసరమా అనిపించింది
- ఈ రాజకీయాలకు పవన్ తగిన వాడు
- నా మనసును ఆకట్టుకోలేకపోయిన దానికి దూరంగా ఉన్నా
- పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో సినీ నటుడు చిరంజీవి

హైదరాబాద్: 'రాజకీయాల్లో అనాలి. అనిపించుకోవాలి. కటువుగా మాట్లాడాలి. ప్రస్తుత రాజకీయాల్లో రాణించడం చాలా కష్టం. అందుకే ఒక దశలో నాకు రాజకీయాలు అవసరమా.. అనిపించింది. ఈ రాజకీయాలకు పవన్ తగిన వాడు. ఏదో ఒక రోజు ఆయన్ను ఉన్నత స్థాయిలో చూస్తాం' అని సినీ నటుడు చిరంజీవి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగిన వైఎన్ఎం కళాశాల (పశ్చిమగోదావరి జిల్లా నర్సాపురంలోని కాలేజీ) పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో చిరంజీవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను ఏది తీసుకున్నా, ఆ విషయంలో తప్పక రాణిస్తానని.. అది తన నైజమని చెప్పారు. అయితే తన మనసును అంతగా ఆకట్టుకోలేక పోయిన దానికి తాను దూరంగా ఉన్నానని, అదేంటో మీకందరికీ తెలుసని అన్నారు. తనతో కలిసి చదివిన వారు, నాటి అధ్యాపకులను కలిసి గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం వాల్తేరు వీరయ్య సినిమా చిత్రీకరణ శరవేగంగా సాగుతోందని.. దానితో ఈ కార్యక్రమానికి రావడం కుదురుతుందో లేదో అనుకున్నానని చెప్పారు. ఈ కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉందన్నారు.

'రాజీనామా' నాటకంతో..

కాలేజీలో చదువుకునే రోజుల్లోనే మన లక్ష్యాలకు విత్తనం పడుతుందని, తన విషయంలోనూ అదే జరిగిందని చిరంజీవి గుర్తు చేసుకున్నారు. తనకు నటన పట్ల మక్కువ ఉండటం, ఆ సరదాతో కాలేజీలో 'రాజీనామా' అనే నాటకంలో నటించడం, దానికి ఉత్తమ నటుడి అవార్డు రావడం.. తన ప్రస్థానానికి పునాదులని వివరించారు. తనకు అప్పుడే అభిమానులు మొదలయ్యారని చెప్పారు. ఎన్‌సీసీలో సీనియర్ కెప్టెన్ పొజిషన్ వరకు వెళ్లానని, 1976లో రిపబ్లిక్ డే సందర్భంగా ఏపీ తరఫున రాజ్‌పథ్‌లో మార్చింగ్ చేశానని గుర్తు చేసుకున్నారు. అలా తనకు మంచి క్రమశిక్షణ అలవడిందని చెప్పారు. డ్యాన్స్ విషయంలో తనకెవ్వరూ గురువులు లేరని, అయినా తాను బెస్ట్ డ్యాన్సర్ అయ్యానని అందరూ అంటుంటారన్నారు.

చిరంజీవికి అరుదైన గౌరవం

పణజి: ప్రఖ్యాత సినీ నటుడు, నిర్మాత చిరంజీవి (67)కి మరో అరుదైన గౌరవం దక్కింది. గోవాలో ఆదివారం ప్రారంభమైన 53వ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ)లో 'ఇండియా ఫిలిం పర్సనాలిటీ ఆఫ్ ద ఇయర్-2022'అవార్డుకు చిరంజీవిని ఎంపిక చేశారు. ఈ విషయాన్ని కేంద్ర సమాచార, ప్రసారశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ ప్రకటించారు. చిరంజీవికి ట్విట్టర్‌లో అభినందనలు తెలియజేశారు. నాలుగు దశాబ్దాల సినీ జీవితంలో 150కిపైగా చిత్రాల్లో నటించారని, గొప్ప డ్యాన్సర్‌గా అభిమానులను అలరించారని కొనియాడారు. అద్భుతమైన నటనతో ప్రజల హృదయాలను గెలుచుకున్నారంటూ చిరంజీవిపై ప్రశంసల వర్షం కురిపించారు. ఇండియా ఫిలిం పర్సనాలిటీ ఆఫ్ ద ఇయర్ పురస్కారానికి తనను ఎంపిక చేసినందుకు గాను చిరంజీవి భారత ప్రభుత్వానికి ట్విట్టర్‌లో కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ గౌరవం దక్కడం చాలా సంతోషం కలిగిస్తోందని పేర్కొన్నారు. తన అభిమానులకు సైతం కృతజ్ఞతలు తెలిపారు. వారి ఆశీస్సులు, ప్రేమ వల్లే తాను ఈ స్థాయికి చేరుకున్నానని వెల్లడించారు. 1978లో సినీ రంగంలో అడుగుపెట్టిన చిరంజీవి తెలుగు, తమిళ, కన్నడ, హిందీ చిత్రాల్లో నటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ప్రతిష్టాత్మక రఘుపతి వెంకయ్య అవార్డు అందుకున్నారు. దేశంలో మూడో అత్యున్నత పౌర పురస్కారమైన 'పద్మభూషణ్' 2006లో చిరంజీవిని వరించింది. ఆంధ్రా విశ్వవిద్యాలయం ఆయనను గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. చిరంజీవి 2012 నుంచి 2014 వరకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా సేవలందించారు.

ఆక్వా వర్సిటీ.. ఫిషింగ్ హార్బర్

నరసాపురంలో అభివృద్ధి పనులకు నేడు సీఎం జగన్ ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్ ఆక్వా విశ్వవిద్యాలయానికి, బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్‌కు, రూ.1,400 కోట్లతో జిల్లా రక్షిత నీటి సరఫరా ప్రాజెక్టులకు శంకుస్థాపన, నరసాపురం ప్రాంతీయ వైద్యశాల నూతన భవనానికి ప్రారంభోత్సవం చేయనున్నారు. అనంతరం బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. నేడు సీఎం శంకుస్థాపన చేయనున్న ఆంధ్రప్రదేశ్ ఆక్వా విశ్వవిద్యాలయం దేశంలోనే మూడవది కానుంది. ఇప్పటి వరకు తమిళనాడు, కేరళలో మాత్రమే ఈ వర్సిటీలు ఉన్నాయి. ఆక్వా వర్సిటీ కోసం నరసాపురం పరిసర ప్రాంతాల్లోని సరిపల్లి, లిఖితపూడి గ్రామాల మధ్య 40 ఎకరాల భూమిని ఇప్పటికే కేటాయించారు. భవన నిర్మాణ పనుల కోసం రూ.332 కోట్ల అంచనా వ్యయంతో డీపీఆర్ ఆమోదించారు. మొదటి దశలో పరిపాలన భవనంతో పాటు విద్యార్థులకు వసతి గృహాలు, విశ్వవిద్యాలయం నిర్మాణానికి రూ.100 కోట్లు మంజూరు చేశారు. 2022-23 బడ్జెట్‌లో విశ్వవిద్యాలయ నిర్మాణ పనులకు రూ.40 కోట్లు కేటాయించారు. రెండవ దశ పనుల్లో భాగంగా నరసాపురం మండలం బియ్యపుతిప్ప గ్రామంలో 350 ఎకరాలలో రూ.222 కోట్ల అంచనా వ్యయంతో విశ్వవిద్యాలయ సముద్రతీర ప్రాంగణం, పరిశోధన కేంద్రం నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటు ద్వారా మత్స్యకారులు, ఆక్వా రైతులు ఎక్కువగా ప్రయోజనం పొందనున్నారు. వృత్తిపరంగా అర్హత కలిగిన మానవ వనరుల లభ్యత కారణంగా ఆక్వా రంగంలో నష్టాలను చాలా వరకు తగ్గించవచ్చు. తద్వారా దాదాపు సంవత్సరానికి రూ.4,000 నుంచి 5,000 కోట్ల ఆర్థిక ప్రయోజనం ఆక్వా రైతులకు చేకూరుతుంది. అవసరమైన సంఖ్యలో ఫిషరీస్ డిప్లొమా, బీఎఫ్ఎస్సీ, ఎంఎఫ్ఎస్సీ, పీహెచ్‌డీ అర్హత గల అభ్యర్థులను తయారు చేయడానికి ఆక్వా యూనివర్సిటీ ఆధ్వర్యంలో మరిన్ని కొత్త మత్స్య కళాశాలలు, మత్స్య పాలిటెక్నిక్ కళాశాలలు ప్రారంభించే ప్రతిపాదనలు కూడా ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.

అగ్రికల్చర్ కంపెనీ భూ అనుభవదారులకు హక్కులు

నరసాపురం మండలం నందలి వేములదీవి ఉప గ్రామమైన దర్బరేవు గ్రామంలో నాటి బ్రిటీష్ ప్రభుత్వం 1921లో 1,754 ఎకరాల భూమిని నరసాపురం అగ్రికల్చర్ కంపెనీ లిమిటెడ్‌కు 99 సంవత్సరాలు లీజుకు ఇచ్చింది. ఆ రోజు నుంచి 1,623 మంది రైతులు ఆ భూమి స్వాధీన అనుభవంలో ఉండి వ్యవసాయం చేసుకుంటున్నారు. కానీ రైతులకు ఎటువంటి భూ యాజమాన్య హక్కులు కానీ, రెవెన్యూ రికార్డు పరమైన హక్కులు కానీ లేవు. అందువల్ల ఆ భూమిని అమ్మడానికి లేదా బ్యాంకులలో తనఖా పెట్టి ఋణం పొందడానికి అర్హత లేదు. అయితే వైఎస్ జగన్ ప్రభుత్వం జీవో జారీ చేసి, ఎకరాకు రూ.100 ధర నిర్ణయించి, ఆ 1,623 మంది రైతులకు భూ యాజమాన్య, రెవెన్యూ రికార్డు పరమైన సర్వహక్కులు కల్పించింది. దీంతో రైతులు వారి వారసులు నిరభ్యంతరంగా స్వాధీనములో ఉండి ఆ భూములను అనుభవించుకోవచ్చు. అవసరాల నిమిత్తం అమ్ముకోవచ్చు. తనఖా పెట్టి ఋణాలు కూడా పొందవచ్చు. ఇందుకు సంబంధించిన హక్కు పత్రాలను సీఎం జగన్ నేడు రైతులకు అందజేయనున్నారు.

6,000 మంది మత్స్యకారులకు లబ్ధి

బియ్యపుతిప్ప వద్ద 150 ఎకరాల విస్తీర్ణంలో రూ.429.43 కోట్ల అంచనాతో ఫిషింగ్ హార్బర్ నిర్మించేందుకు ప్రభుత్వం ఇప్పటికే జీవో జారీ చేసింది. ఈ హార్బర్ నిర్మాణం ద్వారా మత్స్యకారులు అత్యంత సామర్థ్యం గల మోటారు బోట్లలో సముద్రంలో ఎక్కువ దూరం వేటకు వెళ్లేందుకు వీలుంటుంది. మార్కెటింగ్ సౌకర్యాలను పెంపొందించడం ద్వారా మత్స్య పరిశ్రమ అభివృద్ధికి అవసరమైన అన్ని ఏర్పాట్లను ప్రభుత్వం పూర్తి చేసింది. ఈ హార్బర్ నిర్మించే ప్రదేశం నరసాపురం పట్టణానికి 14 కి.మీ. దూరంలో ఉంది. దీనివల్ల నరసాపురం, మొగల్తూరు మండలాలకు చెందిన 6,000 మంది మత్స్యకారులు లబ్ధి పొందనున్నారు.

కొల్లేటికి సముద్రపు నీటి నుంచి రక్ష

సముద్రపు నీరు కొల్లేరు సరస్సులోకి చొరబడకుండా నిరోధించడానికి, కొల్లేరులో 5వ కాంటూర్ వరకు మంచి నీరు నిలువ ఉండే విధంగా ఉప్పుటేరు నదిపై కిలోమీటరు 57.950 వద్ద మొల్లపర్రు విలేజ్ లిమిట్స్‌లో రూ. 188.40 కోట్ల అంచనా వ్యయంతో రెగ్యులేటర్ కమ్ బ్రిడ్జ్ కమ్ లాక్ నిర్మాణం కొరకు రూపొందించిన ప్రణాళికను ప్రభుత్వం ఆమోదించింది. దీంతో ముఖ్యమంత్రి జగన్ నేడు దీనికి శంకుస్థాపన చేయనున్నారు.

సురక్షిత తాగునీరివ్వడమే లక్ష్యంగా..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఆక్వాకల్చర్ వల్ల, తీర ప్రాంతంలో ఉప్పు నీటి సాంద్రత వల్ల ఏర్పడిన తీవ్ర తాగునీటి ఎద్దడి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి ప్రభుత్వం రూ.1,400 కోట్లతో రక్షిత నీటిసరఫరా ప్రాజెక్ట్‌ను మంజూరు చేసింది. విజ్జేశ్వరం జలాశయం నుండి గోదావరి నీటిని రాపిడ్ శాండ్ ఫిల్టర్ల ద్వారా శుద్ధి చేసి, పైప్ లైన్ల ద్వారా సరఫరా చేస్తుంది. ఈ పథకం ద్వారా నూతన జిల్లాలు పశ్చిమ గోదావరి, ఏలూరు, తూర్పు గోదావరిలోని నిడుదవోలు, తణుకు, ఆచంట, పాలకొల్లు, నరసాపురం, భీమవరం, ఉండి, ఉంగుటూరు, ఏలూరు (పార్ట్), తాడేపల్లిగూడెం(పార్ట్) నియోజకవర్గాల ప్రజలకు, కృష్ణా జిల్లాలోని కృత్తివెన్ను, బంటుమిల్లి, పెడన, గుడ్లవల్లేరు మండలాల ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరా చేయొచ్చు. ఈ పథకానికి నేడు సీఎం శంకుస్థాపన చేయనున్నారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి

ఇవీ ప్రారంభోత్సవాలు

- నరసాపురం పట్టణం మధ్యలో ఉన్న ప్రాంతీయ వైద్యశాల ఇటీవలే 100 పడకల స్థాయికి అప్‌గ్రేడ్ అయింది. అందువల్ల చుట్టుపక్కల గ్రామాలలో నివసించే 2 లక్షల మందికి వైద్య సదుపాయాలు, సేవలు అందిస్తోంది. ఇప్పుడు అదే ఆస్పత్రిలో నూతనంగా మాతా శిశు సంరక్షణ విభాగం ఏర్పాటు చేశారు. రూ.13 కోట్లతో ఈ భవనాన్ని నిర్మించారు.
- నరసాపురం పట్టణంలో మంచి నీటి ఎద్దడి నివారణకు రూ.61.81 కోట్లతో నీటి సరఫరా అభివృద్ధి పథకం చేపట్టి పూర్తి చేశారు. ఈ పథకం వల్ల రాబోయే 30 ఏళ్ల వరకు నరసాపురం పట్టణానికి మంచి నీటి సరఫరాకు ఎటువంటి సమస్యా ఉండదు.

ఇంకా శంకుస్థాపనలు ఇలా..

- రూ.4 కోట్ల వ్యయంతో నరసాపురం బస్‌స్టేషన్ పునరుద్ధరణ పనులు.
- రూ.1.08 కోట్ల అంచనాతో నరసాపురం డివిజినల్ ఉప ఖజానా కార్యాలయం కొత్త భవన నిర్మాణం.
- రుస్తుంబాద గ్రామంలో రూ.132.81 కోట్లతో 220/132/33 కె.వి సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు.
- నరసాపురం పురపాలక సంఘం పరిధిలో రూ.237 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణం. రూ.87 కోట్లతో మొదటి ఫేజ్ పనులు.
- రూ.26.32 కోట్లతో వశిష్ఠ వారధి - బుడ్డిగవాని రేవు ఏటి గట్టు పటిష్టం.
- రూ.7.83 కోట్ల అంచనా వ్యయంతో చివరి గ్రామాలకు సాగు, తాగునీటి సౌకర్యాలు కల్పించేందుకు శేషావతారం పంట కాలువ అభివృద్ధిలో భాగంగా ఛానల్ డీ సిల్టింగ్, టెయిల్ డ్యామ్ నిర్మాణం, సీసీ లైనింగ్ పనులు.
- రూ.24.01 కోట్లతో మొగల్తూరు వియర్ పంట కాలువ నిర్మాణం.
- రూ.8.83 కోట్లతో కాజ, ఈస్ట్ కొక్కిలేరు, ముస్కేపాలెం అవుట్‌ఫాల్ నాలుగు స్లూయిస్‌ల పునః నిర్మాణం.

సీఎం జగన్ పర్యటన ఇలా

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సోమవారం ఉదయం 10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 10.50 గంటలకు నరసాపురం చేరుకుంటారు. 11.15 - 12.50 మధ్య వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేస్తారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఆ తర్వాత తిరిగి తాడేపల్లికి యలుదేరుతారు.

గొంతు నులిమి చంపి..6 ముక్కలుగా కోశాడు

- రిటైర్డు నేవీ అధికారిని చంపిన కొడుకు
- పరీక్ష ఫీజుకు డబ్బులివ్వలేదని గొడవ

బరుయిపూర్: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఢిల్లీలో జరిగిన దారుణం మరువకమునుపే అటువంటిదే బెంగాల్‌లోనూ చోటుచేసుకుంది. పెళ్లి చేసుకోవాలని పట్టుబట్టిన శ్రద్ధా వాకర్ అనే యువతిని సహజీవనం చేస్తున్న అఫ్తాబ్ 35 ముక్కలుగా నరికి చంపగా.. బెంగాల్ యువకుడు చిత్రహింసలు పెడుతూ పరీక్ష ఫీజుకు డబ్బులివ్వ లేదని తన తండ్రిని 6 ముక్కలుగా కోసి వేర్వేరు చోట్ల పడేశాడు. ఈ నెల 12వ తేదీన ఈ ఘోరం జరిగింది. కోల్‌కతా మెట్రోపాలిటన్ పరిధిలోని 24 పరగణాల జిల్లాకు చెందిన ఉజ్జల్ చక్రవర్తి(55) 12 ఏళ్ల క్రితం నేవీ నుంచి రిటైరయ్యారు. ఈయనకు భార్య, కొడుకు ఉన్నారు. పాలిటెక్నిక్ కార్పెంటరీ కోర్సు చేస్తున్న తన కొడుక్కి పరీక్ష ఫీజు రూ.3 వేలు ఇచ్చే విషయంలో ఈనెల 12వ తేదీన ఇంట్లో ఘర్షణ చోటుచేసుకుంది. చక్రవర్తి కొడుకును చెంపపై కొట్టాడు. బదులుగా కొడుకు ఆయన్ను వెనక్కి తోసేశాడు. తలకు కుర్చీ బలంగా కొట్టుకోవడంతో చక్రవర్తి స్పృహ కోల్పోయాడు. అనంతరం కొడుకు తండ్రిని గొంతు నులిమి చంపాడు. తదుపరి బాత్‌రూంలోకి శవాన్ని లాక్కెళ్లాడు. కార్పెంటరీ కోర్సు కిట్ బ్యాగ్‌లో ఉండే రంపంతో తండ్రి శరీరాన్ని ఆరు ముక్కలుగా కోసేశాడు. ప్లాస్టిక్ బ్యాగ్‌లో ఆరు భాగాల్ని ఆరు సార్లు సైకిల్‌పై అర కిలోమీటర్ దూరంలోని వేర్వేరు ప్రాంతాల్లో పడేశాడు. చక్రవర్తి కనిపించడం లేదంటూ ఇద్దరూ కలిసి బరుయిపూర్ పోలీస్ స్టేషన్‌కు ఈ నెల 15వ తేదీన తెల్లవారు జామున ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. అనుమానం వచ్చిన పోలీసులు గట్టిగా ప్రశ్నించడంతో అసలు నిజం కక్కారు. వారిద్దరినీ అరెస్ట్ చేసి, విచారణ చేపట్టారు. కొన్ని శరీర భాగాలను స్వాధీనం చేసుకుని, మిగతా వాటి కోసం గాలిస్తున్నారు.

క్లుప్తంగా

బీసీలను చంద్రబాబు ఓటు బ్యాంకుగానే చూస్తున్నారు

- చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కోరుతూ 24న పార్లమెంట్ ముట్టడి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



మాట్లాడుతున్న బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య

ఏలూరు (టూటౌన్): బీసీలను సీఎం వైఎస్ జగన్ కుటుంబ సభ్యులుగా చూస్తూ వారి అభ్యున్నతి కోసం కృషి చేస్తుంటే.. ప్రతిపక్ష నేత చంద్రబాబు మాత్రం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య అన్నారు. ఏలూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ 24న పార్లమెంట్ ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని 16 పార్టీలు ఇప్పటికే మద్దతిచ్చాయని, మద్దతివ్వని పార్టీలను దేశం నుంచి తరిమికొట్టాలని, వచ్చే ఎన్నికల్లో ఓడించాలని పిలుపునిచ్చారు. దేశంలో బీసీ ప్రధాన మంత్రిగా ఉన్న నరేంద్ర మోదీకి తుపాకీ అయితే ఇచ్చారు గానీ, అందులో గోళీలు లేవంటూ ఎద్దేవా చేశారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఏపీలో సీఎం వైఎస్ జగన్ బీసీల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ వారిని అక్కున చేర్చుకుంటున్నారని కొనియాడారు. గత పాలకులు బీసీలను తమకు వెన్నెముక అంటూ ప్రకటనలు చేస్తూనే.. వారికి వెన్నెముక లేకుండా చేసేశారని, దానికి భిన్నంగా సీఎం జగన్ బీసీల పట్ల తన కున్న ప్రేమాభిమానాలు చాటుకుంటున్నారని చెప్పారు. బీసీ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా హేమవరపు సురేష్‌ను నియమిస్తున్నట్టు కృష్ణయ్య ప్రకటించారు.

బాబు రాజకీయ జీవితం ముగిసింది

- ఫ్రస్ట్రేషన్‌తో ఇష్టానుసారం మాట్లాడుతున్నారు
- ప్రజలు 'ఇదేమి ఖర్మరా..బాబూ' అంటున్నారు
- వికేంద్రీకరణతోనే సమగ్రాభివృద్ధి
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



నెల్లూరు (సెంట్రల్): టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు రాజకీయ జీవితం ముగిసిందని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఏపీలో అధికారంలోకి రావడం అసాధ్యంగా కనిపించడంతో డిప్రెషన్‌కు లోనై ఫ్రస్ట్రేషన్‌తో వీధి రౌడీలా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల అభీష్టం మేరకు వికేంద్రీకరణలో భాగంగా కర్నూలును న్యాయ రాజధాని చేస్తుంటే, చంద్రబాబు మాత్రం నోటికొచ్చినట్లు మాట్లాడుతూ ప్రజలను రెచ్చగొడుతుండటం దారుణమని అన్నారు. కర్నూలులో బాబును రాజధానుల విషయంపై మేధావులు, ప్రజలు ప్రశ్నిస్తే గుడ్డలూడదీసి కొడతా.. నేనూ రౌడీనే అంటూ విరుచుకు పడడం చూస్తే ఆయన మానసిక స్థితి సరిగాలేదని తెలుస్తోందన్నారు.

సీబీఐని అడ్డుకున్నది చంద్రబాబే

ఆంధ్రప్రదేశ్‌లో సీబీఐ అడుగు పెట్టకుండా చీకటి జీఓను ఇచ్చింది చంద్రబాబే అని మంత్రి కాకాణి గుర్తు చేశారు. ప్రతి విషయంలో ఇప్పుడు సీబీఐ విచారణ జరిపించాలని అంటున్న చంద్రబాబు గతంలో ఈ జీఓ ఎందుకు ఇచ్చారో సమాధానం చెప్పాలని నిలదీశారు. తనపై ఒక కోర్టు కేసు విషయంలో ఆరోపణలు చేశారని, తాను ధైర్యంగా సీబీఐతో కూడా విచారణ జరిపించాలని కోర్టును కోరానన్నారు. చంద్రబాబుకు ధైర్యం ఉంటే ఆయనపై ఉన్న స్టేలను ఉపసంహరించుకుని సీబీఐ విచారణ కోరగలరా అని సవాల్ విసిరారు. చంద్రబాబు మాట్లాడే తీరు చూసి రాష్ట్రానికి ఇదేం ఖర్మరా.. బాబూ అని ప్రజలు ఈసడించుకుంటున్నారన్నారు. తెలుగుదేశానికి క్షేత్ర స్థాయిలో కేడర్ బాగోలేదని, వైఎస్సార్‌సీపీ గ్రామ స్థాయిలో కూడా గట్టిగా బలపడిందని టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో చర్చించుకున్నది వాస్తవం కాదా... అని ప్రశ్నించారు. తమతో పాటు టీడీపీ నేతలు కూడా గడప గడపకూ తిరిగితే సంక్షేమాభివృద్ధికి అర్థం తెలుస్తుందని చెప్పారు. తాము అధికారంలోకి వస్తే ఇప్పుడున్న పథకాలన్నీ కొనసాగిస్తామని చంద్రబాబు చెబుతున్నారని, అంటే ఈ పథకాలన్నీ బాగున్నాయని ఒప్పుకున్నట్టే కదా అని ప్రశ్నించారు. మూడు రాజధానులతో మరింత ప్రగతి సాధ్యమని మంత్రి పునరుద్ఘాటించారు.

భూగర్భ జలం పుష్కలం

నీటి సంరక్షణలో దేశంలో అగ్రగామి ఆంధ్రప్రదేశ్

- ఆర్నెల్లలో 2.5 మీటర్ల మేర పెరిగిన భూగర్భ జలాలు
- రాష్ట్రంలో ప్రస్తుతం భూగర్భ జలాల రూపంలో 961.61 టీఎంసీల లభ్యత
- వాడుకోదగ్గ జలాలు 913.23 టీఎంసీలు... వినియోగం 263.09 టీఎంసీలే
- 637 మండలాల్లో భూగర్భ జలాల పరిస్థితి సురక్షితం
- మరో 30 మండలాల్లో నీటి సంరక్షణ చర్యలు అవసరం

ఎండిన బోరు బావికి జీవకళ



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు భీమేష్. అనంతపురం జిల్లా పుట్లూరుకు చెందిన రైతు. ఆరు ఎకరాలు పొలం ఉంది. గతంలో 1,250 అడుగులు తవ్విన బోరు బావి ఎండిపోవడంతో పొలం బీడుగా మారింది. 2020 నాటికి పుట్లూరు మండలంలో భూగర్భ జలాలు ఆందోళనకర స్థాయికి పడిపోయాయి. మూడేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటం, వాన నీటిని ఒడిసిపట్టి చెరువులను నింపుతుండటంతో ఎండిన భీమేష్ బోరుబావికి జలకళ వచ్చింది. నాలుగు ఎకరాల్లో బత్తాయి, రెండు ఎకరాల్లో వేరుశెనగ సాగు చేసిన భీమేష్ రెండో పంటగా మొక్కజొన్న సాగుకు సిద్ధమయ్యాడు.



సాక్షి, అమరావతి: పాతాళగంగ పైపైకి వస్తోంది. ఎండిన బోరు బావుల నుంచి జలధారలు ఉబికి వస్తున్నాయి. రాష్ట్రంలో సగటున 5.83 మీటర్లు అంటే కేవలం 19.13 అడుగుల్లోనే నీళ్ల లభ్యమవుతుండటంతో భూగర్భ జల వనరులలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. పొదుపుగా వినియోగించుకోవడం ద్వారా భూగర్భ జలాల సంరక్షణలోనూ ప్రథమ స్థానంలో నిలిచింది. పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ పశ్చిమ ప్రాంతంలో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాల కోసం భారీగా తోడేస్తుండటంతో భూగర్భ జలమట్టాలు ఆందోళనకర స్థాయికి పడిపోయాయి. దేశ వ్యాప్తంగా భూగర్భ జలాలపై రాష్ట్రాల భూగర్భ జలవనరుల శాఖలు, కేంద్ర భూగర్భ జలమండలి విభాగం ఈ ఏడాది నిర్వహించిన సంయుక్త సర్వేలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. రాష్ట్రంలో 667 మండలాల పరిధిలో 1,669 ఫిజియో మీటర్ల ద్వారా భూగర్భ జలాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అధ్యయనం చేశారు.

జలసంరక్షణలో ఏపీ టాప్...

- నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల విస్తారంగా వర్షాలు పడటంతో దేశంలో భూగర్భ జలాలు సగటున 15,453.69 టీఎంసీలు పెరిగాయి. ఇందులో సగటున 14,058.06 టీఎంసీలను సాగు, తాగు, పారిశ్రామిక అవసరాల కోసం వాడుకోవచ్చు. అయితే 8,445.85 టీఎంసీలు (60.80 శాతం) మాత్రమే వినియోగిస్తున్నారు.
- రాష్ట్రంలో సగటున 741 మిల్లీమీటర్ల వర్షపాతానికిగానూ నైరుతి రుతుపవనాల కాలం ముగిసే నాటికి, అంటే అక్టోబర్ ఆఖరుకు 799.03 మి.మీ. వర్షపాతం కురిసింది. సాధారణ కంటే 7.9 శాతం అధిక వర్షపాతం కురిసింది. రుతుపవనాల కాలం ప్రారంభమయ్యే నాటికి అంటే 2022 మే 30 నాటికి రాష్ట్రంలో సగటున 8.33 మీటర్లలో భూగర్భ జలమట్టాలు ఉండగా రుతుపవనాలు తిరోగమించే అక్టోబర్ 31 నాటికి సగటున 5.83 మీటర్ల లోతులోనే నీళ్ల లభ్యమవుతున్నాయి. సగటున 2.5 మీటర్ల (8.21 అడుగులు) మేర రాష్ట్రంలో భూగర్భ జలమట్టం పెరిగింది.
- రాష్ట్రంలో ఈ ఏడాది భూగర్భ జలమట్టం అత్యధికంగా 5.56 మీటర్ల మేర శ్రీసత్యసాయి జిల్లాలో పెరిగింది. శ్రీకాకుళం జిల్లా రెండో స్థానం (4.82 మీటర్లు), ఏలూరు జిల్లా మూడో స్థానం (4.43 మీటర్లు)లో నిలవగా 0.62 మీటర్లు తగ్గడం ద్వారా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా చివరి స్థానంలో నిలిచింది.
- భూగర్భ జలాలు 637 మండలాలలో పుష్కలంగా లభ్యమవుతున్నాయి. మరో 19 మండలాల్లో జలమట్టం సమస్యాత్మకంగానూ, ఐదు మండలాల్లో అత్యంత సమస్యాత్మకంగానూ, ఆరు మండలాల్లో ఆందోళనకర స్థాయిలో ఉంది. ఈ ఆరు మండలాల పరిధిలోని 387 గ్రామాల్లో ఎడాపెడా భూగర్భ జలాలను తోడివేయడమే దీనికి కారణం.
- రాష్ట్రంలో భూగర్భ జలాలు 961.61 టీఎంసీల మేర పెరిగాయి. ఇందులో 913.23 టీఎంసీలను వివిధ అవసరాల కోసం వాడుకోవచ్చు. అయితే ఏటా సగటున 15 లక్షల బోరు బావుల ద్వారా సాగు, తాగు నీటి అవసరాల కోసం 263.09 టీఎంసీలు (28.8 శాతం) మాత్రమే వాడుకుంటున్నారు. దేశంలో సగటున 60.8 శాతం మేర భూగర్భ జలాలను వాడుకుంటుండగా, రాష్ట్రంలో 28.8 శాతం మాత్రమే వినియోగించుకుంటున్నారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భంలో భద్రపరచడం, పొదుపుగా వాడకం ద్వారా నీటి సంరక్షణలో ఏపీ అగ్రగామిగా నిలిచింది.

లభ్యతలో విజయనగరం ప్రథమ స్థానం

రాష్ట్రంలో భూగర్భ జలాల లభ్యతలో విజయనగరం జిల్లా తొలి స్థానంలో నిలవగా, ఏలూరు జిల్లా చివరి స్థానంలో ఉంది. కేవలం 1.99 మీటర్ల (6.5 అడుగులు)లో విజయనగరం జిల్లాలో భూగర్భ జలాలు లభిస్తున్నాయి. బాపట్ల జిల్లా రెండో స్థానంలో (2.21 మీటర్లు), డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మూడో స్థానంలో(2.33 మీటర్లు) నిలిచాయి. గోదావరి పరీవాహక ప్రాంతంలోని ఏలూరు జిల్లాలో భూగర్భ జలమట్టం 17.94 మీటర్లకు (58.85 అడుగులు) దిగజారడం గమనార్హం. తీవ్ర వర్షాభావ ప్రాంతంలోని రాయలసీమ కంటే ఏలూరు జిల్లాలో భూగర్భ జలాల లభ్యత తక్కువగా ఉంది.

క్యాన్సర్ నియంత్రణకు స్క్రీనింగ్ అస్త్రం

- స్క్రీనింగ్ ద్వారా వ్యాధి ప్రారంభదశలోనే గుర్తింపు
- హెచ్ఐవీ బాధిత, హైరిస్క్ మహిళలకు స్క్రీనింగ్ ప్రారంభం
- రాజమహేంద్రవరం, పెద్దాపురాల్లో మొదలు
- దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరణ



సాక్షి, అమరావతి: మానవాళిని కబళిస్తున్న ప్రమాదకరమైన వ్యాధుల్లో క్యాన్సర్ ప్రధానమైనది. ఈ వ్యాధి కారణంగా దేశంలో 2018–2020 మధ్య 22 లక్షలకుపైగా మరణాలు సంభవించాయి. రాష్ట్రంలో ప్రతి లక్షమందిలో 120 మంది క్యాన్సర్ వ్యాధి బారినపడుతున్నట్టు అంచనా. ఈ క్రమంలో క్యాన్సర్ వ్యాధి నియంత్రణ, అధునాతన చికిత్సలకు వసతుల కల్పనపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ ప్రత్యేకదృష్టి సారించింది. తొలిదశలో ఏడు వైద్యకళాశాలల్లో ఈ సదుపాయాల కల్పనకు రూ.119.58 కోట్లు కేటాయించింది. ప్రారంభదశలోనే వ్యాధిని గుర్తించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా సామూహిక క్యాన్సర్ స్క్రీనింగ్ నిర్వహించాలని వైద్యశాఖ నిర్ణయించింది. ఇందులో భాగంగా మహిళా హెచ్ఐవీ బాధితులు, హైరిస్క్‌లో ఉన్న వారికి క్యాన్సర్ స్క్రీనింగ్‌ను ఏపీ శాక్స్ ప్రారంభించింది. క్యాన్సర్ బారినపడటానికి హెచ్ఐవీ బాధితుల్లో ఆరురెట్లు, హైరిస్క్ బాధితుల్లో నాలుగురెట్ల అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఈ క్రమంలో షేర్ ఇండియా సంస్థ సాంకేతిక సహకారంతో ఏపీ శాక్స్ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హెచ్ఐవీ బాధిత, హైరిస్క్ మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రారంభించింది. తొలివిడతలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం, కాకినాడ జిల్లా పెద్దాపురం ప్రాంతాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ మొదలుపెట్టింది. శాక్స్ లెక్కల ప్రకారం ఈ రెండు ప్రాంతాల్లో హెచ్ఐవీ బాధిత, హైరిస్క్ మహిళలు 12,400 మంది ఉన్నారు. వీరందరికి నోటి, ఛాతీ, గర్భాశయ క్యాన్సర్ల గుర్తింపునకు స్క్రీనింగ్ చేస్తున్నారు. త్వరలో అన్నమయ్య జిల్లా మదనపల్లెలో క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రారంభించనున్నారు. అనంతరం అనకాపల్లి, విశాఖపట్నం జిల్లా అగనంపూడి.. ఇలా రాష్ట్రవ్యాప్తంగా స్క్రీనింగ్‌ను విస్తరించనున్నారు.

ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చు

దేశంలో ఏటా 1.3 మిలియన్ క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. వీటిలో 60 శాతం కేసులు నియంత్రించదగ్గవేనని వైద్య నిపుణులు చెబుతున్నారు. 2021–22లో రాష్ట్రంలో నమోదైన క్యాన్సర్ కేసుల్లో 16 శాతం ఛాతీ క్యాన్సర్‌కు సంబంధించినవి కావడం గమనార్హం. మహిళల్లో వచ్చే నోటి, ఛాతీ, గర్భాశయ క్యాన్సర్లలో 49.2 శాతం కేసుల్ని ప్రారంభదశలోనే గుర్తించి వైద్యంచేస్తే ప్రాణాపాయం తప్పుతుంది. ఇందుకు సామూహిక క్యాన్సర్ స్క్రీనింగ్ ఒకటే ప్రధాన మార్గమని ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు పేర్కొన్నారు.

దేశంలోనే మొదటి సారి



దేశంలోనే మొదటిసారి మన రాష్ట్రంలో కాంప్రహెన్సివ్ క్యాన్సర్‌కు అడుగులు పడ్డాయి. వ్యాధి నివారణ, నియంత్రణ, పాలియేటివ్ కేర్ వంటి అన్ని అంశాలపైనా ప్రభుత్వం దృష్టిపెట్టింది. క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలి. వ్యాధి లక్షణాలు, చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఏపీ శాక్స్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రారంభించాం. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న హెచ్ఐవీ బాధితులు, హైరిస్క్ మహిళలకు స్క్రీనింగ్ నిర్వహిస్తాం.

– నవీన్‌కుమార్, ప్రత్యేక కార్యదర్శి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ

సీఎం జగనే ప్రాణం పోశారు..

- కరోనాతో మృత్యువు అంచుకు చేరిన వైద్యుడు
- సీఎం చొరవతో రూ.1.50 కోట్ల ఖర్చుతో వైద్యం
- పూర్తిగా కోలుకుని విధులకు సిద్ధమైన డాక్టర్ భాస్కర్



ఒంగోలు: కరోనా బాధితులకు వైద్యం చేస్తూ.. తానూ కరోనా బారినపడి మృత్యువు అంచుకు చేరిన ఓ వైద్యుడిని అప్పటి మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుని ప్రాణం పోశారు. తనకు ప్రాణదానం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆ వైద్యుడు కృతజ్ఞతలు చెబుతూ మళ్లీ విధులకు సిద్ధమయ్యాడు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తొలిసారిగా కారంచేడులో కరోనా కేసులు వెలుగుచూశాయి. ఆ సమయంలో కారంచేడు ప్రభుత్వ వైద్యశాల వైద్యుడిగా భాస్కర్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన భార్య డాక్టర్ భాగ్యలక్ష్మి ఒంగోలు రిమ్స్‌లో రేడియాలజీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. తొలినాళ్లలో 2020 ఏప్రిల్ 24న భాస్కర్ కరోనా సోకింది. తొలుత ఆయన గుంటూరు జనరల్ ఆస్పత్రిలో, తర్వాత విజయవాడ ఆయుష్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నా తగ్గకపోవడంతో హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చేర్చారు. అప్పటికే రూ.50 లక్షల దాకా ఖర్చుచేశారు. సంపాదించిన డబ్బులతో పాటు అప్పు తెచ్చినా వైద్యానికి సరిపోలేదు. అపోలో వైద్యులు అతనికి ఊపిరితిత్తులు మార్పిడి చేయాలని, దాదాపు రూ.1.5 కోట్లు ఖర్చవుతుందని చెప్పారు. ఆ సమయంలోనే రిమ్స్ ఒంగోలు రీజనల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, ఒంగోలు క్యాన్సర్ హాస్పిటల్ ఆంకాలజీ వైద్యుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి సాయంతో అప్పటి మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని కలిసి సాయం చేయాలని కోరారు. వైద్యుడి విషయాన్ని సీఎం వైఎస్ జగన్ దృష్టికి బాలినేని తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సీఎం చికిత్సకు ఎంత ఖర్చయినా ప్రభుత్వమే భరిస్తుందని ప్రకటించారు. ఆ మేరకు ప్రభుత్వ ఖర్చులతో మెరుగైన వైద్యం అందించారు. దీంతో డాక్టర్ భాస్కర్ ఆరోగ్యం కుదుటపడింది. ఇటీవలే కోలుకున్నారు. డాక్టర్ దంపతులు ఆదివారం ఎమ్మెల్యే బాలినేనిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు పునర్జన్మ ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపే అవకాశం కల్పించాలని డాక్టర్ భాస్కర్ కోరారు. సీఎంకు కృతజ్ఞతలు తెలిపాకవిధుల్లో చేరాలనుకుంటున్నట్లు చెప్పారు. దీనికి స్పందించిన బాలినేని.. సీఎంను కలిసే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

గిరిజన విద్యా సంస్థల్లో గేటు వరకే అనుమతి

- ఆశ్రమ పాఠశాలల్లో ఇతరుల ప్రవేశంపై నిషేధం
- జువెనైల్ జస్టిస్ కమిటీ ఆదేశాల మేరకు పటిష్ట చర్యలు

సాక్షి, అమరావతి: గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. గిరిజన గురుకులాలతోపాటు పలు విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు భద్రత, సురక్షితమైన జీవన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ చర్యలు తీసుకుంది. హైకోర్టు జువెనైల్ జస్టిస్ కమిటీ ఆదేశాల మేరకు గిరిజన విద్యాసంస్థల ఆవరణలోకి ఇతర వ్యక్తుల ప్రవేశాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఏపీ గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు.

కచ్చితమైన నిబంధనలు

ప్రభుత్వ తాజా ఉత్తర్వుల ప్రకారం.. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఎవరినీ గిరిజన ఆశ్రమ పాఠశాల లోపలికి అనుమతించకూడదు. బాలికలు ఉండే విద్యా సంస్థల్లోని డార్మెటరీ, మరుగుదొడ్లు ఉండే ప్రాంగణంలోకి పురుషులను అనుమతిస్తే నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవు. ఆయా ప్రాంతాలకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, కలెక్టర్, ఐటీడీఏ పీవో, సంయుక్త కలెక్టర్, డీఆర్వో, తహసీల్దార్, ఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఎస్ఐ పాఠశాల విద్యా కమిషనర్, డీఈవో, ఎంఈవో, ఏటీడబ్ల్యూ, వైద్యాధికారి, ఎంపీడీవోలను మాత్రమే విద్యాసంస్థల్లోకి అనుమతిస్తారు. ఇతర అధికారులు, దాతలు, మీడియా ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు వంటి వారు విధిగా జిల్లా ఉన్నతాధికారుల అనుమతి తీసుకున్న తర్వాతే ప్రవేశం కల్పిస్తారు. గ్యాస్, కూరగాయలు, నిత్యావసర సరుకుల పంపిణీదారులను విద్యాసంస్థ ప్రాంగణం గేటు వరకు మాత్రమే అనుమతిస్తారు. ఈ ఉత్తర్వులను ఉల్లఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్దేశిత సమయం కేటాయిస్తారని కాంతిలాల్ దండే జారీ చేసిన మార్గదర్శకాల్లో స్పష్టం చేశారు.

గతంలోకన్నా స్పందన అధికం

- 27న ఫైనల్ అడ్మిషన్ల కౌన్సెలింగ్
- ఇంతలోనే ఆర్జీయూకేటీ ప్రవేశాలపై అసత్య ప్రచారం
- 'ఈనాడు' కథనంపై వీసీ హేమచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీ (ఆర్జీయూకేటీ) పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలపై మూడుసార్లు పిలిచినా భర్తీకాని సీట్లు.. అంటూ 'ఈనాడు'లో వచ్చిన కథనం పూర్తిగా సత్యదూరమని, ఇది అబద్ధాలతో ప్రతిష్టాత్మక సంస్థపై దుష్ప్రచారం చేయడమేనని సంస్థ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ కె. హేమచంద్రారెడ్డి ఖండించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఆర్జీయూకేటీలో 2022–23 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం గతంలో కన్నా ఎక్కువ స్పందన వచ్చింది. 4,400 సీట్ల కోసం ఈ ఏడాది 45వేల దరఖాస్తులు అందాయి. గత ఏడాది 40వేలే వచ్చాయి. ఈసారి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు ఆలస్యం కావడంవల్ల విద్యార్థుల మేలును దృష్టిలో పెట్టుకుని ఆ ఫలితాలు వెలువడిన తదుపరి కౌన్సెలింగ్‌ను నిర్వహించాల్సి వచ్చింది. అలాగే, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటాకు సంబంధించిన అంశాల్లో సంబంధిత మెరిట్ జాబితా ఆర్జీయూకేటీకి అందలేదు. ఆర్జీయూకేటీలో ప్రవేశాల కోసం టెన్త్‌లోని వేలాది మంది మెరిట్ విద్యార్థులు ఏటా పోటీపడుతుంటారు. ఇందుకు సంస్థకు అందుతున్న దరఖాస్తులే తార్కాణం. సీట్లు భర్తీ కాకుండా ఖాళీగా ఉండిపోయాయనడం కూడా సత్యదూరమే. ఇక సీట్లు పొందిన తరువాత పలువురు అభ్యర్థులు వారి వ్యక్తిగత కారణాలతో ఆయా సంస్థల్లో రిపోర్టు చేయలేదు తప్ప భర్తీ కాలేదనడం అవాస్తవం. మిగిలిన సీట్లకు ఈనెల 27న నూజివీడు క్యాంపస్‌లో ఫైనల్ అడ్మిషన్ల కౌన్సెలింగ్‌ను నిర్వహించాల్సి ఉంది. ఈ తరుణంలో సీట్లు మిగిలిపోయాయంటూ అసత్యాలతో వార్తలు రాయడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే. ఏటా ఈ సీట్లను అత్యధిక మెరిట్ మార్కులున్న వారే పొందుతున్నారంటేనే ఈ సంస్థలో చదివేందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంత ప్రాధాన్యమిస్తున్నారో అర్థమవుతుంది.' అని హేమచంద్రారెడ్డి తెలిపారు.

సాటిలేని 'వృద్ధి'

▶ మొదటి పేజీ తరువాయి

చంద్రబాబు హయాంలో 2018–19లో స్థిర ధరల ఆధారంగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.6,26,614.20 కోట్లు ఉండగా 2021–22లో రూ.7,46,912.74 కోట్లకు పెరిగింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మూడేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 19.19 శాతం వృద్ధి నమోదైంది. సగటు వార్షిక వృద్ధి రేటు 6.39 శాతం ఉంది. 2020–21తో పోల్చితే 2021–22లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.76,591.24 కోట్ల మేర పెరిగి ఏకంగా 11.42 శాతం మేర వృద్ధి నమోదైంది. కోవిడ్ సంక్షోభ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయం, రైతుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో వ్యవసాయ రంగంలో వృద్ధి నమోదైంది. 2019–20 నుంచి 2021–22 వరకు మూడేళ్లలో వ్యవసాయ రంగంలో రూ.13,900.77 కోట్ల మేర ఉత్పత్తి పెరిగి 20.05 శాతం వృద్ధి నమోదైంది. వ్యవసాయ రంగం వృద్ధి ఏటా సగటున 6.88 శాతంగా ఉంది.

పారిశ్రామిక పరుగులు..

కోవిడ్ సంక్షోభం నెలకొన్నప్పటికీ రాష్ట్ర పారిశ్రామిక రంగంలో వరుసగా మూడేళ్ల వృద్ధి నమోదైంది. మూడేళ్లలో పారిశ్రామిక రంగం ఉత్పత్తి విలువ రూ.26,719.51 కోట్లు పెరిగి 17.58 శాతం మేర వృద్ధి నమోదైంది. ఏటా సగటున 5.85 శాతం మేర వృద్ధి నమోదైంది. సేవా రంగంలో మూడేళ్లలో రూ.49,068.81 కోట్లు పెరిగి 20.76 శాతం మేర వృద్ధి నమోదైంది. ఏటా సగటున 6.92 శాతం వృద్ధి ఉంది. తయారీ రంగంలో కూడా మూడేళ్లలో రూ.7,758.15 కోట్లు పెరిగి 10.85 శాతం మేర వృద్ధి నమోదైంది. అంటే ఏటా సగటున 3.61 శాతం వృద్ధి నమోదైంది.

నాడు.. సాగు దయనీయం

కోవిడ్ లాంటి సంక్షోభం లేకున్నా టీడీపీ పాలనలో వ్యవసాయ రంగం వృద్ధి తిరోగమనంలోకి వెళ్లిపోవడం గమనార్హం. 2017–18లో స్థిర ధరల ప్రకారం వ్యవసాయ రంగం ఉత్పత్తి రూ.74,118.40 కోట్లు ఉండగా 2018–19లో రూ.69,303.17 కోట్లకు పడిపోయింది. అంటే వ్యవసాయ రంగం ఉత్పత్తి రూ.4,815.23 కోట్లు తగ్గి 6.49 శాతం క్షీణించింది.

ఏపీలోనే జీఎస్‌డీపీ ఎక్కువ

దేశంలో ఇతర పెద్ద రాష్ట్రాల కంటే ఆంధ్రప్రదేశ్‌లోనే రాష్ట్ర స్థూల ఉత్పత్తి అధికంగా ఉందని ఆర్బీఐ నివేదిక వెల్లడించింది. 2021–22 ఆర్థిక ఏడాదిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థూల ఉత్పత్తి వృద్ధి 11.42 శాతం ఉండగా కర్నాటక, పంజాబ్, రాజస్థాన్, తమిళనాడు, తెలంగాణ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల స్థూల ఉత్పత్తి తక్కువగా ఉన్నట్లు తెలిపింది.

ఆర్బీఐ నివేదిక ప్రకారం స్థిర ధరల ఆధారంగా వృద్ధి పెరుగుదల రూ.కోట్లలో

రంగం	2018-19	2021-22
రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ)	6,26,614.20	7,46,912.74
వ్యవసాయ రంగం	69,303.17	83,203.94
పరిశ్రమల రంగం	1,52003.85	1,78,723.36
తయారీ రంగం	71,514.99	79,273.14
సేవా రంగం	2,36,254.73	2,85,323.54

2023లో తెలంగాణలో మార్పు ఖాయం

- బీజేపీ ప్రశిక్షణా శిబిరంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
- రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, బీజేపీ ద్వారానే అది సాధ్యమని ఇప్పటికే మెజారిటీ ప్రజలు నిర్ణయించుకున్నారని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చెప్పారు. తెలంగాణలో టీఆర్ఎస్ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా, అబద్ధాల ప్రచారంతో ఎన్ని వేల కోట్లు ఖర్చు చేసినా 2023 ఎన్నికల్లో మార్పు తథ్యమని అన్నారు. ఆదివారం శామీర్‌పేటలోని ఓ రిసార్ట్‌లో, బీజేపీ రాష్ట్రస్థాయి ప్రశిక్షణా శిబిరంలో ఆయన మాట్లాడారు. అధికార టీఆర్ఎస్ భయపడిపోయి, అభద్రతా భావంతో బీజేపీపై బట్ట కాల్చి మీద వేసి తొండి ఆట ఆడుతోందని, ఆరోపణలతో బురద చల్లుతూ తప్పుడు ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. సీఎం కేసీఆర్ చూపుతున్న ఫామ్ హౌస్ ఫైల్స్ చూస్తే కొండను తవ్వి తొండను పట్టినట్టుగా కూడా కన్పించలేదని, బెదిరిస్తే బెదరడానికి బీజేపీ ఏమైనా కుటుంబ పార్టీయా? అని ప్రశ్నించారు. కేసులకు భయపడి సీబీఐ రాకుండా నిషేధ ఉత్తర్వులు జారీ చేసిన వారికి, బీజేపీని విమర్శించే నైతిక అర్హత ఉందా? అని నిలదీశారు. టీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నాయకులు, కార్యకర్తలు దూకుడుగా తిప్పికొట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అధికారం కోసం బీజేపీ ఏనాడూ అడ్డదారులు తొక్కబోదని, మూల సిద్ధాంతం ఆధారంగానే తెలంగాణలో అధికారంలోకి రావాలనుకుంటున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ స్పష్టం చేశారు. బీజేపీ మూడురోజుల ప్రశిక్షణా శిబిరంలో ఆయన ప్రారంభోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శులు తరుణ్ చుగ్, సునీల్ బన్సల్, ఎంపీలు ధర్మపురి అర్వింద్, సోయం బాపూరావు, తమిళనాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు జితేందర్‌రెడ్డి, జి.వివేక్ వెంకటస్వామి, గరికపాటి మోహన్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే ఎం.రఘునందన్ రావు తదితరులు హాజరయ్యారు.



జీవితం నిజంగా చాలా తేలికైనది. కానీ మనమే దానిని సంక్లిష్టంగా మార్చుకుంటాం.
– కన్ఫ్యూషియస్

సాక్షి

సోమవారం, నవంబర్, 21

నూరేళ్లుగా ఫలవంతం

ఇరవయ్యో శతాబ్దపు అత్యంత ప్రాధాన్యం కలిగిన కవితల్లో ఒకటని పేరొందిన 'ద వేస్ట్ లాండ్'కు ఇది శతాబ్ది సంవత్సరం. టి.ఎస్. ఎలియట్ ఆంగ్లంలో రాసిన ఈ 434 పంక్తుల దీర్ఘ కవిత 1922 అక్టోబరు, నవంబరుల్లో ప్రచురితమైంది. డిసెంబరులో మొదటిసారి పుస్తక రూపంలో వచ్చింది. కవిత ఉల్లేఖనం(ఎపిగ్రాఫ్) గ్రీకు భాషలో ఇలా మొదలవుతుంది: ''సిబిల్! నీకేం కావాలి?''

''నాకు చచ్చిపోవాలని ఉంది.''

బ్రిటిష్ గాథల్లో 'హోలీ గ్రెయిల్'(పవిత్ర పాత్ర)ను సంరక్షించడానికి నియుక్తుడైన సుదీర్ఘ బ్రిటన్ రాజుల పరంపరలో చివరివాడు ఫిషర్ కింగ్. కానీ ఆయన కాలికి అయిన గాయం వల్ల నడవలేకపోతాడు, గుర్రం అధిరోహించలేకపోతాడు, తన విధులు నిర్వర్తించలేకపోతాడు. దానివల్ల ఆయన భూములు బంజరుగా మారిపోతాయి. దాన్ని ఆధునిక కాలానికి ప్రతీకగా చేస్తూ, మొదటి ప్రపంచయుద్ధం, స్పానిష్ ఫ్లూల వల్ల లక్షలాది మందిని పోగొట్టుకున్న యూరప్ ఖండాన్ని కూడా ఎలియట్ ఒక 'బంజరు నేల'గా చూశాడు. అక్కడ సూర్యుడు కఠినంగా ఉంటాడు. మోడువారిన చెట్లు ఏ నీడా ఇవ్వవు. చిమ్మెటలు ఏ పాటా పాడవు. జలధారలు ఎటూ పరుగులిడవు.

అమెరికాలోని 'బోస్టన్ బ్రాహ్మణ' కుటుంబంలో జన్మించి, ఇంగ్లండ్‌లో స్థిరపడిన ఎలియట్ (1888–1965) ఈ కవిత రాయడానికి ముందు నెర్వస్ డిజార్డర్‌తో బాధపడుతున్నాడు. వైద్యులు విశ్రాంతి తీసుకొమ్మని చెప్పారు. పనిచేస్తున్న బ్యాంకు ఉద్యోగానికి మూడు నెలల సెలవుపెట్టి, భార్య వివియన్‌తో కలిసి ఇంగ్లండ్‌లోని కెంట్ తీరానికి వెళ్లాడు. అయినా ఆలోచనలు సలపడం మానలేదు. ఇంటా, బయటా దుఃఖం వ్యాపించివుంది. సమాజం ముక్కలైంది. ఆధ్యాత్మిక దర్శిని లేదు. గత సాంస్కృతిక వైభవం లేదు. ప్రేమ, సాన్నిహిత్యం కేవలం భౌతికమైనవిగా మారిపోయాయి. శృంగారం కూడా అత్యాచారానికి దాదాపు సమానం. అంతకుముందు బతికి ఉన్నవాడు చచ్చిపోయాడు. ఇప్పుడు బతికి ఉన్నవాళ్లం నెమ్మదిగా చచ్చిపోతున్నాం. ''పాశ్చాత్య సంస్కృతికి చచ్చిపోవలసిన సమయం వచ్చింది. దానికి చావు కావాలి. దానికి కొత్త బతుకు కావాలి. ఈ చావు బతుకుల మధ్య ఉన్న పాశ్చాత్య సంస్కృతి పట్ల ఆవేదన ఎలియట్ కవితలో ప్రధాన విషయం'' అంటారు సూరపరాజు రాధాకృష్ణమూర్తి.

ఐదు విభాగాలుగా ఉండే ఈ కవితకు తుదిరూపం ఇవ్వడానికి చాలాముందు నుంచే ఎలియట్ మనసులో దీనిగురించిన మథనం జరుగుతోంది. ఆధునిక కవిత్వానికి జీవం పోసినదిగా చెప్పే ఈ కవిత మీటర్‌ను పాటిస్తూనూ, అది లేకుండానూ సాగుతుంది. తొలిప్రతిని స్నేహితుడైన మరో కవి, సంపాదకుడు ఎజ్రా పౌండ్‌కు పంపగానే, చాలా మార్పులు చెబుతూనే, 'ఇది ప్రపంచాన్ని ప్రభావితం చేయబోయే కవిత' అని సరిగ్గానే గుర్తించాడు. ఏప్రిల్ అత్యంత క్రూరమైన నెల, మృత నేల లైలాక్స్‌ను పూస్తోంది, స్మృతులనూ కోర్కెలనూ కలుపుతోంది... గతేడాది నీ ఉద్యానంలో నువ్వు నాటిన ఆ శవం మొలకెత్తడం మొదలైందా?... 'ద వేస్ట్ లాండ్' కవిత అస్పష్టంగా ఉంటుంది. తర్కాన్ని అతిక్రమిస్తుంది. సహజ ఆలోచనా విధానాన్ని ధ్వంసం చేస్తుంది. ముఖ్యంగా అనేక భాషల సాహిత్యాల్లోని వాక్యాలను యథాతథంగా ఉపయోగించాడు ఎలియట్. బైబిల్, బృహదారణ్యక ఉపనిషత్తు, బౌద్ధ సాహిత్యంతో పాటు హోమర్, సోఫోక్లిస్, డాంటే, షేక్‌స్పియర్, మిల్టన్, హెర్మన్ హెస్, బాదలేర్ లాంటి పదుల కొద్దీ కవుల పంక్తులు ఇందులో కనిపిస్తాయి. పాఠకుడు కూడా కవి అంత చదువరి కావాలని డిమాండ్ చేస్తుంది ఈ కవిత. కానీ 'నిజమైన కవిత్వం అర్థం కాకముందే అనుభూతమవుతుంది' అన్నాడు ఎలియట్. ఇది ఆయన కవితకు కూడా వర్తిస్తుందన్నట్టుగా, అర్థం చేసుకోవడం ఆపితే అర్థం అవుతుందన్నాడు ఐఏ రిచర్డ్స్. దాన్ని భావ సంగీతం అన్నాడు.

సంధ్యవేళ పగుళ్లూ, రిపేర్లూ, పేలుళ్లూ! టవర్లు కూలుతున్నాయి. జెరూసలేం, ఏథెన్స్, అలెగ్జాండ్రియా, వియన్నా, లండన్. అన్నీ అవాస్తవికం. లండన్ బ్రిడ్జి మీద జనాలు ప్రవహిస్తున్నారు. ఇందులో ఎంతమంది విడిపడి, వేరుపడిపోయారో! వాళ్ల పాదాల మీదే చూపు నిలిపి నడుస్తున్నారు. మృతజీవుల్లా సంచరిస్తున్నారు. లండన్ బ్రిడ్జి కూలిపోతోంది, కూలిపోతోంది. లండన్ బ్రిడ్జ్ ఈజ్ ఫాలింగ్ డౌన్ ఫాలింగ్ డౌన్ ఫాలింగ్ డౌన్... అన్నట్టూ, నీ పక్కన ప్రతిసారీ నడుస్తున్న ఆ మూడో మనిషి ఎవరు? నేను లెక్కపెట్టినప్పుడు కేవలం నువ్వు, నేను, పక్కపక్కన, కానీ నేను ముందటి తెల్లటి దోవకేసి చూసినప్పుడు, ఎప్పుడూ ఎవరో ఒకరు నీ పక్కన నడుస్తున్నారు. ద. ద. ద. దత్త. దయత్వం. దామ్యత. ఇవ్వడం. దయచూపడం. నియంత్రణ. శాంతిః శాంతిః శాంతిః

ఎలియట్‌ను ఆధునికతకు ఆద్యుడని అంటారు. ఇది ఎలియట్ యుగం అన్నారు. అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం ఆయన్ని 1948లో వరించింది. అయితే, విమర్శలు లేవని కాదు. ఎలియట్‌ను కవే కాదన్నవాళ్లు ఉన్నారు. ఆయన్ని దేవుణ్ణి చేసి పడేశారని విసుక్కున్నారు. 'ద వేస్ట్ లాండ్'ను అతుకుల బొంత కవిత అన్నారు. గుప్పెడు కవిత్వానికి బారెడు వివరాలు అవసరమైన దీన్ని చదవడం దుర్భరం అని చెప్పే రాబర్ట్ ఎరిక్ షూమేకర్ లాంటి ఆధునిక విమర్శకులూ లేకపోలేదు. కానీ ఈ కవిత గురించి ఎవరో ఒకరు ఇప్పటికీ మాట్లాడుతూనే ఉన్నారు. వందేళ్లుగా అది చదవాల్సిన కవితగానో, చదివి పక్కన పెట్టాల్సిన కవితగానో సాహిత్య ప్రియుల జాబితాలో ఉంటూనే ఉంది. కవి అనేవాడు తనను తాను ఆత్మార్పణం చేసుకుని, తాను అన్నవాడు లేకుండాపోయి రాయాలన్న ఎలియట్ స్ఫూర్తితో మాత్రం ఎవరికీ పెద్దగా విభేదం లేదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీక మాసం, **తిథి:** బ.ద్వాదశి ఉ.7.02 వరకు, తదుపరి త్రయోదశి, **నక్షత్రం:** చిత్త రా.10.57 వరకు, తదుపరి స్వాతి, **వర్జ్యం:** ఉ.6.43 నుండి 8.20 వరకు, ఉ.6.43 నుండి 8.20 వరకు, తిరిగి తె.4.31 నుండి 6.06 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.07 నుండి 12.51 వరకు, తదుపరి ప. 2.20 నుండి 3.06 వరకు, **అమృతఘడియలు:** సా.4.26 నుండి 6.02 వరకు.

సూర్యోదయం : 6.12
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు

మాంద్యం ముప్పు ఎవరికి?

విశ్లేషణ



రంగనాయకమ్మ

కొన్ని నెలలుగా ఆర్థిక రంగానికి సంబంధించిన సమాచారాన్ని ఒక పద్ధతి ప్రకారం సేకరించే సంస్థల నివేదికలు చూస్తే నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం అవుతుంది. ఇంతగా ఉద్యోగాలు పోవడం అనేది చరిత్రలో ఎన్నడూ లేదు. కేవలం పెట్టుబడిదారీ విధానంతోనే అది మొదలైంది. గత సమాజాలలో లేదు. బానిసలకి నిరుద్యోగ సమస్య ఉండేది కాదు. ఫ్యూడల్ కౌలు రైతులకి నిరుద్యోగ సమస్య ఉండేది కాదు. ఎటొచ్చీ ఈనాటి కార్మికులకే (వీళ్ళది 'వేతన బానిసత్వం' అంటాడు మార్క్స్) ఈ నిరుద్యోగ సమస్య వుంది. కార్మికులు అన్నప్పుడు, వాళ్ళు శారీరక శ్రమలు చేసే వారే అనుకోకూడదు. మేధాశ్రమలు చేసే వారందరూ కూడా కార్మికులే! ఇప్పుడు ఈ కార్మికులందరూ ఏమైపోతారు? రెగ్యులర్‌గా జీతాలు అందుతూ వున్నప్పుడే కార్మిక కుటుంబాలు సమస్యల వలయాల్లో కూరుకుపోయి వుంటాయి. అలాంటి కుటుంబాలకు జీతాలే ఆగిపోతే?!

నవంబరు 9న 'మెటా' అనే కంపెనీ తన ఉద్యోగుల్లో 11 వేల మందిని తీసేస్తున్నట్టు ప్రకటించింది. 'ట్విట్టర్' అనే కంపెనీ 3 వేల 7 వందల మందినీ, 'బైజూ' అనే కంపెనీ 2 వేల 5 వందల మందినీ.. ఇలా అనేక డజన్ల కంపెనీలు తమ దగ్గర పనిచేస్తున్న ఉద్యోగుల్ని వందల్లో, వేలల్లో తీసేసినట్టు వార్తలు వచ్చాయి. ఈ ఉద్యోగాల కోత ప్రపంచవ్యాప్తంగా గత 6 నెలల నించీ జరుగుతూనే వుంది. మొన్న జులై నెలలో 'అమెజాన్' అనే కంపెనీ లక్షమందిని ఉద్యోగాల్లో నించీ తీసేసింది. ఈ జాబితా చాలా పొడుగ్గా వుంటుంది. ఈ ఉద్యోగాలు పోవడం అనేది కేవలం సాఫ్ట్‌వేర్ కంపెనీలకే కాదు, వస్తువులు తయారు చేసే పరిశ్రమల్లో (మాన్యుఫ్యాక్చర్ రంగంలో) కూడా లక్షల్లో జరుగుతోంది. కొన్ని నెలలుగా ఆర్థిక రంగానికి సంబంధించిన సమాచారాన్ని ఒక పద్ధతి ప్రకారం సేకరించే సంస్థల (ఉదా: సి.ఎం.ఐ.ఇ) నివేదికలు చూస్తే నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం అవుతుంది.

అమెరికా లాంటి పెట్టుబడిదారీ దేశాల్లో కార్మికుల్ని ఉద్యోగాల్లో నించీ తీయదలుచుకుంటే వాళ్ళకి గులాబీ రంగు కాగితం (పింక్ స్లిప్) మీద 'రేపటి నించీ నువ్వు పనిలోకి రానక్కరలేదు' అని రాసిచ్చేవారు. ఇప్పుడు కంప్యూటర్ టెక్నాలజీ వచ్చాక ఎక్కడెక్కడో నివసించే ఉద్యోగులందరినీ ఒక తెర మీద కనిపించేలాగా సమావేశపరిచి (దీన్ని బడాయిగా 'జూమ్ మీటింగ్' అని చెప్పుకుంటారు.) చల్లగా చావు కబురు చెపుతారు. ఆ మధ్య 'బెటర్.కామ్' అనే కంపెనీ ఒకే ఒక్క జూమ్ సమావేశం పెట్టి ఒక్క దెబ్బతో 3 వేలమంది ఉద్యోగుల్ని 'రేపటినించీ మీరు పనిలోకి రానక్కర లేదు' అని చెప్పేశారని ఒక వార్త!

ఇంతగా ఉద్యోగాలు పోవడం అనేది చరిత్రలో ఎన్నడూ లేదు. కేవలం పెట్టుబడిదారీ విధానంతోనే అది మొదలైంది. గత సమాజాలలో లేదు. బానిసలకి నిరుద్యోగ సమస్య ఉండేది కాదు. ఫ్యూడల్ కౌలు రైతులకి నిరుద్యోగ సమస్య ఉండేది కాదు. ఎటొచ్చీ ఈనాటి కార్మికులకే (వీళ్ళది 'వేతన బానిసత్వం' అంటాడు మార్క్స్) ఈ నిరుద్యోగ సమస్య వుంది. కార్మికులు అన్నప్పుడు వాళ్ళు శారీరక శ్రమలు చేసేవారే అనుకోకూడదు. మేధాశ్రమలు చేసే వారందరూ (ఉదా: టీచర్లూ, డాక్టర్లూ, జర్నలిస్టులూ) కూడా కార్మికులే!

ఉద్యోగుల్ని తీసేయడానికి కంపెనీల వాళ్ళు చెప్పుకునే కారణాలు (సాకులు) కొన్ని: 1. కంపెనీకి ఆదాయాన్ని మించిన ఖర్చులు అవుతున్నాయి. ఖర్చులు తగ్గించుకోడానికి ఉద్యోగుల సంఖ్యని తగ్గించుకోవడం మినహా మార్గం లేదు. 2. ఉద్యోగులు ఎక్కువగానూ, సమర్థంగానూ ఉత్పత్తి చెయ్యడం లేదు. (దీన్నే



ఉత్పాదకత –ప్రొడక్టివిటీ – సమస్యగా చెపుతారు). 3. బ్యాంకులు వడ్డీరేట్లని పెంచేస్తూ పోతున్నాయి. ఇలాంటప్పుడు, వ్యాపారాన్ని నడపాలన్నా, పెంచాలన్నా అప్పులు తీసుకోవాలంటే పెంచిన వడ్డీ రేట్లు పెద్ద భారం. అందుకే ఉన్న ఉద్యోగుల్ని తగ్గించి, తక్కువ మందితో ఎక్కువ పని చేయించుకోవడమే మార్గం. 4. ఇతర దేశాలలో కూడా ఇవే పరిస్థితులు ఉండడం వల్ల ఎగుమతులు కూడా తగ్గిపోతున్నాయి. 5. ఒకే రకమైన సరుకులు తయారు చేసే ఇతర కంపెనీలతో పోటీ ఒకటి తలనొప్పిగా వుంది. 6. తయారైన సరుకులు మందకొడిగా (నెమ్మదిగా) అమ్ముడవుతున్నాయి. (దీన్నే 'మాంద్యం' అంటారు. కాబట్టి, ఉన్న సరుకులు అమ్ముడు కాకుండా కొత్త సరుకులు తయారు చేయించడం కుదరదు. అందుచేత, కొంతమందిని ఉద్యోగాల్లోనించీ తీసివేయక తప్పదు).

ఈ రకమైన పరిస్థితిని చూపించి ఆర్థికవేత్తలు 'ముంచుకొస్తున్న మాంద్యం' అని హెచ్చరికలు చేస్తారు. అంతేగానీ తయారైన సరుకుల అమ్మకాలు మందకొడిగా ఎందుకు జరుగుతాయి? దానికి పరిష్కారం ఏమిటి?– అనే ప్రశ్నలకు వారి దగ్గిర సరైన సమాధానం వుండదు. మార్క్స్ తన 'కాపిటల్' లో విమర్శించినట్టు, ''పాఠ్య పుస్తకాల ప్రకారం ఉత్పత్తి విధానం సాగించి వుంటే సంక్షోభాలు సంభవించవు.. అని నొక్కి చెప్పడం ద్వారా పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు సంతృప్తి పడతారు''.

ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడుతుందంటే, అనేక కంపెనీల్లో సరుకుల గుట్టలు మార్కెట్ అవసరాల్ని మించిపోయి ఆకాశం ఎత్తున పెరిగిపోవడం వల్ల! ఈ గుట్టలు పెరగడం ఎందుకు జరుగుతుందంటే, ఆ ఉత్పత్తుల్ని తయారు చేయించే వాళ్ళ మధ్య సమష్టి ప్లాను లేకపోవడం వల్ల! ఆ సమిష్టి ప్లాను లేకపోవడం ఎందుకు జరుగుతుందంటే, వాళ్ళందరూ ప్రైవేటు పెట్టుబడిదారులు అవడం వల్ల! పెట్టుబడిదారీ జన్మ ప్రారంభమైన తర్వాత, ఆ జన్మకి లక్ష్యం లాభం రేటే! ఆ లక్ష్యానికి ఒక పరిమితీ, ఒక నీతీ, ఏదీ ఉండదు. ఆఖరికి మార్కెట్ అవసరాల్ని గమనించుకోవాలనే తెలివి అయినా ఉండదు.

పోటీలో నిలబడడానికి ఏకైక మార్గం – ఉత్పత్తి శక్తుల్ని పెంచడం! అంటే, సరుకుల్ని తక్కువ ఖర్చులతో తయారుచేసి, వెనకటి ధరలతోనే అమ్మాలని ప్రయత్నం! ఆ రకంగా కొంతకాలం జరిగిన తర్వాత వెనక్కి తిరిగి చూస్తే కంపెనీల నిండా సరుకుల గుట్టలు పేరుకుపోయి కనపడతాయి. అమ్మకాలు మందగించిన ప్రమాద సంకేతాలు ఎదురవుతాయి. దాన్ని గమనించుకున్న కంపెనీ యజమాని, పునరుత్పత్తి క్రమాల్ని తగ్గించెయ్యడం గానీ, ఆపెయ్యడం గానీ చేస్తాడు. అలా ఆపెయ్యడం వల్ల కార్మికులతో అవసరం తగ్గిపోతుంది. ఆ కంపెనీ నించి ఒక పిడికెడు మంది కార్మికులు తప్ప, మిగతా అందరూ ఉద్యోగాలు పోయి వీధుల్లో పడతారు. అసలు కార్మిక వర్గంలో, కొంత జనం ఎప్పుడూ నిరుద్యోగంలోనే వుంటారు. కానీ, సంక్షోభాల కాలాల్లో ముంచుకువచ్చే నిరుద్యోగాల పరిస్థితి అలాంటిది కాదు. ఒక కంపెనీలో నిన్నటి దాకా 100 మంది కార్మికులు వుంటే, ఇవ్వాల్టికి కనీసం 90 మంది నిరుద్యోగులైపోతారు. ఇది ఒక్క శాఖలోనే కాదు, అనేక శాఖల్లో జరుగుతుంది. శారీరక శ్రమల్లోనూ, మేధా శ్రమల్లోనూ కూడా ఇది జరుగుతుంది. సరుకుల పునరుత్పత్తి క్రమాలే తగ్గిపోయి, యంత్రాలే ఆగిపోయినప్పుడు, ఇక కార్మికులతో ఏం అవసరం ఉంటుంది?

అయితే, ఆ కార్మికులందరూ ఏమైపోతారు? రెగ్యులర్‌గా జీతాలు అందుతూ వున్నప్పుడే కార్మిక కుటుంబాలు, సమస్యల వలయాల్లో కూరుకుపోయి వుంటాయి. అలాంటి కుటుంబాలకు జీతాలే ఆగిపోతే, తిండే ఉండదు. అద్దె ఇళ్ళు ఖాళీ చేసి చెట్ల కిందకి చేరవలసి వస్తుంది, చెట్లయినా వుంటే! పిల్లల్ని స్కూళ్ళు మానిపించవలసి వస్తుంది. ఆకలి – జబ్బులు మొదలవుతాయి. వైద్యం ఉండదు. చావులు ప్రారంభం! బతికి వుంటే పిచ్చెత్తడాలూ, ఆత్మహత్యలూ, నేరాలూ పెరిగి పోతాయి. కార్మిక జనాలు పిట్టలు రాలినట్టు రాలిపోతారు. ఉదాహరణకి, ప్రభుత్వ లెక్కల ప్రకారమే భారతదేశంలో 2021లో లక్షా 64 వేల మంది ఆత్మహత్యలు చేసుకుంటే వాళ్ళలో 43 వేలమంది రోజు వారీ కూలీలూ, నిరుద్యోగులూనూ అని తేలింది. లెక్కకు రానివి ఎన్నో!

వ్యాసకర్త ప్రముఖ రచయిత్రి

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

తొలి అడుగు



"పని వైపు మొగ్గండి. అప్పుడు మీరు పెద్ద ప్రణాళికను చిన్న చిన్న అడుగులుగా విభజించి, మొదటి అడుగు వేస్తారు.." అని శ్రీమతి గాంధీ చెప్పిన మాటలు నాకు గుర్తు కొస్తున్నాయి.

– నవీన్ జిందాల్, కార్పొరేట్ దిగ్గజం

సాగిపో... ధీరుడా!



మితి మీరిన ఆశయ సాధనేచ్ఛ కలిగిన ఈ లోకంలో అడుగడుగున ఎదురయ్యే అసమానతలను, అవరోధాలను దాటుకుని తమకొక ప్రతిష్ఠాత్మకమైన దారిని ఏర్పరచుకున్న పురుషులందరికీ ఈ ఒక్కరోజే కాదు.. ప్రతిరోజూ బిగ్గరగా అరచి చెబుతా.. 'యోధులారా! హ్యాపీ ఇంటర్నేషనల్ మెన్స్ డే..'! మీరు మరింతగా బలాన్ని, ప్రేమను పొందుతూనే ఉండాలి.

– బసంత్ ఆర్. రాసివాసియా, న్యూమరాలజిస్ట్

ఎందుకిలా చేస్తారు!



మొన్నటి వరకు నేను తమిళనాడు బీజేపీ 'ఆర్ట్స్ అండ్ కల్చరల్' విభాగానికి అధ్యక్షురాలిగా ఉన్నాను. కానీ మోదీజీ వారణాసిలో ప్రారంభించిన 'కాశీ–తమిళ సంగమం' కార్యక్రమానికి నాకు ఆహ్వానం అందలేదు! ఎవరూ నన్ను పట్టించుకోలేదన్న వాస్తవం నా మనసును కలిచివేస్తోంది. పార్టీ కోసం నేను కష్టపడినదంతా వృథా అయిందా అని బాధ కలుగుతోంది.

– గాయత్రీ రఘురామ్, బీజేపీ లీడర్

వింతేమీ లేదే?!



ఈ రచ్చంతా దేనికో నాకు కచ్చితంగా తెలియడం లేదు. ఇందులో (లింక్ చేసిన వీడియోలో) చూసేందుకు కూడా ఏమీ లేదు. ఒక ఆమ్ ఆద్మీ తీహార్ జైల్లో కూడా ఒక ఆమ్ ఆద్మీ (సగటు మనిషి) లాగే ప్రవర్తిస్తున్నాడు. (తీహార్ జైల్లో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సత్యేంద్ర జైన్ ఫుట్ మసాజ్, హెడ్ మసాజ్, బాడీ మసాజ్ చేయించుకోవడం గురించి).

– శేష్ పాల్ వైద్, జమ్మూకశ్మీర్ మాజీ డీజీపీ

పోటీ పడటమే పతకం!



అగ్రశ్రేణి ఆటగాళ్లను ఓడించడం సవాలుతో కూడుకున్న పని. ఈ ఆసియా కప్పులో నేను సాధించినది కాంస్య పతకమే అయినా నా విజయం పట్ల నేను గర్విస్తున్నాను. వారితో ఆడటం, పోటీ పడటం అదంతా.. ఓ అద్భుతం.

– మనికా బాత్రా, టేబుల్ టెన్నిస్ ప్లేయర్

ఆలోపు జరిగేదేమిటి?



రాబోయే మూడు దశాబ్దాలలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ బాహుబలి అవుతుందని సర్ గౌతమ్ అదానీ చెబుతున్నారు. 2050 నాటికి భారత్ రెండవ ఆర్థిక శక్తిగా అవతరిస్తుందని నమ్మకంగా విశ్వసిస్తున్నారు. ప్రపంచ సంపన్నులలో ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్న అదానీ... రానున్న ఆర్థికమాంద్యం గురించి కూడా ఏవైనా మంచి మాటలు చెప్పి ఉంటే కాస్త ధైర్యంగా ఉండేది.

– వివేక్ సింగ్, న్యాయ విద్యార్థి

ఎవరూ ఆపలేరు



భారత్ జోడో యాత్రలో పాల్గొన్నడానికి నిటారుగా ఉండే వెన్నెముక చాలు! నటి, యాక్టివిస్టు మోనా అంబేగాంవ్‌కర్ మాతో వచ్చినప్పుడు ఆమెతో అన్నాను : "మోనా! మీ తెగ మరింతగా వృద్ధి చెందబోతోంది.." అని.

– సుప్రియా శ్రీనతే, ఐ.ఎన్.సి. డిజిటలిస్ట్

ఇక్కడ పార్లమెంట్ ఉన్నా అధికారం రాజరికానిదే!

కామెంట్



కరణ్ థాపర్

బహ్రెయిన్ నేను సందర్శించడానికి ఎంపిక చేసుకున్న గమ్యస్థానం కాదు. దాన్ని ఎమిరేట్స్, ఖతర్‌కు చెందిన పేద బంధువులాగా భావించేవాడిని. కానీ నాకు తెలిసిన వాస్తవం ఏమిటంటే ఆ ప్రాంతం గురించి నాకు ఏమీ తెలీదు. నా అభిప్రాయం నా అజ్ఞానానికి ప్రతిబింబంగా ఉండేది. గత వారాంతంలో నాదెంత తప్పుడు అభిప్రాయమో నేను కనిపెట్టాను. బహ్రెయిన్ వెచ్చని, సంతోషకరమైన, ఆకర్షణీయమైన దేశం. నమ్మలేనంత శుభ్రంగానూ, దుబాయ్, అబుదాబీ, ఖతార్ లాగే ఆధునికంగానూ ఉంది.

కానీ బహ్రెయిన్ చాలా చిన్నదేశం. కేవలం 800 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం మాత్రమే ఉన్న దేశం. వాస్తవానికి 'బహ్రెయిన్ ద్వీపం' అనే పేరు కలిగి ఉన్న ద్వీప సమూహం. కొద్ది కాలం క్రితం ఈ ద్వీపం 40 కిలోమీటర్ల పొడవు, 16 కిలోమీటర్ల వెడల్పు ఉన్న భూభాగంగా మాత్రమే ఉండేది. సముద్రం నుంచి ఏర్పడుతూ వచ్చిన ఈ దేశం (ఇప్పటికీ అలా జరుగుతూనే ఉంది) తన సైజును బహుశా రెట్టింపు చేసుకోగలిగింది. కానీ మాల్దీవులు, సింగపూర్ తర్వాత ఇది ఇప్పటికీ ఆసియాలో మూడో అతి చిన్న దేశంగా ఉంది.

బహ్రెయిన్ జనాభా 16 లక్షలు మాత్రమే. భారత దేశం నుంచే 4 లక్షల మంది ప్రవాసులు ఈ దేశానికి వచ్చారు. వీరిలో నాలుగింట మూడొంతుల మంది కేరళకు చెందిన వారే. ఈ దేశ జనాభాలో 43 శాతం మంది అరబ్ యేతర ఆసియన్లే అని వికీపీడియా పేర్కొంటోంది. వీరంతా ప్రవాసం వచ్చిన కార్మికులే అని నా అంచనా. స్థానిక జనాభా 47 శాతం మాత్రమే.

ఈ చిన్న ద్వీపం గురించిన కొన్ని ఆసక్తికరమైన నిజాలు తెలుసుకుందాం. అరబ్ ప్రపంచంలో మొట్టమొదటి చమురు బావి 1931లో ఇక్కడే బయటపడింది. ఈరోజు బహ్రెయిన్ ప్రముఖ చమురు ఉత్పత్తిదారు కాదు. కానీ ఈ చమురు బావి నిరుపయోగకరంగా ఉన్నప్పటికీ పర్యాటకులకు మాత్రం గర్వంగా తన్ను తాను ప్రదర్శించుకుంటోంది. బహ్రెయిన్ దీనార్ ప్రపంచంలోనే రెండో అతి శక్తిమంతమైన కరెన్సీ. ఒక దీనార్‌కి మీరు 2.65 అమెరికన్ డాలర్లు పొందవచ్చు. కాబట్టి బహ్రెయిన్ మరీ అల్లాటప్పా దేశం కాకపోవచ్చు.

బహ్రెయిన్‌లోని కేరళీయ సమాజం ఆహ్వానం మేరకు నేను ఆ దేశాన్ని సందర్శించాను. ఇది ఉజ్జ్వలమైన, అంకిత భావం కలిగిన సామాజిక సంస్థ. అలాగే డీసీ బుక్స్‌కి కూడా ఇది పేరుపొందింది. ద్వీపంలో జరిగే బుక్ ఫెస్టివల్‌లో కేరళీయులు ఉత్సాహంగా పాల్గొంటూ ఉంటారు. ఈ పుస్తక ప్రదర్శనశాల జాతీయ ఎన్నికలతో ముడిపడి ఉండటం నాకు ఆశ్చర్యాన్నీ, సంతోషాన్నీ కలిగించింది. మనదేశంతో పోలిస్తే ఇక్కడి ఎన్నికలు చాలా చాలా చిన్నవే కావచ్చు కానీ వాటిని వీరు నిర్వహించే తీరు మాత్రం నన్ను పరవశింపజేసింది.

బహ్రెయిన్‌లో ఉన్నది రాచరిక వ్యవస్థే. అది స్వభావ రీత్యా రాజ్యాంగబద్ధమైనదే కావచ్చు కానీ అధికారం మాత్రం రాజు హమీద్ అల్ ఖలీఫా రాజకుటుంబం చేతిలో మాత్రమే ఉంటుంది. అయితే 2002 నుంచి ప్రతి అయిదేళ్లకోసారి పార్లమెంటును ఎన్నుకుంటూ ఉన్నారు. ఇది 40 సీట్ల సింగిల్ ఛాంబర్ హౌస్. ఎగువ, దిగువ సభల్లాంటివి ఉండవు. బహ్రెయిన్ రాజ్యంలో రాజకీయ పార్టీలు లేవు. పార్లమెంటుకు అభ్యర్థులు స్వతంత్రులుగానే పోటీ చేయాల్సి ఉంటుంది.

ఫ్రాన్స్‌లాగే, ఇక్కడా ఎన్నికలు రెండు దశలలో ఉంటాయి. తొలివిడత ఎన్నికలు నేను రావడానికి ముందే నవంబర్ 12న జరిగాయి. 40 పోలింగ్ బూత్‌లలో 344 మంది అభ్యర్థులకు ఓటు వేయడానికి 3,44,713 మంది బహ్రెయిన్ పౌరులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. వీరంతా ఈ 344 మంది అభ్యర్థుల్లో 40 మందిని ఎన్నుకోవడానికి ఓటింగ్‌లో పాల్గొన్నారు.



ఇక్కడ విస్తరించి ఉన్న సీఫ్ మాల్‌లో విహారయాత్ర అత్యంత ప్రజాదరణ పొందింది. నేను ఈ దేశాన్ని సందర్శించినప్పుడు ఓటు వేయడానికి తమ వంతు సమయం కోసం ఎదురు చూస్తున్న ఓటర్లు స్టార్‌బక్స్ కాఫీలు సేవిస్తూ, హాగెన్–దాస్ ఐస్‌క్రీములను లాగించేస్తూ కనిపించారు. ఇక్కడ అన్నీ ఎయిర్ కండిషన్స్‌తో సౌకర్యవంతంగా ఉంటాయి!

ప్రవాసం వచ్చినవారు, గల్ఫ్ సహకార దేశాలకు చెందిన పౌరులు దేశంలో సొంత ఆస్తులను కలిగి ఉండి ఇక్కడే జీవిస్తూ ఉన్నట్లయితే వారు ఓటు వేసేందుకు బహ్రెయిన్ అనుమతిస్తుంది. నేను ఇక్కడ పర్యటించినప్పుడు జరిగిన ఎన్నికల్లో 73 శాతం ఓటింగ్ నమోదైంది. ఇది చాలా అధిక శాతమట. ఇక రెండో విడత పోలింగ్ 13వ తేదీన ముగిసింది.

తొలి రౌండ్ ఓటింగ్ తర్వాత, 'ది వాయిస్ ఆఫ్ బహ్రెయిన్' అని తనను తాను పిలుచుకునే గల్ఫ్ డైలీ న్యూస్ పత్రిక, పోలింగ్‌ను విజయవంతం చేసినందుకు ఓటర్లకు రాజు అభినందనలు తెలిపారని రాసింది. ఇది 16 పేజీల ట్యాబ్లాయిడ్. రాజు తన సంతోషాన్ని రాజరికపు హుందాతనంతో ప్రకటించారు. 'మన ప్రియతమ రాజరికం కోసం సాధించిన ఈ ఘన విజయం పట్ల మమ్ము మేమూ, మా విశ్వసనీయ ప్రజలనూ అభినందించుకుంటున్నాము' అని రాజు పేర్కొన్నారు.

యువరాజు, ప్రధానమంత్రి రాజును అభినందనలతో ముంచెత్తారని పత్రికలు నివేదించాయి. అంటే సముద్ర మట్టానికి సమాంతరంగా ఉండే ఈ ద్వీపంలో సామరస్యం పొంగిపొరలుతోందన్న మాట.

బహ్రెయిన్‌లో రెండు అమెరికా స్థావరాలు ఉన్నాయి. పైగా ఇది 'నాటో' కూటమిలో ప్రముఖ మిత్ర దేశం కూడా! అయితే ఎంత గాలించినా ఒక్కరంటే ఒక్క అమెరికన్ సైనికుడు కూడా కనిపించలేదు. సౌదీ అరేబియన్లు తరచుగా కనిపిస్తుంటారు. 1980లలో చిత్తడినేలపై నిర్మించిన దారిలో అరగంట ప్రయాణిస్తే చాలు సౌదీ పౌరులు ఇక్కడికి చేరుకోవచ్చు. వారాంతపు సందర్శకులుగా వారు తరచూ ఇక్కడికి వస్తుంటారు. సౌదీ రాజరికం తమకు నిరాకరించిన ఆల్కహాల్‌ని బహ్రెయిన్ రాజు అనుమతించారు మరి!


చివరగా, ఫోర్ సీజన్స్ షాపులో నేను గత కొన్ని సంవత్సరాలుగా దొరకని చక్కటి బర్గర్‌ని రుచి చూశాను. గతంలో మీరు ఎమిరేట్స్‌ని సందర్శించి ఉన్నప్పటికీ షాపింగ్, సముద్ర క్రీడలు, ఎడారి, ఆధునిక నగరం వంటి వాటిని ఇంకా ఇష్టపడుతున్నట్లయితే మీ తదుపరి వారాంతపు సెలవుల్లో బహ్రెయిన్ రావడానికి ఎందుకు ప్రయత్నించకూడదు?

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్
(బహ్రెయిన్ నుంచి రాసిన వ్యాసం)

హింసాప్రవృత్తి

వాల్మీకి రామాయణం అరణ్యకాండ తొమ్మిదో సర్గలో హింసాప్రవృత్తికి సంబంధించిన ప్రస్తావన వస్తుంది. ఆ ప్రస్తావన తీసుకు వచ్చింది సీత.

వనవాసం చేస్తున్న కాలంలో రాముడు, లక్ష్మణుడు, సీత చిత్రకూటంలో కొన్నాళ్ళు ఉండి, అటు తరువాత దండకారణ్యం వెళ్తారు. అక్కడ వాళ్లొక ఆశ్రమం కట్టుకొని అందులో ఉంటారు. ఓ రోజు పొద్దున్నే రాముడు, లక్ష్మణుడు విల్లంబులు భుజాలకు తగిలించుకొని అడవికి బయలుదేరుతారు. అట్లా వాళ్లు ఆయుధాలతో వెళ్లటం సీతకు ఏ మాత్రం ఇష్టం లేదు. వనవాసం చేయటానికి వచ్చిన వాళ్లు తాపసుల్లా అహింసావ్రతులై ఉండాలి గాని, చంపటానికి ఉపయోగించే ఆయుధాలు ధరించటమేమిటి? ఆయుధాలు అందుబాటులో ఉంటే మనస్సు వికారం చెంది హింసాప్రవృత్తి వృద్ధి పొందుతుంది కదా! ఇలా తన ఆలోచనలను రాముడితో చెప్పి, సందర్భానికి తగ్గట్టు ఒక కథ కూడా చెబుతుంది.



జ్యోతిర్మయం

పూర్వం ఒకప్పుడు ఓ ముని అడవిలో ఆశ్రమం కట్టుకొని తపస్సు చేసుకొంటూ ఉండేవాడు. ఆ అడవిలో మృగాలు, పక్షులు ఏ ఆపదా లేకుండా సుఖంగా ఉండేవి. ఆ ముని ఎప్పుడూ సత్యాన్నే పలుకుతూ శుచిగా ఉండేవాడు. ఇది చూసి ఓర్వలేక ఇంద్రుడు అతడి తపస్సు పాడు చేద్దామనుకొన్నాడు. ఓనాడు ఆ ఇంద్రుడు భటుడి రూపంలో వచ్చి తన వద్ద ఉన్న కత్తిని ఆ మునికి ఇచ్చి, మళ్ళీ నేను వచ్చి అడిగి తీసుకొనేదాకా ఇది మీ వద్దనే ఉంచు అని చెప్పి వెళ్ళాడు. అది మొదలు ఆ కత్తిని కాపాడడం కోసం ఆ ముని మనసంతా దాని మీదనే పెట్టి, దాన్ని చేత్తో పట్టుకొని తిరగటం మొదలుపెట్టాడు. ఎప్పుడూ ఆయుధాన్ని ధరించటంవల్ల, మునీశ్వరుడికి తపస్సుపై శ్రద్ధ తగ్గి, క్రమేణా అతడి బుద్ధి కూడా క్రూరంగా మారింది.

ఈ కథ చెప్పి రాముడితో సీత అంటుంది – 'ప్రభూ! ఆయుధాలతో ఏ విధమైన సంబంధం పెట్టుకున్నా అది ప్రమాదానికి కారణం అవుతుంది. అందువల్ల వాటిని విడిచి పెట్టు' అని. ఇంతటి ధర్మ సూక్ష్మాన్ని సీతతో వాల్మీకి చెప్పించటం విశేషం.

– దీవి సుబ్బారావు



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆదినారాయణపురంలో లబ్ధిదారుకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



పార్వతీపురం మన్యం జిల్లా సోమగండి గ్రామంలో ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి

మన ప్రభుత్వం



కర్నూలు జిల్లా దేవనగర్‌లో మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



బాపట్ల జిల్లా కామరాజుగడ్డ నార్త్ గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

క్లుప్తంగా

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూ కంపార్ట్‌మెంట్లు 24 నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 79,471 మంది స్వామి వారిని దర్శించుకోగా 36,594 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో 4.90 కోట్లు భక్తులు సమర్పించారు. శ్రీవారి దర్శన టోకెన్లు లేని భక్తులకు 24 గంటలు, ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 3 గంటల సమయం పడుతోంది.

సత్యదేవుని సన్నిధిలో భక్తజన జాతర



సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో భక్తులు

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలోని రత్నగిరిపై కొలువుదీరిన సత్యదేవుని ఆలయం ఆదివారం భక్తజన జాతరను తలపించింది. కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా భక్తులు పోటెత్తడంతో ఆలయ ప్రాంగణంలో తీవ్ర రద్దీ ఏర్పడింది. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ వేలాది వాహనాల్లో భక్తులు తరలి రావడంతో దేవస్థానం ఘాట్‌రోడ్లలో పలు మార్లు ట్రాఫిక్ స్తంభించింది. సుమారు 1.50 లక్షల మంది సత్యదేవుని దర్శించారని అధికారులు అంచనా వేశారు. భక్తుల రద్దీని తట్టుకోలేక ఒక దశలో రెండు గంటల పాటు వ్రతాల టికెట్ల విక్రయం నిలిపివేశారు. పశ్చిమ రాజగోపురం తలుపులు రెండు గంటలు మూసివేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి మళ్లీ పశ్చిమ రాజగోపురం ద్వారా భక్తులను అనుమతించారు. వ్రతాల టికెట్లు విక్రయించారు. సాయంత్రం 5 గంటల సమయానికి సత్యదేవుని వ్రతాలు సుమారు 14 వేలు జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.1.50 కోట్ల ఆదాయం వచ్చిందని ఈవో సత్యనారాయణమూర్తి తెలిపారు.

విశాఖ ఉక్కును కాపాడుకుందాం

- రైటర్స్ అకాడమీ సదస్సులో వక్తలు



మాట్లాడుతున్న ఉండవల్లి అరుణ్‌కుమార్

అల్లిపురం (విశాఖ దక్షిణం): విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదంతోనే తిరిగి పోరాటం ఉధృతం చేయాలని అభిప్రాయపడ్డారు. రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో డాబా గార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన్ భవన్‌లో ఆదివారం నిర్వహించిన సదస్సులో ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. కేపటలిజం అనేది ప్రధాని మోదీ నైజమని, అవకాశమిస్తే ప్రభుత్వ రంగ సంస్థలన్నీ అమ్మేస్తారని అన్నారు. ప్రజలు పోరాటాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును పబ్లిక్ సెక్టార్‌లోనే కొనసాగించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలు ఉద్యమం ఉధృతం చేస్తే మోదీ తగ్గుతారన్నారు. ప్రతి కార్మికుడు తనతో పాటు తన కుటుంబాన్ని ఉద్యమంలో భాగస్వామ్యం చేయాలన్నారు. సీబీఐ మాజీ జేడీ వి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా కార్మికులు, అన్నివర్గాల వారిని చైతన్య పరిచి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి 3 వేల మెట్రిక్ టన్నుల ఉక్కు, జమ్మూ కశ్మీర్‌లోని టన్నెల్ నిర్మాణానికి 8 వేల టన్నుల ఉక్కు, ప్రధాని ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణానికి 21వేల టన్నుల ఉక్కు విశాఖ స్టీల్ ప్లాంట్ అందించిందన్నారు. మోదీ అధికారం చేపట్టిన తరువాత దేశ సంపద కొద్దిమంది చేతుల్లోకి వెళుతోందన్నారు. సినీ నటుడు ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ.. స్టీల్ ప్లాంట్ ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలన్నారు. ఏపీకి మొదటి నుంచీ అన్యాయం జరుగుతోందన్నారు. విభజన హామీలు అమలు చేయక పోగా, ప్రత్యేక హోదా ఇవ్వక పోవడం అన్యాయమన్నారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వీవీ రమణమూర్తి మాట్లాడుతూ.. స్టీల్ ప్లాంట్ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా చేపట్టాలన్నారు. త్వరలో లక్ష మందితో రాజకీయ పార్టీలకు అతీతంగా స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఉద్యమం చేపట్టనున్నామని ప్రకటించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై సంకలనం చేసిన 'మీ కలం నా స్వరం' పుస్తకాన్ని వక్తలు ఆవిష్కరించారు. సీనియర్ గాయకుడు చింతాడ రామచంద్రరావు సంకలనం చేసిన పుస్తకాన్ని ఉక్కు అభ్యుదయ కళావేదిక-ప్రజా నాట్యమండలి రూపొందించింది. స్టీల్ ప్లాంట్ కార్మిక నేత ఎం.రాజశేఖర్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు విళ్ల రామ్మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

వేడుకగా పద్మావతి అమ్మవారి ధ్వజారోహణం

చంద్రగిరి/తిరుచానూరు: తిరుచానూరులో శ్రీవారి దేవేరి శ్రీపద్మావతి బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా ఆదివారం ఆలయ అర్చకులు ధ్వజారోహణం నిర్వహించారు. ముందుగా చక్రత్తాళ్వార్, అమ్మవార్లతో పాటు గజచిత్రపటాన్ని ఊరేగించారు. ధ్వజస్తంభానికి తిరుమంజనం జరిపారు. అనంతరం మిధున లగ్నంలో గజచిత్రపటాన్ని ధ్వజ స్తంభంపై ఎగురవేసి ధ్వజారోహణం చేయడంతో తొమ్మిది రోజుల బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

'సుగ్గి' శానా తగ్గింది!



ఆదోని డివిజన్‌లో గతంలో ఏటా 2 లక్షల మంది వలస

మూడేళ్లుగా 90 శాతం ఆగిపోయిన వలసలు

- సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంతో బీడు భూములు కళకళ
- మంత్రాలయంలో ఐదు ఎత్తిపోతలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం
- సమృద్ధిగా వర్షాలు, నీటి సౌలభ్యంతో పుష్కలంగా పంటలు
- వైపరీత్యాలతో నష్టపోతే పంటల బీమాతో అండగా సర్కారు
- సొంతూరిలో సేద్యం చేసుకుంటూ ఆనందంగా రైతన్నలు
- ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు

సాక్షి ప్రతినిధి, కర్నూలు: మూడేళ్లుగా మంచి వర్షాలు.. పచ్చని పంటలు.. పండిన పంటకు గిట్టుబాటు ధర.. వైపరీత్యాలతో నష్టపోతే పంటల బీమాతో అండగా నిలుస్తున్న సర్కారు.. విత్తనం నుంచి విక్రయం వరకూ రైతన్నకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ భరోసా కల్పిస్తుండటంతో వలసలు ఆగిపోయి కరువు సీమ కళకళలాడుతోంది. కర్నూలు జిల్లా ఆదోని డివిజన్‌లోని ఐదు నియోజకవర్గాల పరిధిలో 381 పంచాయతీల్లో చాలా గ్రామాల్లో గతంలో ఏటా 2 లక్షల మందికిపైగా పనుల కోసం 'సుగ్గి' (వలస) వెళ్లేవారు. మూడేళ్లుగా పరిస్థితి పూర్తిగా మారింది. వలస వెళ్లేవారి సంఖ్య 90 శాతానికి పైగా తగ్గింది. అక్కడక్కడా కొన్ని పల్లెల్లో వెళుతున్నా పనుల్లేక మాత్రం కాదు. తమ పొలాల్లో పనులు పూర్తి చేసుకుని మిగతా రోజుల్లో ఎక్కువ కూలీ వస్తుందనే ఉద్దేశంతో గుంటూరు జిల్లాతో పాటు తెలంగాణ ప్రాంతానికి పత్తి చేలలో పనుల కోసం వెళుతున్నారు. స్థానికంగా రోజుకు రూ.300 చొప్పున కూలీ లభిస్తుండగా తెలంగాణ, గుంటూరులో పత్తి తీస్తే కిలోకు రూ.14 చొప్పున చెల్లిస్తున్నారు. ఒక వ్యక్తి రోజుకు క్వింటం నుంచి 120 కిలోలు పత్తి తీస్తారు. దీంతో రూ.1,400-1,680 వరకు కూలీ రావడంతో పనులు లేని సమయాల్లో వెళ్లి వస్తుంటారు. ఇక కర్ణాటక, కేరళ వలస వెళ్లేవారి సంఖ్య పూర్తిగా ఆగిపోయింది. కోసిగి, పెద్దకడుబూరు, నందవరం, మంత్రాలయం, ఎమ్మిగనూరుతో పాటు పలు మండలాలను 'సాక్షి' ప్రతినిధి పరిశీలించగా కేరళ, కర్ణాటకకు వలసవెళ్లిన కుటుంబం ఒక్కటీ కనిపించలేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఎలాంటి ఫలితాలు ఇస్తున్నాయో ఇది స్పష్టం చేస్తోంది.

ఎత్తిపోతలతో సస్యశ్యామలం

మంత్రాలయం నియోజకవర్గంలో ఐదు ఎత్తిపోతలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. హోళి, ఐరనగల్లు, కందుకూరు, కగ్గల్లు, బసాపురం ఎత్తిపోతల పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఇవి పూర్తయితే 10 వేల ఎకరాలకు సాగునీరు, 20 గ్రామాలకు తాగునీరు అందుతుంది. పులికనుమ రిజర్వాయర్‌కు ఇప్పటికే తుంగభద్ర నుంచి నీటిని ఎత్తిపోస్తున్నారు. దీని పరిధిలో 3 వేల ఎకరాలకు సాగునీరు అందుతోంది. గురు రాఘవేంద్రతో పాటు దిద్ది, మాధవరం, బసలదొడ్డి, వగురూరు ఎత్తిపోతల ద్వారా ఇప్పటికే సాగునీరు అందుతోంది. ఆర్డీఎస్, వేదవతి పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుంది.

నిశ్చింతగా సాగు

ఆదోని డివిజన్‌లో 2.5 ఎకరాల లోపు ఉన్న రైతులు 60% మంది, ఐదెకరాలలోపు ఉన్నవారు 29 శాతం మంది ఉన్నారు. ఇక్కడి భూములన్నీ వర్షాధారమే. కర్నూలు జిల్లాలో 2021 ఖరీఫ్‌లో పంట నష్టపోయిన 2.84 లక్షల మంది రైతన్నల ఖాతాల్లో రూ.339.60 కోట్లు జమ అయ్యాయి. ఈ ప్రాంతంలో పత్తి, ఉల్లి, మిరప అధికంగా సాగు చేస్తారు. ఐదేళ్లక్రితం 2 లక్షల ఎకరాల్లో సాగైన పత్తిని ఈ ఏడాది 7 లక్షల ఎకరాల్లో పండిస్తున్నారు.

అక్షరాస్యతలో అట్టడుగున..

కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన ఆదోని డివిజన్ అభివృద్ధితోపాటు అక్షరాస్యతలో అత్యంత వెనుకబడి ఉంది. మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి మండల జనాభా (2011 లెక్కల ప్రకారం) 69,275 కాగా అక్షరాస్యత 28.4 శాతం మాత్రమే. నిరక్షరాస్యతలో రాష్ట్రంలో మొదటి స్థానం, దేశంలో మూడో స్థానంలో ఉండే మండలం కూడా ఇదే. అయితే ఇప్పుడు అమ్మఒడి, జగనన్న విద్యా కానుక లాంటి పథకాల వల్ల పిల్లలను చదివించుకోవాలన్న తపన ప్రతి ఒక్కరిలో నెలకొంది. పల్లెల్లో ప్రతి చిన్నారి బడిబాట పట్టారు.

ఆదోని అభివృద్ధికి 'ఆడా'

ఆదోని డివిజన్ వెనుకబాటుతనాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 'ఆడా' (ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ఏర్పాటు చేస్తూ 2022 జనవరి 12న జీవో నెంబర్ 7 జారీ చేసింది. ఆదోని, పత్తికొండ, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు పరిధిలోని 381 పంచాయతీలను ప్రత్యేక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేసింది. అందరికీ భూమి కల్పించాలన్నది ప్రభుత్వ సంకల్పం.

జన్మలో సూడలే..



నాకు ఆరెకరాల పొలం ఉంది. 9 మంది పిల్లలు. 8 మంది ఆడబిడ్డలే. ఒక పాపోడు. 14 ఏళ్ల కిందట నా భర్త చనిపోవడంతో పొలం సూసుకుంటా బతుకుతాండా. ఏం గిట్టుబాటు కాలే. ఆరెకరాల్లో మిరప, ఉల్లి ఏసినా. తెగుళ్లతో పంట రాలే. ఏం అర్థకాకుండా ఉంటి. సీఎం జగన్ రూ.2.07 లక్షలు బీమా డబ్బులు అకౌంట్లో ఏసినాడు. నా జన్మలో ఎప్పుడూ ఇంత బీమా సొమ్ము సూడలే. ఆ డబ్బుతో బోరు వేయించుకున్నా. నీళ్లు పడినాయి. వాన వచ్చినా, రాకున్నా నీళ్లకు దిగుల్లే. నిబ్బరంగా పంట ఏత్తా.. ఇంకో ఇషయం సారూ. నాకు ఏటా రైతుభరోసా లెక్క కూడా పడతాంది.

– హంపమ్మ, చింతకుంట

భయం లే!



నాకున్న నాలుగెకరాల్లో మిరప, ఉల్లి వేసినా. పంట దెబ్బతింది. కొంత చేతికొచ్చింది. రూ.81 వేలు బీమా వచ్చింది. నా జీవితంలో ఇంత బీమా సొమ్ము ఎప్పుడూ రాలే. ఇంత లెక్క రావడం ఇదే ఫస్టు. తెగుళ్లు వచ్చి పంట పోయిందనే దిగుల్లేదు. మల్లా ధైర్యంగా పంట ఏత్తా. దేవుని దయతో పండితే పంట వత్తాది.. లేకపోతే దిగుల్లేకుండా బీమా లెక్క వత్తాది. రైతు భరోసా కూడా వత్తాది. అప్పుడు మాదిరి భయం లే!

– సుంకయ్య, చింతకుంట, కోసిగి మండలం

శాప్ లీగ్ క్యాలెండర్ విడుదల

- క్రమం తప్పకుండా లీగ్‌ల నిర్వహణ
- డిసెంబర్‌లో ఏడు టోర్నీలకు షెడ్యూల్
- శాప్ లీగ్ యాప్ ద్వారా క్రీడాకారుల వివరాలు నమోదు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ 'శాప్ లీగ్' టోర్నీల పేరుతో క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఏటా క్రమం తప్పకుండా లీగ్‌ల నిర్వహణ కోసం తొలిసారిగా స్పోర్ట్స్ క్యాలెండర్‌ను తీసుకొచ్చింది. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల తేదీలను ప్రకటించింది. ఇప్పటికే నవంబర్‌లో లీగ్‌లు ప్రారంభమవగా, డిసెంబర్‌లో ఏడు క్రీడాంశాల్లో పోటీలకు షెడ్యూల్ విడుదల చేసింది. రాష్ట్ర స్థాయిలో 3 నుంచి 6 వరకు ఫెన్సింగ్ పోటీలు నంద్యాలలో, 25 నుంచి 30 వరకు గుంటూరులో టేబుల్ టెన్నిస్, 27 నుంచి 29 వరకు విశాఖపట్నంలో జిమ్నాస్టిక్స్ పోటీలు నిర్వహిస్తారు. జిల్లా స్థాయిలో 1 నుంచి 10 వరకు వెయిట్ లిఫ్టింగ్, 5 నుంచి 11 వరకు హ్యాండ్‌బాల్, 6 నుంచి 10 వరకు అథ్లెటిక్స్, 15 నుంచి 20 వరకు టేబుల్ టెన్నిస్ పోటీలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా స్థాయి పోటీలకు ఏర్పాట్లు చేయాలని డీఎస్‌ఏలకు ఆదేశాలు జారీచేసింది.

ప్రతిభకు యాప్ సాయం

శాప్ లీగ్ యాప్ ద్వారా క్రీడాకారుల సమస్త వివరాలను నమోదు చేయనుంది. ఈ ఏడాది జనవరి నుంచి అక్టోబర్ వరకు శాప్ 33 టోర్నమెంట్లు నిర్వహించింది. ఇందులో 9 రాష్ట్ర, 16 జోనల్, 8 జిల్లా స్థాయి పోటీలు ఉన్నాయి. గతంలో శాప్ టెన్నిస్ లీగ్‌లో 1,000 మందికి పైగా క్రీడాకారుల జాబితాను సేకరించింది. ఈ తరహాలోనే మరో 11 క్రీడలను కలిపి శాప్ లీగ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇందులో నమోదైన క్రీడాకారులు ఆయా పోటీల్లో కనబరిచిన ప్రతిభ ఆధారంగా ర్యాంకులు ఇస్తుంది. క్రీడాకారుల సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి వారికి మరింత మెరుగైన శిక్షణ, సూచనలు ఇవ్వడానికి శాప్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

గంజాయి దందాకు ఉమ్మడి బ్రేక్



- పొరుగు రాష్ట్రాల్లో సాగు.. ఏపీలోంచి స్మగ్లింగ్
- అక్రమ రవాణా కట్టడికి ప్రత్యేక బృందాలు
- ఒడిశా పోలీసు అధికారులతో కలిసి సమన్వయ కమిటీ
- అంతర్‌రాష్ట్ర మార్గాల్లో నిఘా పటిష్టం.. ప్రత్యేక చెక్‌పోస్టుల ఏర్పాటు

సాక్షి, అమరావతి: సరిహద్దు రాష్ట్రాల నుంచి గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర పోలీసు శాఖ కార్యాచరణను వేగవంతం చేసింది. అందుకోసం సరిహద్దు రాష్ట్రాల పోలీసులతో కలిసి ప్రత్యేక బృందాలతో నిఘాను పటిష్టం చేస్తోంది. మొదటిదశగా ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో రెండు రాష్ట్రాల పోలీసులు సంయుక్త కార్యాచరణ చేపట్టారు. దేశంలో ఇలా గంజాయి దందాకు అడ్డుకట్ట వేసేందుకు ఇతర రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణ చేపట్టిన తొలిరాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. తరువాత దశల్లో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలతో కూడా ఉమ్మడి కార్యాచరణను విస్తరించాలని పోలీసు శాఖ భావిస్తోంది. ఆపరేషన్ పరివర్తన్ ద్వారా రాష్ట్రంలో గంజాయి సాగును దాదాపుగా ధ్వంసం చేసినప్పటికీ సరిహద్దు రాష్ట్రాల్లో అక్రమంగా సాగుచేస్తున్న గంజాయిని రవాణా చేసేందుకు మన రాష్ట్ర భూభాగాన్ని గేట్‌వేగా ఉపయోగిస్తున్నారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు చెందిన గంజాయి ముఠాలు ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలో కొనుగోలు చేసిన గంజాయిని అల్లూరి సీతారామరాజు జిల్లా ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నాయి. ఈ గంజాయి దందాకు అడ్డుకట్ట వేసేందుకు ఏపీ పోలీసు శాఖ ఒడిశా పోలీసులతో కలిసి కొన్ని నెలల కిందటే సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ, అదనపు ఎస్పీ/ఓఎస్డీ, డీఎస్పీలు, ఒడిశాలోని కోరాపుట్, మల్కనగిరి, జైపూర్ జిల్లాల ఎస్పీలు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఒడిశాలో గంజాయి సాగును శాసిస్తున్న ముఠాల వివరాలను కూడా ఏపీ పోలీసులు ఆ రాష్ట్ర పోలీసులకు అందించారు. ఏపీ పోలీసులు ఇచ్చిన 38 మంది గంజాయి స్మగ్లర్ల వివరాల మేరకు ఆయా గ్రామాల్లో ఒడిశా ప్రత్యేక పోలీసు బృందాలు విస్తృతంగా సోదాలు నిర్వహించాయి. మరోవైపు రెండు రాష్ట్రాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గిరిజనులను భాగస్వాములుగా చేసుకుని నిఘాను పటిష్టం చేశారు. ప్రధానంగా ఒడిశాలోని చిత్రకొండ, జోలాపుట్, మల్కనగిరి ప్రాంతాల నుంచి మన రాష్ట్రానికి అనుసంధానించే ప్రధాన రహదారులతోపాటు ఇతర మార్గాల్లో గస్తీని ముమ్మరం చేశారు. ఆ మార్గాల్లో ఇప్పటికే అటు ఒడిశా, ఇటు ఏపీ వైపు కొత్తగా ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఒడిశా వైపు చిత్రకొండ, సుకుమా, జోలాపుట్, పడువ, సిమిలిగూడల్లో ఒడిశాకు చెందిన ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించారు. ఆంధ్రప్రదేశ్ పరిధిలోని సీలేరు, డొంకరాయి, మారేడుమిల్లి, రంపచోడవరం, గోకవరం, మోతుగూడేల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) బృందాలు తనిఖీలు విస్తృతం చేశాయి.

త్వరలో ఛత్తీస్‌గఢ్, తెలంగాణలతో కలిసి..

ఇదే తరహాలో ఛత్తీస్‌గఢ్, తెలంగాణ పోలీసులతో కూడా కలిసి త్వరలో కార్యాచరణ చేపట్టాలని ఏపీ పోలీసు శాఖ భావిస్తోంది. అందుకోసం ఛత్తీస్‌గఢ్ పోలీసు శాఖతో ఇప్పటికే ప్రాథమికంగా చర్చించింది. త్వరలో తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులతో కూడా ఏపీ పోలీసు ఉన్నతాధికారులు చర్చించనున్నారు. పొరుగు రాష్ట్రాలతో కలిసి ఉమ్మడి కార్యాచరణపై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ)కి ఎప్పటికప్పుడు నివేదిస్తున్నారు. మన రాష్ట్రంలో ఆపరేషన్ పరివర్తన్‌ను విజయవంతంగా నిర్వహించిన తీరును ఎన్‌సీబీ నిశితంగా పరిశీలించింది. ఆంధ్రప్రదేశ్ పోలీసుల వ్యూహాన్ని అనుసరించమని ఇతర రాష్ట్రాలకు సూచించింది కూడా. గంజాయి ప్రభావిత రాష్ట్రాల డీజీపీలతో త్వరలో ఓ ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించాలని భావిస్తున్నారు. ఎన్‌సీబీ ఉన్నతాధికారులు కూడా హాజరయ్యే ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.

లబ్ధిదారులకే ఫ్లాట్ల నిర్వహణ పగ్గాలు

- భోపాల్ పీఎంఏవై-యూ ఇళ్లను పరిశీలించిన అధికారులు
- అదే తరహాలో ఏపీలోనూ 'టిడ్కో' సముదాయాల్లో సంక్షేమ సంఘాలు
- ప్రతీ వెయ్యి నివాసాలకు ఒకటి చొప్పున ఏర్పాటు

సాక్షి, అమరావతి: పట్టణాల్లో ఇళ్లులేని పేదలు, మధ్యతరగతి వర్గాల కోసం నిర్మిస్తున్న టిడ్కో ఇళ్ల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందుకోసం వివిధ రాష్ట్రాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన-అర్బన్ (పీఎంఏవై-యు) పథకంలో నిర్మించిన ఇళ్లను అధికారులు పరిశీలించారు. అక్కడ అమలుచేస్తున్న విధానాలను అధ్యయనం చేసి, మనకు ఇక్కడ అనువైన నిబంధనావళిని రూపొందిస్తున్నారు. రాష్ట్రంలో 88 యూఎల్బీల్లో 2.62 లక్షల టిడ్కో ఇళ్లను అన్ని సౌకర్యాలతో జీ+3 అంతస్తుల్లో నిర్మిస్తున్నారు. ఇవి ప్రాంతాన్ని బట్టి 1000 నుంచి 12 వేల వరకు ఉన్నాయి. ప్రతి వెయ్యి నివాసాలకు ఒక సంక్షేమ సంఘం చొప్పున ఫ్లాట్ల యజమానులతోనే కమిటీ ఏర్పాటుచేసి వీటి అంతర్గత నిర్వహణను యజమానులకే అప్పగించేందుకు చర్యలు చేపట్టారు. కమిటీల ఏర్పాటు తర్వాత ఒక్కో ఫ్లాట్‌కు రూ.100 నుంచి రూ.150 మధ్య నిర్వహణ రుసుం వసూలు చేసి, వారే నిర్వహించుకునేలా ఏర్పాట్లుచేస్తున్నారు. మరోవైపు.. పీఎంఏవై-యు కింద భోపాల్‌లో తొమ్మిది అంతస్తుల్లో ఫ్లాట్లను నిర్మించగా, రాజ్‌కోట్‌లో అంతకు మించి అంతస్తుల్లో అపార్ట్‌మెంట్లను నిర్మించి, దిగువ, మధ్యాదాయ వర్గాలకు కేటాయించారు. వాటి నిర్వహణను సైతం వాటి యజమానులకే కేటాయించినప్పటికీ, నిర్వహణ రుసుం భారీగానే ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.



భోపాల్‌లో పేదల అపార్ట్‌మెంట్లను పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్, ఇతర అధికారులు

భోపాల్‌లో రూ.850, రాజ్‌కోట్‌లో రూ.200

ఇక మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్మించిన పీఎంఏవై-యూ అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్‌కు రూ.850 చొప్పున సంక్షేమ సంఘం వసూలుచేస్తుండగా, గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ప్రతి ఫ్లాట్ యజమాని రూ.30 వేల డిపాజిట్‌తో పాటు ప్రతినెలా రూ.200 చెల్లిస్తున్నారు. ఈ నగదుతో ఆయా సంఘాలు అపార్ట్‌మెంట్ ప్రాంగణంలోని అంతర్గత పారిశుద్ధ్యం, విద్యుత్, తాగునీటి మోటార్ల నిర్వహణ, రక్షణ వంటి అంశాలకు ఖర్చుచేస్తున్నారు. రెండ్రోజులుగా భోపాల్‌లోని నివాసాలను టిడ్కో చైర్మన్ జమాన్న ప్రసన్నకుమార్, గృహనిర్మాణ శాఖ అధికారుల బృందం పరిశీలించింది. గృహాల నిర్మాణం, సౌకర్యాల విషయంలో మన రాష్ట్రమే మెరుగ్గా ఉన్నట్లు వారు తెలిపారు.

ఆ రాష్ట్ర ప్రభుత్వాల వాటా తక్కువ

పట్టణ పేదల కోసం మధ్యప్రదేశ్, గుజరాత్ చేపట్టిన అపార్ట్‌మెంట్ల నిర్మాణంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాల వాటా మన రాష్ట్రంతో పోలిస్తే చాలా తక్కువ. అక్కడి నివాసితులతో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్లు ఏర్పాటుచేసిన తరువాత లబ్ధిదారులు భూగర్భ డ్రైనేజీ, నీటి సరఫరా, వీధిలైట్లు, అంతర్గత రోడ్ల శుభ్రత వంటి వాటి కోసం భోపాల్‌లో ప్రతి ఇంటి నుంచి రూ.850 వసూలు చేస్తున్నారు. మన రాష్ట్రంలోనూ అవి నామమాత్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– జమాన్న ప్రసన్నకుమార్, ఏపీ టిడ్కో చైర్మన్

ఉన్మాద బాబుకు శాస్తి తప్పదు



రిలే దీక్షల్లో పాల్గొని నిరసన తెలియజేస్తున్న బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: రాష్ట్రంలో ఉన్మాదంగా వ్యవహరిస్తున్న బాబు అండ్ కోకు తగిన శాస్తి తప్పదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హెచ్చరించారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలకు పలువురు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. కుల ప్రయోజనాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తాకట్టు పెట్టాలని చూస్తే సహించేదిలేదన్నారు. ఐదు కోట్ల మంది ప్రజల నుంచి వచ్చే ఆదాయాన్ని ఓ ప్రాంతంలో కుమ్మరిస్తే మిగిలిన ప్రాంతాల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. రాజధాని ప్రాంతంలో పేదలకు సెంటు భూమి ఇచ్చేందుకు నిరాకరించిన కులవాదులకు తమ ప్రాంతం నుంచి వచ్చిన ఆదాయంతో అభివృద్ధి చేసుకునే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. ప్రజాప్రయోజనాలను పక్కన పెట్టి అవినీతి రాజధాని కోసం పరుగులు పెడుతున్న బాబు అండ్ కోకు, ఆయనకు వత్తాసు పలుకుతూ ప్యాకేజీల కోసం పాకులాడుతున్న పార్టీలను భూస్థాపితం చేస్తామని వారు హెచ్చరించారు. కులం ముసుగులో దొంగ ఉద్యమం చేస్తూ తెరపై రైతులను పెట్టి చేయాలని చూస్తున్న దొంగల బాగోతం బయటపడిందన్నారు. కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పల్లె బాబు, పులి దాసు, ఈపూరి ఆదాము తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

- ఊపిరాడక తండ్రి, కుమారుడు మృతి
- నర్సీపట్నంలో విషాద ఘటన

నర్సీపట్నం: అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్ని ప్రమాదంలో ఊపిరాడక తండ్రి, కుమారుడు మృతిచెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నర్సీపట్నానికి చెందిన బంగారు వ్యాపారి నవర మల్లేశ్వరరావు (నానాజీ) స్థానిక కృష్ణాబజార్ సెంటరులో అంబికా జ్యూయలర్స్ దుకాణం నిర్వహిస్తున్నారు. షాపుపైన రెండంతస్తుల డూప్లెక్స్ ఇంట్లో తన కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. మల్లేశ్వరరావు కుమార్తె జాహ్నవి మాకవరపాలెంలోని ఇంజనీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం, కుమారుడు మౌలేష్ విశాఖలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్నారు. తమ ఇంట్లో ఆదివారం పూజ ఉండడంతో మౌలేష్ శనివారం సాయంత్రం విశాఖ నుంచి ఇంటికి వచ్చాడు. రాత్రికి నానాజీ (45), అతని భార్య సుజాత, కుమారుడు మౌలేష్(19) పై అంతస్తులో, కుమార్తె జాహ్నవి కింద అంతస్తులో నిద్రపోయారు. వీరంతా గాఢనిద్రలో ఉండగా, తెల్లవారుజామున 3 గంటల సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల ఇంట్లో మంటలు వ్యాపించాయి. ఇల్లంతా దట్టమైన పొగ వ్యాపించడంతో ఊపిరి అందక ఉక్కిరిబిక్కిరయ్యారు. తమను రక్షించాలని నానాజీ పక్క ఇంట్లో ఉంటున్న సోదరుడు అప్పారావుకు ఫోన్ చేశారు. రెండంతస్తుల భవనానికి ఉన్న నాలుగు గేట్లకు లోపలి వైపున తాళాలు వేసి ఉండడంతో అప్పారావు, అతని కుటుంబ సభ్యులు ఎంత ప్రయత్నించినా వారి వద్దకు వెళ్లలేకపోయారు. వెంటనే అప్పారావు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా, వారు వచ్చి గేట్ల తాళాలను కట్టర్‌తో కట్ చేసి లోపలికి చేరుకున్నారు. అప్పటికే నానాజీ, మౌలేష్ మరణించారు. అపస్మారకస్థితిలో ఉన్న సుజాత, జాహ్నవిని ఏరియా ఆస్పత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌లో చేర్చారు. డీఎస్పీ ప్రవీణ్‌కుమార్, అనకాపల్లి క్రైం పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ గణేష్ తెలిపారు.



మంటలు వ్యాపించిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు



నానాజీ (ఫైల్)



మౌలేష్ (ఫైల్)

క్లుప్తంగా...

ఏడుగురు నేతలపై బీజేపీ సస్పెన్షన్ వేటు

అహ్మదాబాద్: వచ్చే ఎన్నికల్లో టికెట్లు దక్కలేదనే ఆగ్రహంతో స్వతంత్రులుగా బరిలోకి దిగిన బీజేపీకి చెందిన ఏడుగురు నేతలపై సస్పెన్షన్ వేటు పడింది. సస్పెన్షన్‌కు గురైన వారిలో మాజీ ఎమ్మెల్యేలు అరవింద్ లడానీ, హర్షద్ వాసవా ఉండటం గమనార్హం. డిసెంబర్ ఒకటో తేదీన జరిగే మొదటి విడత పోలింగ్ జరిగే స్థానాల్లోనే వీరంతా పోటీ చేస్తున్నారు. పార్టీ ప్రకటించిన అభ్యర్థులపై పోటీకి దిగిన ఈ ఏడుగురు నేతలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సీఆర్ పాటిల్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు బీజేపీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ టిక్కెట్లు రాలేదనే అక్కసుతో పలువురు బీజేపీ నేతలు స్వతంత్రులుగా పోటీ చేస్తున్నారు. ఆరు పర్యాయాలు ఎమ్మెల్యే అయిన వఘోడియా మధు శ్రీవాస్తవ్, మరో ఎమ్మెల్యే దినేశ్ పటేల్ కూడా ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తున్నారు.

6 నెలల తర్వాత చైనాలో తొలి కోవిడ్ మరణం

బీజింగ్: రాజధాని బీజింగ్ దాదాపు ఆరు నెలల తర్వాత మొదటి కోవిడ్ మరణం నమోదైందని చైనా అధికారులు ఆదివారం వెల్లడించారు. నగరానికి చెందిన 87 ఏళ్ల వృద్ధుడు కరోనా బారినపడి చనిపోయారని దేశ ఆరోగ్య విభాగం పేర్కొంది. చివరిసారిగా మే 26వ తేదీన షాంఘైలో కోవిడ్‌తో ఒకరు మృతి చెందారు. తాజా మరణంతో ఇప్పటి వరకు కరోనాతో చనిపోయిన వారి సంఖ్య 5,227కు చేరుకున్నట్లు వివరించింది. దేశ జనాభాలో 92 శాతం మంది కనీసం ఒక్క డోసు టీకా వేసుకున్నారు. అయినప్పటికీ, అప్పుడప్పుడూ కరోనా వ్యాప్తి ఉధృతి పెరుగుతుండటంతో ప్రభుత్వం కఠిన లాక్‌డౌన్‌లు, నియంత్రణలు అమలు చేస్తోంది.

అమెరికా నైట్‌క్లబ్‌లో కాల్పులు

ఐదుగురు మృతి, 18 మందికి గాయాలు

కొలరాడో: కొలరాడో కాల్పులతో దద్దరిల్లింది. అమెరికాలోని కొలరాడోలోని కొలరాడో స్ప్రింగ్ పరిధిలోని ఒక స్వలింగ సంపర్కుల నైట్‌క్లబ్‌లో జరిగిన కాల్పుల ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. 'క్లబ్ క్యూ' అనే క్లబ్‌లో జరిగిన ఈ ఘటనలో 18 మంది గాయపడ్డారు. శనివారం సాయంత్రం నాటి ఈ కాల్పులకు సంబంధించి ఒక అనుమానితుడిని పోలీసులు అరెస్ట్‌చేశారు. ఏ రకం మారణాయుధాన్ని కాల్పులకు ఉపయోగించారో, ఘటనకు కారణాలు ఏమిటో కొలరాడో స్ప్రింగ్స్ పోలీసు మహిళా లెఫ్టినెంట్ పమేలా క్యాస్ట్రో వెల్లడించలేదు. గతంలోనూ అమెరికాలో గే నైట్‌క్లబ్ ఒకటి రక్తమోడింది. 2016 ఏడాదిలో ఫ్లోరిడా రాష్ట్రంలోని ఒర్లాండో పరిధిలోని ఒక గే నైట్‌క్లబ్‌లో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రసంస్థకు సానుభూతిపరుడు ఒకడు జరిగిన కాల్పుల్లో ఏకంగా 49 మంది ప్రాణాలు కోల్పోయారు.

5న మమత-మోదీ భేటీ

కోల్‌కతా: ఢిల్లీలో వచ్చే నెల ఐదో తేదీన నిర్వహించనున్న ముఖ్యమంత్రుల సదస్సు సందర్భంగా ప్రధాని మోదీతో పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రత్యేకంగా భేటీ కానున్నారు. కేంద్రం నుంచి రాష్ట్ర వాటాగా పశ్చిమబెంగాల్‌కు రావాల్సిన నిధులు, చెల్లింపుల అంశాన్ని ఆమె ప్రధానంగా ప్రస్తావించే అవకాశముందని సంబంధిత ఉన్నతాధికారి ఒకరు ఆదివారం వెల్లడించారు. బెంగాల్‌లో అమలవుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి పాత బకాయిలపైనా మోదీతో మమత మాట్లాడతారని ఆయన చెప్పారు.

'పరిహార నిధి'కి సై

- కాప్-27లో కీలక ఒప్పందం
- తొలుత వ్యతిరేకించిన సంపన్న దేశాలు
- పేద దేశాలు గట్టిగా గళం విప్పడంతో దిగివచ్చిన వైనం
- శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించుకోవాలని భారత్ సూచన
- అంగీకరించిన ప్రపంచ దేశాలు
- షెర్మ్-ఎల్-షేక్‌లో ముగిసిన భాగస్వామ్యపక్షాల సదస్సు



ప్రసంగిస్తున్న సమీ షౌక్రీ

న్యూఢిల్లీ: ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో ఈజిప్ట్‌లోని షెర్మ్-ఎల్-షేక్ నగరంలో నిర్వహించిన భాగస్వామ్య పక్షాల సదస్సు(కాప్-27) ముగిసింది. వాతావరణ మార్పుల వల్ల విధ్వంసానికి గురైన, నష్టపోయిన దేశాలకు పరిహారం చెల్లించేందుకు ఒక నిధిని ఏర్పాటు చేయాలని కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ఒప్పందం కుదిరింది. శిలాజ ఇంధనాల వినియోగాన్ని ప్రపంచ దేశాలన్నీ దశలవారీగా తగ్గించుకోవాలంటూ భారత్ ఇచ్చిన పిలుపునకు సానుకూల స్పందన లభించింది. వాతావరణ మార్పులు, తద్వారా సంభవించే విపత్తుల వల్ల నష్టపోయిన దేశాలను ఆదుకోవడానికి నిధిని ఏర్పాటు చేస్తూ ఒప్పందానికి రావడం చరిత్రాత్మకమని భారత్ అభివర్ణించింది. ఇలాంటి ఒప్పందం కోసమే ప్రపంచం చాలా ఏళ్లుగా ఎదురు చూస్తోందని గుర్తుచేసింది. వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం కాప్-27 సదస్సు శుక్రవారమే ముగిసిపోవాలి. కానీ, కర్బన ఉద్గారాలను తగ్గించుకోవడంతోపాటు 'లాస్ అండ్ డ్యామేజీ ఫండ్'పై చర్చించాలని, ఒప్పందం కుదుర్చుకోవాలని పలు దేశాల ప్రతినిధులు పట్టుబట్టడంతో ఒక రోజు ఆలస్యంగా ముగిసింది. కాప్-27 అధ్యక్షుడు సమీ షౌక్రీ ముగింపు ఉపన్యాసం చేశారు.

తలవంచిన బడా దేశాలు

పరిహార నిధి కోసం భారత్‌తో సహా పలు అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలు ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నాయి. బడా దేశాల నిర్వాకం వల్ల తాము బలవుతున్నామని వాపోతున్నాయి. కర్బన ఉద్గారాలు, వాతావరణ మార్పులు విషయంలో సంపన్న దేశాలదే ప్రధాన పాత్ర. పరిహార నిధి ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌ను అమెరికా సహా పలు సంపన్న దేశాలు తొలుత వ్యతిరేకించాయి. ప్రపంచంలో ఎక్కడ విపత్తులు చోటుచేసుకున్నా చట్టప్రకారం తామే పరిహారం చెల్లించాల్సి వస్తుందన్న ఆందోళనే ఇందుకు కారణం. కానీ, చైనా సహా ఇతర చిన్నదేశాలు, ద్వీప దేశాలు గట్టిగా గొంతెత్తడంతో బడా దేశాలు తలవంచక తప్పలేదు. పరిహార నిధిపై ఒప్పందం కుదరకుండా తాము కాప్-27 నుంచి వెళ్లిపోయే ప్రసక్తే లేదని పేద దేశాలు తేల్చిచెప్పడం గమనార్హం.

పునరుత్పాదక ఇంధన వనరులపై దృష్టి

చమురు, గ్యాస్ సహా శిలాజ ఇంధనాల వినియోగాన్ని దశల వారీగా తగ్గించుకోవాలన్న భారత్ సూచన పట్ల కాప్-27లో అమెరికా, యూరోపియన్ యూనియన్(ఈయూ) తదితర దేశాలు అంగీకారం తెలపడం కీలక పరిణామం అని చెప్పొచ్చు. అయితే, దీనిపై ఇంకా తుది ఒప్పందం కుదరలేదు. పర్యావరణ విపత్తులు పెచ్చరిల్లుతుండడంతో సమీప భవిష్యత్తులోనే ఒప్పందం కుదిరే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పునరుత్పాక ఇంధన వనరులపై ప్రపంచ దేశాలు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని కాప్-27లో నిపుణులు సూచించారు. బొగ్గు వాడకాన్ని నిలిపివేస్తూ స్వల్ప ఉద్గారాల ఇంధన వ్యవస్థలను వేగంగా అభివృద్ధి చేసుకోవాలని 'షెర్మ్-ఎల్-షేక్ ఇంప్లిమెంటేషన్ ప్లాన్' పిలుపునిచ్చింది. వ్యవసాయం, ఆహార భద్రత విషయంలో క్లైమేట్ యాక్షన్‌పై కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని భారత పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్ సూచించారు. కాప్-27లో ఆయన మాట్లాడారు. కర్బన ఉద్గారాలను తగ్గించే బాధ్యతను కేవలం సన్న, చిన్నకారు రైతులపైనే మోపకూడదని చెప్పారు. కాప్-27 నిర్ణయాలు, ఒప్పందాలపై ఆఫ్రికా నిపుణుడు మొహమ్మద్ అడోవ్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

పేలిన కుక్కర్ బాంబు



యశవంతపుర: కర్ణాటక తీరప్రాంత నగరం మంగళూరులో ఓ ఆటోరిక్షాలో బాంబు పేలుడు సంభవించింది. ఘటనలో ఆటో డ్రైవర్ ఉజ్జోడి, అనుమానిత ఉగ్రవాది గాయపడ్డారు. శనివారం సాయంత్రం మంగళూరులోని కంకణాడి రైల్వే జంక్షన్ వద్ద ఒక ప్రయాణికుడు ఒక సంచిలో వంటకు ఉపయోగించే ప్రెషర్ కుక్కర్ తీసుకొని ఆటో ఎక్కాడు. కిలోమీటర్ దూరం వెళ్లగానే భారీ శబ్దంతో కుక్కర్ పేలిపోయింది. శివమొగ్గకు చెందిన షారిక్ (26) అనే అనుమానిత ఉగ్రవాది కుక్కర్ తీసుకుని ఆటో ఎక్కినట్లు తెలిసింది. పేలుడుతో తీవ్ర గాయాలతో అతడు స్పృహ కోల్పోయాడు ఆటో డ్రైవర్ కూడా గాయపడ్డాడు. మంగళూరులో ఏదైనా రద్దీ ప్రాంతంలో పేలుళ్లకు పాల్పడాలన్న ఉద్దేశంతో కుక్కర్ బాంబును తీసుకెళ్తుండగా, అది ముందే పేలిపోయినట్లు పోలీసులు గుర్తించారు. అతడి వద్ద లభించిన ఆధార్ కార్డ్ నకిలీదని తేలింది. గాయపడిన నిందితుడికి ఉగ్రవాదులతో సంబంధాలున్నట్లు ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై చెప్పారు.

ప్రతి బూత్ బీజేపీదే కావాలి

గుజరాత్‌లో విజయంపై ప్రధాని మోదీ


రాజ్‌కోట్‌లోని ధొరాజిలో మోదీ

వెరవాల్/ధొరాజీ: రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి పోలింగ్ బూత్‌లోనూ బీజేపీకే విజయం అందించాలని గుజరాత్ ప్రజలను ప్రధాని మోదీ కోరారు. ఎన్నికల రోజు ఓటర్లంతా భారీగా పోలింగ్ బూత్‌లకు తరలివచ్చి, గత రికార్డులను బద్దలు కొట్టాలని పిలుపునిచ్చారు. 'బీజేపీకే ఓటేయాలని మిమ్మల్ని అడగడం లేదు. ప్రతి పౌరుడూ ఈ ప్రజాస్వామ్య వేడుకలో భాగస్వామిగా మారాలి'అని కోరారు. 'తరచూ వచ్చే కరువు పరిస్థితులు వంటి కారణాలతో గతంలో రాష్ట్రాన్ని అందరూ చిన్నచూపు చూసేవారు. కానీ, అభివృద్ధిమార్గంలో పయనిస్తోంది. యావత్తు ఉత్తరభారతం నుంచి ఉత్పత్తులు రాష్ట్రంలోని రేవుల నుంచే ప్రపంచదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. దేశ సౌభాగ్యానికి ఈ ఓడరేవులే ద్వారాలుగా మారాయి'అని ప్రధాని చెప్పారు. నర్మదా బచావో ఆందోళన్ ఉద్యమకారిణి మేధా పాట్కర్ శనివారం మహారాష్ట్రలో జరుగుతున్న భారత్ జోడో యాత్రలో రాహుల్‌తో కలిసి నడవడంపై ఆయన స్పందించారు. సౌరాష్ట్రకు జలాలను అందించే నర్మదా డ్యామ్ ప్రాజెక్టును 3 దశాబ్దాలపాటు అడ్డుకున్న వారితో అంటకాగుతున్న కాంగ్రెస్‌కు ఓట్లడిగే నైతిక హక్కు లేదన్నారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను నిలదీయాలని మోదీ ప్రజలను కోరారు. కాంగ్రెస్‌కు వేసిన ఓటు వృధాయే అన్నారు. గిర్ సోమ్‌నాథ్, రాజ్‌కోట్ జిల్లాల్లో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని ప్రసంగించారు. అంతకుముందు ప్రఖ్యాత సోమ్‌నాథ్ ఆలయంలో పూజలు చేశారు. రాష్ట్రంలో డిసెంబర్ 1, 5వ తేదీల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

ట్రంప్‌కు మళ్లీ ట్విట్టర్ ఖాతా

పునరుద్ధరించినట్లు ఎలాన్ మస్క్ ప్రకటన



న్యూయార్క్: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ట్విట్టర్ ఖాతా మళ్లీ వచ్చేసింది. గతంలో రద్దు చేసిన ఆయన ఖాతాను పునరుద్ధరించినట్లు సోషల్ మీడియా కంపెనీ 'ట్విట్టర్' నూతన యజమాని ఎలాన్ మస్క్ ప్రకటించారు. ట్విట్టర్ కుటుంబంలో ట్రంప్‌ను చేర్చుకోవాలా? వద్దా? అనేదానిపై ప్రజాభిప్రాయం సేకరించామని తెలిపారు. మెజారిటీ జనం సానుకూలత వ్యక్తం చేశారని, అందుకే ట్రంప్ ఖాతాను పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. 2021 జనవరిలో ట్విట్టర్ నుంచి ట్రంప్‌ను బహిష్కరించిన సంగతి తెలిసిందే. 2021 జనవరి 6న అమెరికా క్యాపిటల్ బిల్డింగ్ వద్ద డొనాల్డ్ ట్రంప్ మద్దతుదారులు విధ్వంసానికి పాల్పడ్డారు. 2020 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ప్రత్యర్థి జో బైడెన్ గెలిచినట్లు అమెరికా పార్లమెంట్(కాంగ్రెస్) ప్రకటించేందుకు ప్రయత్నించడమే ఇందుకు కారణం. ఈ ఘటన జరిగిన కొద్దిరోజులకే అప్పటి ట్విట్టర్ యాజమాన్యం ట్రంప్ ఖాతాను రద్దు చేసింది. ''ప్రజలు ట్రంప్‌నకు మద్దతుగా నిలిచారు. ఆయన ఖాతాను పునరుద్ధరించాం'' అంటూ ఎలాన్ మస్క్ తాజాగా ట్వీట్ చేశారు. ఆన్‌లైన్ ద్వారా చేపట్టిన అభిప్రాయ సేకరణలో ట్రంప్‌నకు స్వల్ప మెజారిటీ లభించినట్లు వెల్లడించారు. ఇందులో మొత్తం 1,50,85,458 ఓట్లు పోలయ్యాయి. 51.8 శాతం మంది ట్రంప్‌నకు మద్దతుగా, 48.2 శాతం మంది వ్యతిరేకంగా ఓటువేశారు.

మాతృభాషలో శాస్త్ర, సాంకేతిక పదాల అర్థాలు

సీఎస్‌టీటీ సన్నాహాలు



న్యూఢిల్లీ: ఆధునిక శాస్త్రీయ, సాంకేతిక పదాలకు ఇకపై మాతృభాషలో సులభంగా అర్థాలు తెలుసుకోవచ్చు. జాతీయ విద్యా విధానంలో భాగంగా కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలోని కమిషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టర్మినాలజీ (సీఎస్‌టీటీ) దాదాపు 30 లక్షల పదాలు, వాటి అర్థాలను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ మేరకు ఒక వెబ్‌సైట్, యాప్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. దీనివల్ల శాస్త్ర, సాంకేతిక విద్యను మాతృభాషలు, ప్రాంతీయ భాషల్లో బోధించడం సులభతరం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, రచయితలు, అనువాదకులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొంటున్నారు. శాస్త్రీయ, సాంకేతిక పదాలు, వాటి అర్థ వివరణలను గూగుల్‌లో మాతృభాషలో తెలుసుకోవచ్చు. shabd.education.gov.nic అనే వెబ్‌సైట్‌లో ఈ వివరాలు త్వరలో కనిపించనున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం ఆరంభం నుంచే వెబ్‌సైట్, యాప్ ప్రారంభం కానుంది. మెడిసిన్, లింగ్విస్టిక్స్, పబ్లిక్ పాలసీ, ఫైనాన్స్, అగ్రికల్చర్, ఇంజనీరింగ్ తదితర విభాగాల పదాలు, అర్థాలు ఇందులో ఉంటాయి. విద్యను సాధ్యమైనంత మేరకు మాతృ భాషలు, స్థానిక భాషల్లో బోధించాలని జాతీయ విద్యా విధానం నిర్దేశిస్తోంది. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకూ.. అన్ని స్థాయిల్లో భారతీయ భాషలను ప్రోత్సహించాలని పేర్కొంటోంది. ప్రస్తుతం 22 అధికారిక భాషల్లో పదాల అర్థాలను వివరించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, భాషల సంఖ్య పెరిగే అవకాశం ఉందని సీఎస్‌టీటీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ గిరినాథ్ ఝా చెప్పారు. పుస్తకాల ప్రచురణ కోసం సీఎస్‌టీటీని కేంద్రం 1961లో ఏర్పాటు చేసింది.



అమెరికాలోని న్యూయార్క్ రాష్ట్రాన్ని చలిపులి వణికిస్తోంది. దట్టమైన మంచు కురుస్తోంది. బఫెలో నగరంలో రోడ్లపై కొన్ని అడుగుల మేర మంచు పేరుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. రోడ్లపై మంచును తొలగించేందుకు ప్రభుత్వ సిబ్బంది శ్రమిస్తున్నారు.

పుణే–బెంగళూరు రహదారిపై ప్రమాదం



48 వాహనాలు ధ్వంసం

పుణే: పుణే–బెంగళూరు ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి భారీ ప్రమాదం సంభవించింది. నవాలే బ్రిడ్జి వద్ద వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో 48 వాహనాలు ధ్వంసమైనట్లు అధికారులు వెల్లడించారు. దాదాపు 50 మంది ప్రయాణికులు గాయపడినట్లు తెలుస్తోంది. ఇక్కడ రహదారి వాలుగా ఉండడంతో భారీ కంటైనర్ వాహనం ఒకటి తొలుత ఓ కారును ఢీకొట్టింది. అనంతరం అదే వరుసలో ఉన్న వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయని పోలీసులు చెప్పారు.

మూడేళ్లలో 67% తగ్గిన పీఎం కిసాన్ లబ్ధిదారులు

ఆర్‌టీఐ పిటిషన్‌కు బదులిచ్చిన కేంద్రం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ పథకం లబ్ధిదారులు ఏటికేడు తగ్గిపోతున్నారు. 2019 ఫిబ్రవరిలో ఈ పథకం ప్రారంభమైన సమయంలో మొదటి విడత లబ్ధిదారుల సంఖ్య 11.84 కోట్ల మంది కాగా, ఈ ఏడాది జూన్‌లో మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ 3.87 కోట్ల మంది ఖాతాల్లోనే జమ అయింది. అంటే, దాదాపు 8 కోట్ల మంది రైతులను ఈ జాబితా నుంచి తొలగించారు. సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ) కింద అడిగిన ప్రశ్నకు సాక్షాత్తూ కేంద్ర వ్యవసాయ శాఖ ఈ మేరకు సమాధానమిచ్చింది. లబ్ధిదారుల సంఖ్య 67% తగ్గిపోవడానికి దారితీసిన కారణాలను మాత్రం ప్రభుత్వం వెల్లడించలేదు. పీఎం-కిసాన్ పథకం ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో రూ.2 లక్షల కోట్లు జమ చేసినట్లు ప్రభుత్వం చెప్పుకుంటోంది. ఏడాదికి రూ.6 వేలను రూ.2 వేల చొప్పున మూడు విడతలుగా ఏడాదిలో రైతులకు అందించేందుకు పీఎం-కిసాన్‌ను కేంద్రం 2019 ఫిబ్రవరిలో లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రకటించింది. ఈ ఏడాది అక్టోబర్‌లో తాజాగా 12వ విడత ఇన్‌స్టాల్‌మెంట్‌ను చెల్లించింది. మొదటి విడతలో 11.84 కోట్ల రైతులు లబ్ధిదారులుగా ఉండగా, ఆరో విడత వచ్చే సరికి ఈ సంఖ్య 9.87 కోట్లకు తగ్గింది. ఆ తర్వాత క్రమేపీ తగ్గుతూ వస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో లబ్ధిదారుల సంఖ్య 55.68 లక్షల నుంచి 28.2 లక్షలకు, మహారాష్ట్రలో 1.09 కోట్ల నుంచి 37.51 లక్షలకు, గుజరాత్‌లో 63.13 లక్షల నుంచి 28.41 లక్షలకు రైతు లబ్ధిదారుల సంఖ్య పడిపోయింది. దేశంలోని మూడొంతుల మంది రైతుల్లో రెండొంతుల మందికి కూడా పీఎం-కిసాన్ అందకపోవడం దారుణమని ఆల్ ఇండియా కిసాన్ సభ ప్రెసిడెంట్ అశోక్ ధావలే అంటున్నారు. ఈ పథకాన్ని క్రమేపీ కనుమరుగు చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపిస్తున్నారు.

ఢిల్లీ హత్య కేసు.. కపాల భాగాలు స్వాధీనం

న్యూఢిల్లీ/ముంబై: దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఢిల్లీ ఘటనలో పోలీసుల అన్వేషణ కొనసాగుతోంది. నిందితుడు అఫ్తాబ్‌ను అటవీ ప్రాంతానికి తీసుకెళ్లిన పోలీసులు ఆదివారం హతురాలు శ్రద్ధా వాకర్‌కు చెందినట్లుగా భావిస్తున్న కపాలం భాగాలను, కొన్ని ఎముకలను స్వాధీనం చేసుకున్నారు. తల భాగం ఢిల్లీ మైదాన్‌గర్హిలోని ఓ కుంటలో పడేసినట్లు అఫ్తాబ్ తెలపడంతో అందులోని నీటిని పంపులతో తోడుతున్నారు. మరోవైపు, కోర్టు ఆదేశాల మేరకు అఫ్తాబ్‌కు నార్కో అనాలిసిస్ పరీక్షలు జరిపేందుకు ఫోరెన్సిక్ నిపుణులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఢిల్లీ పోలీసులు మహారాష్ట్ర పాల్ఘార్ జిల్లా వసాయిలో శ్రద్ధా వాకర్, అఫ్తాబ్ పరిచయస్తుల వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. ఈ కేసులో ఆధారాల కోసం పోలీసు బృందాలు ఇతర రాష్ట్రాలకూ వెళ్లాయి.

గిరిజన చట్టాలను కేంద్రం బలహీనం చేస్తోంది


బుల్దానాలో చిన్నారితో రాహుల్ గాంధీ

బుల్దానా: కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో గిరిజనుల సాధికారిత కోసం తీసుకువచ్చిన చట్టాలను మోదీ ప్రభుత్వం బలహీన పరుస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే ఈ చట్టాలను తిరిగి బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. గిరిజనుల సంక్షేమం కోసం కొత్త చట్టాలను తీసుకువస్తామని చెప్పారు. భారత్ జోడో యాత్రలో భాగంగా ఆదివారం మహారాష్ట్రలోని బుల్దానా జిల్లా జల్గావ్-జమోద్‌లో జరిగిన ఆదివాసీ మహిళా వర్కర్స్ సమ్మేళన్‌లో ఆయన ప్రసంగించారు. ప్రధాని మోదీ గిరిజనులను వనవాసీలంటూ పిలుస్తున్నారనీ, వనవాసీ, ఆదివాసీలకు అర్థాల్లో తేడా లున్నాయని చెప్పారు. పంచాయతీరాజ్ చట్టం, అటవీ హక్కుల చట్టం, భూమి హక్కుల చట్టాలను కేంద్రం బలహీనంగా మారుస్తోందన్నారు. గిరిజనుల నుంచి భూములను లాగేసుకుని పారిశ్రామికవేత్తలకు ఇవ్వాలని చూస్తోందన్నారు. ఆదివాసీలే ఈ దేశం మొదటి యజమానులని దివంగత ప్రధాని, తన నానమ్మ ఇందిరాగాంధీ చెప్పే వారని గుర్తు చేశారు.

గుజరాత్‌లో 'షాక్' ఎవరికి?

గుజరాత్ ఎన్నికల్లో బీజేపీకి విద్యుత్ షాక్ తగులుతుందా ? నానాటికీ పెరిగిపోతున్న చార్జీలు ఎన్నికల్లో బీజేపీ విజయావకాశాలను దెబ్బ తీస్తాయా ? సామాన్య జనమే కాదు. బడా బడా పారిశ్రామికవేత్తలు కూడా విద్యుత్ టారిఫ్‌లపై తీవ్ర అసంతృప్తితో ఉన్న వేళ ఆమ్ ఆద్మీ పార్టీ ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీ ఎన్నికల్లో ఎలాంటి ప్రభావం చూపించబోతోంది ?



గుజరాత్‌లో విద్యుత్ బిల్లుల భారం తడిసిమోపెడు అవుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి మే మధ్య కాలంలో ప్రభుత్వం నాలుగు సార్లు చార్జీలను పరోక్ష పద్ధతిలో పెంచింది. ఎన్నికల ఏడాది కావడంతో నేరుగా గుజరాత్ ఎలక్ట్రిసిటీ కమిషన్ చార్జీల భారాన్ని మోపకుండా ఫ్యూయెల్ అండ్ పవర్ పర్చేజ్ ప్రైస్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్‌పీపీపీఏ) రూపంలో పెంచింది. ప్రస్తుతం యూనిట్ ధర వివిధ వర్గాల వాడకానికి అనుగుణంగా యూనిట్‌కు రూ.2.50 నుంచి రూ. 7.50 వరకు ఉంది. . ''గుజరాత్‌లో విద్యుత్ వినియోగదారులు 2021 మే–జూన్‌లో యూనిట్‌కి రూ.1.80 చెల్లిస్తే, ఈ ఏడాది జూన్ నాటికి యూనిట్ ధర రూ.2.50 చెల్లించాల్సి వస్తోంది. అంటే ఏడాదిలో 70 పైసలు పెరిగింది. గత రెండు నెలల్లోనే యూనిట్‌కు 30 పైసలు పెరిగేసరికి రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై నెలకి అదనంగా రూ.270 కోట్ల భారం పడింది'' అని రాష్ట్రానికి చెందిన ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ నిపుణుడు కె.కె. బజాజ్ చెప్పారు. గుజరాత్‌లో విద్యుత్ వాడకం ఎక్కువ. ఒక వ్యక్తి ఏడాదికి సగటున 2,150 యూనిట్లు వాడితే, ఇతర రాష్ట్రాల్లో 1,150 యూనిట్లే వాడతారని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీంతో డిమాండ్‌కి తగ్గట్టుగా సరఫరా కోసం విద్యుత్ కంపెనీలు రూ.20 పెట్టి యూనిట్ కొనుక్కోవాల్సి వస్తోంది. ఫలితంగా విద్యుత్ చార్జీలు వినియోగదారులపై మోయలేని భారాన్ని మోపాయి. పారిశ్రామిక రంగానికి యూనిట్‌కు రూ.7.50 చెల్లించాల్సి రావడంతో వారంతా తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే వ్యాపారాలు చేయలేమంటోంది సదరన్ గుజరాత్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ. మహారాష్ట్ర, తెలంగాణలో పరిశ్రమలు యూనిట్‌కు రూ.4 చెల్లిస్తే, తాము రూ.7.50 చెల్లించాల్సి వస్తోందన్న ఆందోళనలో వారు ఉన్నారు.



ఆప్ వర్సెస్ బీజేపీ

గుజరాత్‌లో మొదటిసారిగా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ఆమ్ ఆద్మీ పార్టీ ఢిల్లీ, పంజాబ్ తరహాలో గృహాలకు నెలకి 300 యూనిట్‌ల వరకు ఇస్తున్న ఉచిత విద్యుత్ హామీ పట్ల సామాన్యులు ఆకర్షితులవుతున్నారు. 2021 డిసెంబర్ 31కి ముందు జారీ అయిన పెండింగ్ విద్యుత్ బకాయిల్ని మాఫీ చేస్తామని, రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించింది. .మరోవైపు కాంగ్రెస్ కూడా ఉచిత విద్యుత్ హామీని అమలు చేస్తామంటోంది. ఇవన్నీ అధికార పార్టీకి సవాల్‌గా మారాయి. దీంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉచితాలు ఇచ్చే పార్టీల మాయలో పడొద్దని ఉచిత హామీ పథకాలు దేశాభివృద్ధిని అడ్డుకుంటాయంటూ ఆయన విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ఉచిత విద్యుత్ హామీ నెరవేరాలంటే గుజరాత్ ఖజానాపై ఏడాదికి రూ.8,700 కోట్ల రూపాయల భారం పడుతుంది. ఏ ప్రభుత్వమైనా ఇంత అదనపు భారాన్ని ఎలా మోస్తుందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ పార్టీ లక్ష్యమనం మోదీ అంటున్నారు. విద్యుత్ చౌర్యం జరగకుండా మీటర్లు పెట్టడం తప్పనిసరి చేశారు. మరోవైపు బీజేపీ ప్రచారాన్ని ఆప్ తిప్పి కొడుతోంది. గుజరాత్‌లో ముఖ్యమంత్రి నెలకి 5 వేల యూనిట్లు, ఇతర మంత్రులకి 4 వేల యూనిట్లు ఉచితంగా ఇస్తున్నప్పుడు సాధారణ జనం 300 యూనిట్ల వరకు ఎందుకు వాడుకోకూడదని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఉచిత విద్యుత్ గుజరాత్ ఓటర్లకు కొత్త కాదు. 2012 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేశూభాయ్ పటేల్ ఉచిత విద్యుత్ హామీ ఇచ్చారు. బీజేపీ నుంచి బయటకు వచ్చి గుజరాత్ పరివర్తన్ పార్టీ పేరుతో కొత్త పార్టీ స్థాపించిన కేశూభాయ్ పటేల్ రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రకటించారు. ఆ పథకం కింద 47 లక్షల మంది లబ్ధి పొందుతారు. అయితే మోదీ ఛరిష్మాకు ఆయన ఎదురు నిలువ లేకపోయారు.అప్పట్లో ఉచిత విద్యుత్ హామీలేవీ ఫలించలేదు. ఇప్పుడు కూడా ఆప్, కాంగ్రెస్‌కు అదే జరుగుతుందని బీజేపీ ధీమాగా ఉంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

సాక్షి
విజయనగరం
సోమవారం । 21 । నవంబర్ । 2022



తక్కువ నీటితో బాగా సాగు

తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటలు సాగుచేసేందుకు బిందు-తుంపర సేద్యం ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం రైతులకు రాయితీలను ఇస్తూ ప్రోత్సహిస్తోంది.

- 8లో



షూటింగ్ బాల్ జిల్లా జట్ల ఎంపిక

రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్- 19 జూనియర్స్ విభాగం షూటింగ్ బాల్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక పూర్తయింది.

- 8లో

ఘనంగా రిమెంబరెన్స్ డే

బొబ్బిలి: ట్రాఫిక్ సేవకులను స్మరించుకునే రిమెంబరెన్స్ డేను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సీఐ ఎం.నాగేశ్వరరావు ట్రాఫిక్ ప్రమాదాల్లో క్షతగాత్రులకు సేవలందిస్తున్న ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ, పలువురు కానిస్టేబుళ్లు, సీహెచ్‌సీ వైద్యాధికారి జి శశిభూషణరావు, సీహెచ్‌సీ సిబ్బందిని పోలీసు సర్కిల్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. అనంతరం రిమెంబరెన్స్ డే విశిష్టతను తెలియజెప్పారు. ఎస్ఐ జ్ఞానప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దేవదాయ శాఖదే.. వ్యాససారాయణ దేవస్థానం

- పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఈఓ. కిశోర్‌కుమార్

విజయనగరం టౌన్: పట్టణ శివారు బాబామెట్ట పరిసర ప్రాంతంలో ఉన్న వ్యాసనారాయణ స్వామివారి దేవస్థానం గ్రూప్ టెంపుల్స్ 104 దేవాలయాల్లో ఒకటిగా ఉందని పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఈఓ కిశోర్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవస్థానానికి చెందిన టీఎస్ నంబరు 21లో ఏ 41 సెంట్లు కొండ ఉందని, అందులో జిల్లా టూరిజం శాఖ వారికి జిల్లా రెవెన్యూ అధికారులు 2015లో సుమారు 8 సెంట్లలో అభివృద్ధి పనులు చేపట్టి శిల్పారామం పేరుతో 2016లో శంకుస్థాపన చేసి అభివృద్ధి చేశారన్నారు. ఈ వ్యాసనారాయణ దేవాలయం అతిపురాతనమై, శిథిలావస్థకు చేరి, ఎటువంటి ఆదాయ వనరులు లేకపోవడంతో 2015 నుంచి స్పార్క్ సొసైటీ ఎన్‌జీఓ ఆ దేవాలయానికి దాతల సహకారంతో రోడ్డు, మెట్లు, దేవాలయం పైకప్పు, విద్యుత్ సౌకర్యం, ఇతర అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. అయితే ఆ దేవాలయం పూర్తిగా తమ ఆధీనంలోనే ఉందని, ఎవరికీ లీజుకుగానీ, హక్కుకుగానీ ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. చుట్టుపక్కల అనధికార ఆక్రమణలు తొలగించడానికి సత్వర చర్యలు చేపట్టామన్నారు.

సత్తా చాటిన మహిళా వీఆర్‌ఓలు



విజేతలైన వీఆర్‌ఓలు లలితకుమారి, తిరుపతమ్మ

బొబ్బిలి రూరల్: గుంటూరులో ఈ నెల 11 నుంచి 13 వరకు జరిగిన రెవెన్యూ ఉద్యోగుల స్పోర్ట్స్, కల్చరల్ మీట్‌లో బొబ్బిలికి చెందిన మహిళా వీఆర్‌ఓలు లలితకుమారి, తిరుపతమ్మ 400 మీటర్ల పరుగు పోటీల్లో రాష్ట్ర స్థాయి విజేతలుగా నిలిచారు. నలుగురు ఓ టీం చొప్పున నిర్వహించిన పోటీల్లో వీరిద్దరూ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించారు. వీరిని రెవెన్యూ అధికారులు అభినందించారు.

22, 23 తేదీల్లో ఇంటర్వ్యూలు

విజయనగరం ఫోర్ట్: డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య వైద్యశాలలో డాక్టర్, పారావెట్, డ్రైవర్లగా పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులకు ఈ నెల 22, 23 తేదీల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు సంచార పశు ఆరోగ్యశాలల మేనేజర్ నారాయణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులకు విశాఖపట్నంలోని హనుమంతువాక విమ్స్ ఆస్పత్రి వద్ద ఉన్న పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. ఎంపికైన వారు విజయనగరం, పార్వతీపురంలో పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ పోస్టుకు బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, పారావెట్‌కు డిప్లమా ఇన్ వెటర్నరీ, డ్రైవర్ పోస్టుకు పదో తరగతి పాసై, హెవీ లైసెన్స్ కలిగి, రెండు మూడేళ్ల అనుభవం కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు.

కేశాయవలసలో పులి సంచారం



కేశాయవలసలో స్థానికులు గుర్తించిన పులి అడుగులు

బొబ్బిలి రూరల్: మండలంలోని చిత్రకోటబొడ్డవలస పంచాయతీ పరిధి కేశాయవలస గిరిజన గ్రామంలో ఆదివారం పులి అడుగుజాడలు స్థానిక గిరిజనులు గుర్తించారు. వెంటనే గ్రామపెద్దలకు తెలియజేయగా, అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. ఎఫ్‌బీఓ కె.స్వప్న ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బంది గ్రామానికి చేరుకుని అడుగులు పరిశీలించారు. పులి కేశాయవలస మీదుగా దేవుడిబొడ్డవలస వైపు వెళ్లినట్లు గుర్తించారు. కొంతమేర వెళ్లాక అడుగుజాడలు జాడలేదని ఎఫ్‌బీఓ స్వప్న తెలిపారు. గిరిజనులంతా అప్రమత్తంగా ఉండాలని, రాత్రివేళ, వేకువజామున ఒంటరిగా వెళ్లొద్దని, పశువులశాలల వద్ద అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

సర్వజన ఆస్పత్రిలో... 24 గంటలూ వైద్యసేవలు



రోగికి ఆపరేషన్ చేస్తున్న వైద్య సిబ్బంది

రోజులు మారాయి.. సర్వజన ఆస్పత్రిలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి. ఒకప్పుడు ఆ ఆస్పత్రికి వెళ్తే.. విశాఖ రిఫర్ చేస్తారనే రోగుల అపవాదు నుంచి ప్రస్తుతం సర్వజన ఆస్పత్రికి వెళ్తేనే మేలు... ప్రాణాలు నిలుస్తాయి.. అన్నంతగా వైద్య సేవలు అందుతున్నాయి. మొత్తంగా 24 గంటలూ రోగులకు సేవలందిస్తూ అందరి మన్ననలు అందుకుంటోంది.

- అందుబాటులో అత్యవసర వైద్యం
- కార్పొరేట్ తరహాలో శస్త్రచికిత్సలు
- రోజుకి 800 నుంచి 1000 వరకు ఓపీ సేవలు
- రోజూ 40 నుంచి 50 మంది వరకు ఇన్‌పేషేంట్లుగా చేరిక

విజయనగరం ఫోర్ట్:

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో 24 గంటల పాటు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. అత్యవసర పరిస్థితుల్లో సైతం రోగులకు సకాలంలో వైద్యం అందుతుంది. జిల్లా ఆస్పత్రిగా ఉన్న సమయంలో రాత్రివేళ వైద్య సేవలు సకాలంలో అందడం లేదనే ఆరోపణలు ఉండేవి. ప్రతీ కేసూ విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారనే ఆరోపణలు వైద్యులు ఎదుర్కొనేవారు. సర్వజన ఆస్పత్రి అయిన తర్వాత ఈ అపవాదు నుంచి బయటపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆస్పత్రిలో మౌలిక వసతులు సమకూర్చడం, వివిధ విభాగాలకు చెందిన స్పెషాల్టీ వైద్యులను నియమించడంతో అన్నివేళలా వైద్య సేవలు అందుతున్నాయి.

రిఫరల్స్ తగ్గాయి..

అపెండసైటీస్ (తీవ్రమైన కడుపు నొప్పి)తో పాటు కొన్ని రకాల క్యాన్సర్, తీవ్రమైన హెర్నియా తదితర వ్యాధులకు గతంలో పరికరాలు లేకపోవడం వల్ల విశాఖపట్నం కేజీహెచ్‌కు రిఫర్ చేసేవారు. ప్రస్తుతం ఆస్పత్రికి స్పెషాల్టీ వైద్యులు వచ్చారు. లాప్రోస్కోప్, ఎండోస్కోప్ వంటి ఆధునాతన పరికరాలు వచ్చాయి. దీంతో శస్త్ర చికిత్సలు సులభతరం అయ్యాయి. అంతేకాకుండా 24 గంటల్లోగా శస్త్రచికిత్సలు అవసరమైన వారికి వెను వెంటనే వైద్యులు చేసేస్తున్నారు. దీంతో రిఫరల్స్ చాలా వరకు తగ్గాయి.

24 గంటల పాటు వైద్య సేవలు

ఆస్పత్రిలో 24 గంటల పాటు వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. ఓపీ సేవలు ముగిసిన తర్వాత కూడా క్యాజువాలిటీల్లో నిరంతరం వైద్యులు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు. క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్(సీఎంఓ), డ్యూటీ మెడికల్ ఆఫీసర్(డీఎంఓ)లు నిరంతరం అందుబాటులో ఉంటున్నారు. అత్యవసర వైద్యం కోసం వచ్చిన వెంటనే వీరు రోగులకు వైద్యం అంది స్తున్నారు. అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాల్సి వస్తే వెంటనే సంబంధిత స్పెషాల్టీ వైద్యులకు తెలియజేసి వారిని రప్పించి శస్త్రచికిత్సలు చేయిస్తున్నారు.

రోజుకి 800 మంది వరకు ఓపీ సేవలు

ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్, పిడియాట్రిక్, మానసిక, జనరల్ సర్జరీ, డెర్మటాలజీ, ఎన్‌సీడీ, ఎముకలు, కంటి, దంత, ఈఎన్‌టీ, ఏఆర్‌టీ ఓపీ విభాగాలు ఉన్నాయి. వీటికి ప్రతి రోజు 800 నుంచి 1000 మంది రోగులు వస్తారు. అదే విధంగా ఇన్‌పేషెంట్లుగా 40 నుంచి 50 మంది రోగులు రోజూ చేరుతున్నారు.



ఆస్పత్రిలో మందులు తీసుకుంటున్న రోగులు

కార్పొరేట్ తరహాలో..

కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో రోగులకు వైద్యులు ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఎముకల సంబంధిత రోగులకు సీఆమ్ పరికరంతోను, కడుపునొప్పి, హెర్నియా తదితర రోగులకు లాప్రోస్కోప్ వంటి పరికరాలతో శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఎండో స్కోప్ సేవలను కూడా అందిస్తున్నారు.

సకాలంలో సేవలు అందిస్తున్నాం..



సర్వజన ఆస్పత్రిలో చేరిన వెంటనే రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. దానికి అనుగుణంగా వైద్యులకు విధులు కేటాయిస్తున్నాం. అన్ని రకాల సేవలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నాం. అత్యవసర వైద్య సేవలు సైతం ఇక్కడే అందేలా చర్యలు చేపడుతున్నాం. సర్వజన ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగుపడడం వల్ల రోగుల సంఖ్య కూడా పెరిగింది.

– డాక్టర్ కె.పద్మలీల, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

తక్షణమే స్పందించారు...

నాకు చాలా తీవ్రమైన కడుపునొప్పి రావడంతో సర్వజన ఆస్పత్రిలో చేరాను. అదే రోజు వైద్య పరీక్షలు నిర్వహించి, మరుసటి రోజు ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ చేయక ముందు చాలా ఇబ్బంది పడేవాడిని. ఆపరేషన్ తరువాత నొప్పి తగ్గడంతో ఇబ్బంది తీరింది. ప్రస్తుతం ఆరోగ్యంగా ఉన్నాను.

– పాశల సత్యం, పెదవేమలి, గంట్యాడ మండలం

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు, ఎన్‌సీసీ విద్యార్థులు

- జిల్లా సమన్వయకర్త రామకృష్ణ

విజయనగరం టౌన్: రాష్ట్రంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సామాజిక పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయకర్త బి.రామకృష్ణ పిలుపునిచ్చారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక సత్య డిగ్రీ కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ లక్ష్యాల సాధనకు బాల్య వివాహాలు, రక్తహీనత వంటి అంశాలు అడ్డంకిగా ఉన్నాయన్నారు. వీటిని అధిగమించాలంటే ప్రతి ఒక్కరూ బాల్య వివాహాల నిర్మూలనకు తమ వంతు సహకారాన్ని అందించాలన్నారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం పెట్టుకుని ముందుకెళ్లాలన్నారు. జిల్లా గ్రంథాలయ సేవా సంఘం వ్యవస్థాపకుడు అబ్దుల్ రవూఫ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పుస్తక పఠనం ద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. విద్యార్థి దశలోనే పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. అంతకు ముందు అవగాహన కార్యక్రమంలో భాగంగా పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ ఉదయ్ కిరణ్, పలువురు ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకన్నకు లక్ష తులసి పూజ

మెంటాడ: కార్తీక మాసోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలో ఉన్న శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామికి లక్ష తులసి పూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు పీసపాటి శ్రీనువాసాచార్యులు ఆధ్వర్యంలో పూజలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజలో పాల్గొని స్వామివారి కరుణాకటాక్షాలకు పాత్రులయ్యారు. కార్తీక మాసం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొని స్వామి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాచర్ల అప్పారావు, ముప్పిడి నగేష్, పాండ్రంకి వరహాలరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.



లక్ష తులసి పూజలో స్వామివారు

ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంపీపీ ప్రసవం



పుట్టిన బిడ్డతో ఎంపీపీ బడ్నాన ప్రమీల

పాచిపెంట: ప్రభుత్వ ఆస్పత్రిలో పాచిపెంట ఎంపీపీ బడ్నాన ప్రమీల ప్రసవించి గర్భిణులకు ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే... ప్రమీలకు శనివారం సాయంత్రం పురిటి నొప్పులు రావడంతో రాత్రి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరారు. అక్కడ వైద్యులు జి.వెంకటరావు, సిబ్బంది ప్రమీలకు సుఖ ప్రసవం చేయగా పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయని, అందుకే ప్రసవానికి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరానని ఆమె చెప్పారు. గతానికి భిన్నంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందుతున్నాయని గర్భిణులు, ఇతర రోగులు వీటిని వినియోగించుకోవాలని ఆమె సూచించారు.

జొన్నపంట ధ్వంసం

కొమరాడ: మండలంలోని కళ్లికోట పంచాయతీ గారవలస గ్రామానికి చెందిన శ్రీనివాసరాజ్ జొన్న పంటను శనివారం అర్ధరాత్రి సమయంలో గజరాజులు ధ్వంసం చేశాయి. ఏనుగుల సంచారం వల్ల తమ పంటలు నష్టపోతున్నామని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లుగా ఈ ప్రాంతంలో ఏనుగులు సంచరిస్తూ పంటలను నష్టపరుస్తున్నాయని పేర్కొన్నాడు. ఏనుగులను తరలించాలని అటవీశాఖ అధికారులను రైతులు కోరుతున్నారు.

సకాలంలో స్పందిస్తే సేఫ్

- దిశ యాప్ వినియోగంపై అవగాహన పెంచాలి
- బాలికలు, మహిళల కేసుల్లో నిందితులకు తక్షణమే శిక్ష
- మహిళా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వ చర్యలు భేష్
- రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమ



సాక్షి ప్రతినిధి, విజయనగరం:

‘రాష్ట్రంలోని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు సంక్షేమ పథకాల అమల్లోనూ.. రాజకీయ పదవుల్లోనూ పెద్దపీట వేస్తున్నారు. వారి భద్రత కోసం దిశ యాప్‌ను అమల్లోకి తెచ్చారు. మహిళల రక్షణ కోసం సచివాలయాల్లో మహిళా సంరక్షణ పోలీసులనూ నియమించారు. క్షేత్ర స్థాయిలో ఇవన్నీ సంతృప్తికరమైన ఫలితాలు ఇస్తున్నా ఇంకా అక్కడక్కడ ఒకటీ రెండు దుర్ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. వాటిని ఆదిలోనే గుర్తించి సకాలంలో స్పందిస్తే తగిన చర్యలు తీసుకోవడానికి, బాధ్యులకు వెనువెంటనే తగిన శిక్ష వేయించడానికి వీలవుతుంది. బాలికలు, మహిళలు పైకి చెప్పుకోలేని సమస్యలు ఉన్నా మహిళా కమిషన్ దృష్టి పెడుతుంద’ని ఆ కమిషన్ సభ్యురాలు గెద్దం ఉమ చెబుతున్నారు. పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో రెండ్రోజుల పర్యటన ముగించుకున్న ఆమె సాక్షి ప్రతినిధితో మాట్లాడారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

సాక్షి ఇంటర్వ్యూ

‘పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలంలో కురుకుట్టిలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్‌పై పోక్సో చట్టం, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదైంది. తనను లైంగికంగా వేధిస్తున్నారంటూ ఓ విద్యార్థిని ఫిర్యాదు మేరకు అతనిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అక్కడి విద్యార్థినుల్లో మానసిక స్థైర్యం కలిగించేందుకు వారి వద్దకు వెళ్లి మాట్లాడాను. తగరపువలసలో ఇటీవల 75 ఏళ్ల వ్యక్తి తొమ్మిదేళ్ల చిన్నారిని లైంగికంగా వేధించిన ఘటన మహిళా కమిషన్ దృష్టికి వచ్చింది. ఆ వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేయించాం. మూడు నెలల్లోనే శిక్ష వేయించగలిగాం. విశాఖ రూరల్ ప్రాంతంలో అదనపు వరకట్న వేధింపుల వల్ల ఒక తల్లి తన ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చి తాను కూడా విషం తాగేసింది. వారి ముగ్గుర్నీ విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యంతో ఒక బిడ్డకు మాత్రమే ప్రాణాపాయం తప్పింది. తల్లి, మరో బిడ్డ చనిపోయారు. ఈ కేసులో తండ్రిని పోలీసులు అరెస్టు చేశారు. బతికిన ఆరేళ్ల బిడ్డ అనాథ అయ్యింది. ఆమె వైద్యానికి రూ.7 లక్షల వరకూ ఖర్చు అయ్యింది. కలెక్టర్‌ను సంప్రదించి ప్రభుత్వం ద్వారా ఆ మొత్తం చెల్లించే ఏర్పాటు చేశాం. ఇలా రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా మహిళలు, బాలికలకు సంబంధించిన అన్ని రకాల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తున్నాం. విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లా బాధ్యతలను ప్రభుత్వం ఆమెకు అప్పగించింది.

సీఎం లక్ష్యానికి అనుగుణంగా కృషి

ఆధునిక సమాజానికి ఆధునిక మహిళలను ఆంధ్రప్రదేశ్ నుంచి పరిచయమవ్వాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. అందుకనుగుణంగా వారికి కనీస సౌకర్యాల ఏర్పాటు, రక్షణ, హక్కుల పరిరక్షణ, సాధికారత సాధనకు సహకారం తదితర విషయాల్లో మహిళా కమిషన్ తోడ్పాటు అందిస్తుంది. ఇప్పటివరకూ మహిళలకు ఏదైనా సమస్య వస్తేనే కమిషన్ వద్దకు వస్తున్నారు. అలా కాకుండా ఆ సమస్య తలెత్తకుండా ఆదిలోనే అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో కమిషన్ ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే క్షేత్ర స్థాయిలో పర్యటనలు చేస్తున్నాం. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం, విజయనగరం జిల్లా గంట్యాడ మండలాల్లో పర్యటించాం. అక్కడ మహిళలు, యువతులు, విద్యార్థినులతో మాట్లాడితే పలు విషయాలు తెలిశాయి. ఆ సమస్యల పరిష్కారానికి సంబంధింత ఎస్పీ, కలెక్టర్‌కు రిపోర్టు చేస్తున్నాం. అదే సమయంలో బాధితుల సమాచారం గోప్యంగా ఉంచుతూ సమస్యను దాదాపుగా పరిష్కరిస్తున్నాం. తీవ్రత ఎక్కువగా ఉన్న కేసుల్లో అవసరాన్ని బట్టి ప్రభుత్వ శాఖల సహకారంతో హైకోర్టుకు, సుప్రీంకోర్టుకు వెళ్తాం.

‘దిశ’ యాప్‌పై అవగాహన అవసరం



విద్యార్థినులు, మహిళల రక్షణ కోసం ఉద్దేశించిన దిశ యాప్‌పై అవగాహన కల్పించుకోవాలని మా పర్యటనల్లో ప్రతీ చోటా చెబుతున్నాం. గ్రామ, వార్డు సచివాలయాల్లోని మహిళా సంరక్షణ పోలీసులు వారానికి రెండు మూడు సార్లు సమీపంలోని పాఠశాలలకు వెళ్తూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు కౌన్సెలింగ్ చేస్తున్నారు. ఇది సత్ఫలితాలను ఇస్తోంది. అయితే ఇంకా తమ బంధువులు, కుటుంబ సభ్యుల నుంచి కూడా లైంగిక వేధింపులు ఎదురవుతున్నాయని, తల్లిదండ్రులకు చెప్పుకోలేక పోతున్నామని కొంతమంది విద్యార్థినులు నాకు చెబుతున్నారు. అలాంటి చర్యలకు ఆదిలోనే అడ్డుకట్ట వేసేలా మహిళా సంరక్షణ పోలీసులు సంబంధిత వార్డు వలంటీర్ల సమన్వయంతో గుర్తించాలి.

ఆరోగ్యవంతమైన సౌకర్యాలు కల్పించేలా...

సాలూరులోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను సందర్శించాను. బోధనాపరంగా అంతా బాగుంది. అది ఒక అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. అక్కడ వంట సిబ్బందికి, ఉద్యోగులకు మధ్య సమన్వయం లేకపోవడంతో విద్యార్థులు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఆ సమస్య పరిష్కరించే ప్రయత్నం చేశాం. గిరిశిఖర గ్రామాలకు చెందిన గిరిజన గర్భిణుల కోసం సాలూరు వైటీసీలో ఏర్పాటు చేసిన వసతి కేంద్రాన్ని పరిశీలించాం. అన్ని సౌకర్యాల కల్పనకు నిధుల లోటు లేకుండా చూస్తామని విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు స్పందించారు. ఖర్చులో 50 శాతం మొత్తాన్ని జెడ్పీ నుంచి సమకూరుస్తామని హామీ ఇచ్చారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగమయ్యేలా...

ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగమవ్వాలి. క్షేత్ర స్థాయిలో సంపూర్ణంగా ఏ విధంగా చేరుతున్నదీ పరిశీలిస్తున్నాం. ఉదాహరణకు పిల్లల్లో పౌష్టికాహార లోపం నివారణకు జగనన్న గోరుముద్ద పథకం ప్రవేశపెట్టారు. తద్వారా పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం సరిగా అందుతుందా.. లేదా.. అనేదీ పరిశీలిస్తున్నాం. సంతృప్తికరంగానే అందుతున్నాయి. నాడు – నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. మౌలిక సౌకర్యాలతో పాటు ఆహ్లాదకరమైన వసతులు సమకూరాయి.

బీచ్‌లో జనసంద్రం



చింతపల్లి బీచ్ పర్యాటకులతో ఆదివారం జనసంద్రంగా మారింది. కార్తీక మాసం చివరి ఆదివారం, పిక్నిక్ చివరి వారం కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సముద్రంలో కేరింతలు కొడుతూ సందడిగా గడిపారు. బీచ్ ఒడ్డున ఉన్న తోటల్లో వనభోజనాలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో తీరంలో ఉల్లాసంగా గడిపారు. గోవిందపురం సమీపంలోని ముక్తిధాం క్షేత్రం, షిర్డీ సాయిబాబా ఆలయాలను సందర్శించారు. – పూసపాటిరేగ

క్లుప్తంగా

కోడిపందాల రాయుళ్లపై కేసు



పోలీసుల అదుపులో కోడిపందాల రాయుళ్లు

సీతానగరం: మండలంలోని తామరఖండి గ్రామ సమీప తోటలో కోడిపందెం ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై కె.నీలకంఠం ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా తోటలో కోడిపందాలు ఆడుతున్నట్లు గుర్తించి 8 మంది పందాల రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి దగ్గర నుంచి రూ.3.170, ఒక కోడిపుంజును స్వాధీనం చేసుకున్నారు. పందాల రాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నీలకంఠం తెలియజేశారు.

యువతి అదృశ్యం

శృంగవరపుకోట: పట్టణానికి చెందిన 19 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై తారకేశ్వరరావు చెప్పారు. ఆ యువతి శనివారం తెల్లవారుజామున 3.30గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తల్లి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విషం తాగి వ్యక్తి ఆత్మహత్య

శృంగవరపుకోట: పట్టణంలోని గవరవీధికి చెందిన కాళ్ల కిరణ్ విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్సై తారకేశ్వరరావు తెలిపారు. శనివారం మధ్యాహ్నం విషం తాగేసిన కిరణ్‌ను కుటుంబసభ్యులు విశాఖ కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మృతిచెందాడు. ఎదురింటి వారు తిట్టారని మనస్తాపం చెంది కిరణ్ విషం తాగినట్లు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.


ముగ్గురికి తీవ్ర గాయాలు



బొబ్బిలి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బొబ్బిలి: పట్టణంలోని రాణిగారి తోటలో పిక్నిక్ ముగించుకుని వస్తున్న ఆటో ఎదురుగా వస్తున్న మోటర్ బైక్ పరస్పరం ఢీకొట్టడంతో ముగ్గురు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ ప్రమాదంపై ఏఎస్సై జి.భాస్కర రావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురానికి చెందిన కె.శ్రీలత బొబ్బిలిలో ఉంటున్న సోదరి భారతి ఇంటికి వచ్చి వారితో కలిసి పిక్నిక్‌కు వెళ్లింది. వీరు పిక్నిక్ నుంచి ఆటోలో తిరిగి వస్తుండగా ఎదురుగా గొల్లపల్లికి చెందిన దుర్గాప్రసాద్ బైక్‌తో ఎదురుగా రావడంతో రెండు వాహనాలు ఢీకొన్నాయి. వారిని సీహెచ్‌సీకి తరలించగా ప్రాథమిక చికిత్స చేసిన వైద్యులు శ్రీలతను, దుర్గాప్రసాద్‌ను విజయనగరం రిఫర్ చేశారు. భారతి ఇక్కడే చికిత్స పొందుతోంది. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై జి భాస్కరరావు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వసతి గృహ విద్యార్థికి..



గాయాల పాలైన విద్యార్థి ఆశిష్‌ను 108 వాహనంలో విజయనగరం తరలిస్తున్న దృశ్యం

గజపతినగరం: విద్యుత్ వైరు తగిలి షాక్ కొట్టడంతో స్థానిక సంక్షేమ కళాశాల వసతి గృహ విద్యార్థి తీవ్రగాయాల పాలయ్యాడు. ఆదివారం సాయంత్ర జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. స్థానిక ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి కె.ఆశిష్ వసతిగృహం రెండవ అంతస్తు నుంచి కిందికి దిగుతున్న సమయంలో వసతిగృహం మెట్ల పక్క నుంచి వెళ్తున్న విద్యుత్ మెయిన్ వైరు అనుకోకుండా చేతికి తగలిడంతో కిందపడిపోయాడు. దీంతో తీవ్రగాయాల పాలవడంతో తోటి విద్యార్థులు, సిబ్బంది గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక వైద్య సేవలు పొందాడు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయనగరం మహారాజా (సర్వజన)ఆస్పత్రికి 108 వాహనంలో తరలించినట్లు కళాశాల సంక్షేమ అధికారి ఎస్.రామకృష్ణ తెలిపారు.

తక్కువ నీటితో బాగా సాగు

- బిందు-తుంపర సేద్యమే ప్రత్యామ్నయం
- 2022-23లో లక్ష్యం 4,500 హెక్టార్లు



బిందుసేద్యంతో సాగుచేస్తున్న పంటలు



పంటకు నలుమూలల నీరుఅందేలా నీటిసరఫరా అవుతున్న తుంపర సేద్యం



కొల్లాయి వలసలో బిందుసేద్యం యూనిట్ అమర్చి పరిశీలిస్తున్న ప్రాజెక్టు అధికారి లక్ష్మీనారాయణ

వేపాడ: తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో పంటలు సాగుచేసేందుకు బిందు-తుంపర సేద్యం ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం రైతులకు రాయితీలను ఇస్తూ ప్రోత్సహిస్తోంది. ఈ మేరకు రైతులు సద్వినియోగం చేసుకునేలా సంబంధిత మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. వర్షపాతం, వర్షపు నీడ ప్రాంతాలు, అనూహ్యంగా వర్షాలు, భూగర్భజలాలు క్షీణిస్తుండడంతో 2003లో ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి పారుదల పథకం (ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్) రైతులకు ఉపయోగపడేలా బిందు తుంపర సేద్యం పథకానికి శ్రీకారం చుట్టింది. నాటినుంచి ప్రభుత్వం దృష్టి సారించి రైతులకు అవగాహన కల్పిస్తోంది. ప్రస్తుతం పెట్టుబడులు పెరిగిపోవడంతో వ్యవసాయంపై రైతులకు ఆసక్తి తగ్గుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తూ రైతుభరోసా, సున్నా వడ్డీకి రుణాలు, రాయితీపై విత్తనాలు, ఎరువులు, రోజుకు పగటిపూట 9 గంటలకు విద్యుత్ సరఫరా, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తూ వ్యవసాయంపై ఆసక్తి పెంచేందుకు పలు ప్రోత్సాహకాలు అందిస్తోంది. దీనిలో భాగంగా ఏపీఎంఐపీ ద్వారా రైతులకు రాయితీపై బిందు-తుంపర సేద్యం పట్ల ప్రోత్సహిస్తోంది. ఈ సేద్యంతో తక్కువ నీటితో అదనపు విస్తీర్ణంలో పలు రకాల పంటలు, కూరగాయలు సాగుచేసేందుకు అవకాశముందని కలెక్టర్ సూర్యకుమారి ఇచ్చిన ఆదేశాలమేరకు ఏపీఎంఐపీ అధికార బృందం, ఉద్యాన వనశాఖ సిబ్బంది గ్రామాలను సందర్శించి బిందు తుంపర సేద్యంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

బిందుసేద్యంతో లాభాలు

సాగునీటి ఆదా, భూగర్భజలవనరుల పొదుపు, అధిక దిగుబడి, ఇసుక నేలలు, ఎగుడు దిగుడు భూముల్లో బిందు సేద్యం ద్వారా సాగుచేసుకోవచ్చు. కరెంట్ వినియోగంలో పొదుపు ఎరువుల వినియోగం 80శాతం మొక్కలకు అందుతుంది.

రాయితీలు ఇలా...

బిందు సేద్యం పరికరాలపై చిన్న, సన్నకారు రైతులకు (ఐదెకరాల లోపు) రూ.2,18,000 వరకు రాయితీ డ్రిప్‌పరికరాలను 90శాతం రాయితీతో మించకుండా అందిస్తారు. 5 నుంచి 12.50 ఎకరాలు కలిగిన రైతులకు 3,10,000 రాయితీ వరకు డ్రిప్ పరికరాలను 50శాతం రాయితీతో ఇస్తారు.

సాగు లక్ష్యం ఇలా



జిల్లాలో రైతులకు బిందు-తుంపర సేద్యంపై అవగాహన కల్పిస్తున్నాం. నేటివరకు ఆన్‌లైన్‌లో 1650మంది పేర్లు నమోదు చేసుకోవడంతో 1800 హెక్టార్లలో సేద్యం చేయవచ్చు. వేపాడ మండలంలో 100 హెక్టార్లలో బిందు తుంపర సేద్యం చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నాం.
పీఎన్‌వీ లక్ష్మీనారాయణ ప్రాజెక్టు డైరెక్టర్ ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు విజయనగరం

ఎరుపెక్కిన ఎస్‌కోట



ఎస్.కోటలో ర్యాలీలో పాల్గొన్న సీపీఎం నేతలు, కార్యకర్తలు

- సీఐటీయూ భారీ ర్యాలీ

శృంగవరపుకోట: సీఐటీయూ 10వ జిల్లా మహాసభలకు ఎస్‌కోట వేదికైంది. కర్షక, కార్మిక, ఉద్యోగ, అసంఘటిత రంగాల్లో ఉన్న కార్మికులు అంతా ఒక్కటై సిటు నేతృత్వంలో కదంతొక్కి మహాసభలకు తరలి రావడంతో పట్టణం ఎరుపెక్కింది. ఈ మేరకు ఆదివారం స్థానిక ఆకుల డిపో నుంచి భారీ సంఖ్యలో సిటు అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు ఎర్ర జెండాలతో నినదిస్తూ స్థానికదేవీ జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. కళాబృందాలు తమ పాటలతో ఆకట్టుకున్నాయి. దేవీ జంక్షన్‌లో సిటు జిల్లా ఉపాధ్యక్షుడు జిఅప్పలసూరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సిటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాలనలో కార్మికులకు కష్టాలే మిగిలాయి. దేశాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతున్నారు. మోడీ పాలనకు వ్యతిరేకంగా వచ్చే ఏడాది ఏప్రిల్ 14న పార్లమెంట్ ఎదుట ధర్నా చేస్తామని పేర్కొన్నారు. సిటు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బారావమ్మ మాట్లాడుతూ సామాన్య, మధ్యతరగతి వర్గాలు బతకలేని ప్రభుత్వాలు రాజ్యమేలుతున్నాయని, కార్మికుల హక్కుల్ని కాలరాసి, లాఠీరాజ్యంతో నాటి బ్రిటిష్ పాలన మరోమారు రుచి చూపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సిటు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వి.రమణ మాట్లాడుతూ అటు దేశంలో, ఇటు రాష్ట్రంలో నిత్యవసరాల ధరలు ఆకాశంలో, ఉపాధి కల్పన, వేతనాలు పాతాళంలో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో జూట్, పరిశ్రమలు మూతపడి కార్మికులు రోడ్డున పడుతుంటే ప్రభుత్వాలు చేష్టలుడిగి చూస్తున్నాయని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాలలపై లైంగిక వేధింపులను అరికట్టాలి

- చైల్డ్ రైట్స్ ఫోరమ్ జిల్లా చైర్మన్ చిట్టిబాబు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న చిట్టిబాబు,తదితరులు

విజయనగరం పూల్‌బాగ్: బాలలపై లైంగిక వేధింపులను అరికట్టాలని చైల్డ్ రైట్స్ ఫోరమ్ జిల్లా చైర్మన్ పి చిట్టిబాబు కోరారు. ఈ మేరకు జిల్లా ఫోరమ్ ఫర్ చైల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక డీబీఎస్‌యూ జిల్లా కార్యాలయంలో లైంగిక వేధింపుల నుండి రక్షణ పొందేందుకు 'నా శరీరం- నా నియమాలు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండని బాలలపై లైంగిక వేధింపులు, లైంగికదాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని, వాటి నిర్మూలనకు బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2012లో తీసుకువచ్చారన్నారు. ఈ చట్టంపై ప్రజలు, ఉపాధ్యాయులు, ఆటో డ్రైవర్లు, పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీలకు అవగాహన అవసరమని అభిప్రాయ పడ్డారు. 'నా శరీరము-నా నియమాలు' అనే పుస్తకం బాలలకు లైంగిక వేధింపుల నుంచి రక్షణ పొందేందుకు కావలసిన అవగాహన ఇస్తుందని అభిప్రాయ పడ్డారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిని, గర్ల్ చిల్డ్రన్ ఫోరమ్ ప్రతినిధి పి.అప్పలకొండ, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు బుంగ భానుమూర్తి, డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కోర్డినేటర్ కె వరలక్ష్మి, జేఎంజే సంస్థ ప్రతినిధి జొన్నాడ చిన్నారావు, పెంకి చరణ్, ఆర్ ప్రియ, ఎస్.దివ్య, కె ధరణి, ఎన్ రమణ తదితరులు పాల్గొన్నారు.

ఖురాన్ కంఠస్థ రాష్ట్ర పోటీలకు ముగ్గురి ఎంపిక



ఖురాన్ కంఠస్థ పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

విజయనగరం టౌన్: యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కంటోన్మెంట్‌లో ఉన్న మసీదు ప్రాంగణంలో విద్యార్థులకు ఎనిమిదవ ఖురాన్ కంఠస్థ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఖురాన్ గ్రంథాన్ని పారాయణం చేసి ప్రతిభను కనబర్చారు. 30 మంది విద్యార్థులకు పోటీల నిర్వాహకుడు మహమ్మద్ హబీబ్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో గెలుపొందిన జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉచిత శిక్షణ

- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్

పార్వతీపురం టౌన్: ఇంజినీరింగ్ విద్యార్థుల్లో నైపుణ్యాలను మెరుగుపరిచి ఉపాధిబాట కల్పించేందుకు వివిధ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నంలోని స్కిల్ కాలేజీలో మెకాట్రోనిక్స్ డిజైనర్ అండ్ సిస్టం ఇంటిగ్రేటర్, ప్రొడక్షన్ డిజైనర్, ఇంజినీరింగ్ మెకానికల్ ఆటోమేటిక్ రోబోటిక్ వంటి కోర్సులలో చేరేందుకు ఇంజినీరింగ్ పూర్తిచేసిన అభ్యర్థులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు. అనకాపల్లిలోని స్కిల్ కాలేజీలో సీఎస్ఈ టెక్నాలజీ, ప్రొడక్షన్ డిజైన్, మెకాట్రోనిక్స్ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ గ్రూపులలో డిప్లమో, ఇంజినీరింగ్ పూర్తిచేసిన అభ్యర్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ప్రతి స్కిల్ కాలేజీలో ఉచితంగా శిక్షణతోపాటు వసతి, భోజన సదుపాయం, శిక్షణ అనంతరం ప్రముఖ కంపెనీలలో ఉపాధి కల్పిస్తామని స్పష్టం చేశారు. ఈనెల 24లోగా ఆశావహులు వారి పేర్లను స్కిల్ డెవలప్‌మెంట్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 6305110947, 6303493720 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అంగన్వాడీ సమస్యలపై పోరాటం

- యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు బేబిరాణి



కురుపాంలో ర్యాలీ నిర్వహించిన అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సభ్యులు

కురుపాం: అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడదామని ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబిరాణి పిలుపునిచ్చారు. ఈ మేరకు కురుపాం నియోజకవర్గ కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణంలో ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా 8వ మహాసభలు యూనియన్ జిల్లా అధ్యక్షురాలు హిమప్రభ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షురాలు బేబిరాణి మాట్లాడుతూ అంగన్వాడీ వ్యవస్థను పటిష్టం చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసే రీతిలో వ్యవహరించడం దుర్మార్గమని, బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై కోతలు విధిస్తూ, మరోపక్క ఎన్‌ఈపీ అంటూ అంగన్వాడీ కేంద్రాలకు మంగళం పాడేందుకు కుట్రచేస్తున్నట్లు ఉందని ఆరోపించారు. నూతన విద్యావిధానం రద్దు చేయాలని, తెలంగాణ రాష్ట్రంలో వేతనాలు పెంచి పీఆర్సీ కూడా అమలు చేశారని, అంగన్వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, పెన్షన్స్‌తో కూడిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే బకాయిలు, టీఏ, గ్యాస్ బిల్లులు, సీబీ ఈవెంట్ బిల్లులు తక్షణమే చెల్లించాలని, అర్హులకు ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ల రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం.ఉమామహేశ్వరి, కార్యదర్శి జి.జ్యోతి, సహాయ కార్యదర్శి వి.రామలక్ష్మి, సభ్యులు వి.ఇందిర, సీఐటీయు జిల్లా అధ్యక్షుడు జి.వెంకటరమణ, కార్యదర్శి వై.మన్మథరావు, రెడ్డి వేణు, కొల్లి గంగునాయుడు, అధిక సంఖ్యలో అంగన్‌వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జిల్లా షూటింగ్ బాల్ జట్ల క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరగనున్న అండర్-19 జూనియర్స్ విభాగం షూటింగ్ బాల్ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక పూర్తయింది. నగర శివారులో గల జమ్ము నారాయణపురం మహాత్మాగాంధీ జ్యోతి బా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఎంపికలను జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమూర్తి పర్యవేక్షించారు. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 80 మంది క్రీడాకారులు హాజరుకాగా..బాలుర విభాగంలో 12 మందిని, బాలికల విభాగంలో 12 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు అనకాపల్లి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు. ఎంపిక ప్రక్రియలో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 520.00
విజయనగరం	రూ. 524.00
శ్రీకాకుళం	రూ. 524.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	53,180-00
బంగారం(22సి. 10గ్రా.)	48,750-00
వెండి (కిలో)	67,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹115	₹200	₹ 210

బస్సు ఢీకొని బాలుడి మృతి

- పలువురికి స్వల్పగాయాలు
- ఇంటి మీదికి దూసుకుపోయిన ఆర్టీసీ బస్సు





కొడుకు మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, ప్రమాదంలో చనిపోయిన అభిషేక్

శృంగవరపుకోట: అభంశుభం తెలియని బాలుడ్ని ఆర్టీసీ బస్సు రూపంలో మృత్యువు కాటేసింది. స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ధర్మవరం రూట్‌లో విజయనగరం బయల్దేరిన ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు ధర్మవరం శివారు మారుతీనగర్ మలుపు వద్ద ఆదివారం ఉదయం 8గంటల సమయంలో ఒక్కసారిగా డ్రైవర్ గంగునాయుడికి అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చి స్టీరింగ్‌పై పడిపోయాడు. దీంతో బస్సు అదుపు తప్పి, రోడ్డు పక్కన ఉన్న ఇంటిపైకి దూసుకుపోయి ఆ సమయంలో ఇంటి ముందున్న బాలుడు శిరికి అభిషేక్(12)ను ఢీకొట్టింది. అదే సమయంలో అక్కడ వంట చేస్తున్న తొత్తడి పాపకు గాయాలయ్యాయి. ఇంటి ముందర భాగం ధ్వంసమైంది. ఆర్టీసీ బస్ ముందర భాగం చాలా వరకూ దెబ్బతింది. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి వచ్చి బాలుణ్ని ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. డ్రైవర్ గంగునాయుడు, తొత్తడి పాపకు వైద్య సేవలు అందించారు. ఎస్.కోటలోని ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న కొడుకు అభిషేక్ కళ్లముందు చనిపోవడంతో తండ్రి గోవిందరావు, తల్లి మాధవి కన్నీరు మున్నీరుగా విలపించడంతో ఆస్పత్రి ప్రాంగణం శోకసంద్రమైంది. ఎస్.కోట సీఐ సింహాద్రినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ప్రమాదంలో ఒడిశా వాసి..

లక్కవరపుకోట: మండలంలోని శ్రీరాంపురం గ్రామం సమీపంలో గల స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ కర్మాగారం రోడ్డులో ఆదివారం జరిగిన బైక్ ప్రమాదంలో ఒడిశా రాష్ట్రానికి చెందిన విజయ్‌షిండే(28) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రగాయాల పాలై విజయనగరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కర్మాగారంలో గల ఎస్ఎంఎస్ యూనిట్‌లో పనిచేస్తున్న విజయ్‌షిండే స్నేహితుడితో కలిసి గోల్డ్‌స్టార్ జంక్షన్ వద్ద పని ముగించుకుని కర్మాగారంలో గల కాలనీకి బైక్‌పై వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కన గల స్తంభాన్ని బలంగా ఢీకొట్టాడు. దీంతో బైక్ డ్రైవ్ చేస్తున్న విజయ్‌షిండే తలకు తీవ్రమైన గాయం కావడంతో మృతిచెందాడు. మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం మేరకు ఎస్సై ముకుందరావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. పోస్ట్‌మార్టం కోసం ఎస్‌కోట సీహెచ్‌సీకి మృతదేహాన్ని తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్-బైక్ ఢీకొని యువకుడు..



చీపురుపల్లి రూరల్: మృతిచెందిన శంకరరావు

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి మండలంలోని నాగంపేట జంక్షన్ సమీపంలో ట్రాక్టర్-బైక్ ఢీకొన్న ప్రమాదంలో మెరకముడిదాం మండలం యాడిక గ్రామానికి చెందిన అలజంగి శంకరరావు(28) ఆదివారం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. శంకరరావు పెయింటింగ్, పుట్టి పనులు చేస్తూ తల్లిదండ్రులను పోషిస్తున్నాడు. చీపురుపల్లి పట్టణంలోని పిల్లపేట గ్రామానికి చెందిన మరో పెయింటర్ దాసరి రాముతో కలిసి పెయింటింగ్ పనుల నిమిత్తం లావేరు మండలం వెంకటాపురం గ్రామానికి వెళ్లాడు. పనులు పూర్తయిన తరువాత మధ్యాహ్నం 2గంటల సమయంలో చీపురుపల్లి తిరిగి వస్తుండగా చీపురుపల్లి-సుభద్రాపురం ప్రధాన రహదారిలో నాగంపేట జంక్షన్ సమీపంలో వారి బైక్‌ను ట్రాక్టర్ ఢీకొనడంతో ఇద్దరికీ బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చీపురుపల్లి ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేసి అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా తల, మెడపై తీవ్రగాయాలైన శంకరరావు మార్గమధ్యంలో మృతిచెందాడు. బైక్‌పై వెనుక కూర్చున్న రాముకు ఎడమ కాలు, కుడి నుదుటిపై గాయాలయ్యాయి. మృతుడి తండ్రి అప్పారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

కృష్ణారావుకు విజ్ఞాన గురు పురస్కారం



కృష్ణారావును సత్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లా సైన్స్ కో ఆర్డినే టర్ మిరియాల కృష్ణారావుకు ఏపీజే అబ్దుల్ కలాం విజ్ఞాన గురుపురస్కారం వరించింది. గుంటూరుకు చెందిన చివుకుల హనుమంతరావు చారిటబుల్ ట్రస్ట్ వారు ఇటీవల గుంటూరులో ఈ అవార్డును అందజేశారు. విజ్ఞానశాస్త్ర పాఠ్య బోధన, ఇన్‌స్పైర్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్, సైన్స్ ప్రదర్శనలలో రాష్ట్ర, జాతీయ ప్రాజెక్టులు తయారు చేసినందుకు గాను అవార్డు అందజేశారు. ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ కె.రామ్మోహనరావు, డాక్టర్ మల్లికార్జున రావు, సీహెచ్ సాంబశివరావు, తదితరుల చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప గురుస్వాములు

విజయనగరం టౌన్: నగరంలోని ఉడా కాలనీలో ఉన్న ధర్మశాస్త అయ్యప్పస్వామి పంచాలయ ఆలయంలో పడి పూజ, అంబలం పూజ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కోట్ల సుగుణాకర రావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా గురుస్వామి సాయి బాబా మాట్లాడుతూ, చిన్నపిల్లలు ఏ కారణం చేతనైనా శబరిమలై వెళ్లలేని వారు ఇక్కడ ఇరుముడులు సమర్పించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో శ్రీను, ఆలయ అర్చకులు జయంతి శ్రీనివాస్, తెన్నేటి సంతోష్, కోట్ల కిరణ్, రామచంద్రరాజు, రమేష్, కేశవ, తదితరులు పాల్గొన్నారు.

యాదవులను బీసీ -ఏ లోకి మార్చాలి



సమావేశంలో పాల్గొన్న యాదవ సంఘ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: యాదవులను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని యాదవ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో యాదవ ఉద్యోగులు, నిరుద్యోగ, విద్యార్థి సంఘ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల్లోని యాదవుల సమస్యలపై చర్చించారు. సమావేశంలో సంఘ నాయకులు ఒమ్మి సన్యాసిరావు, మన్యాల కృష్ణ, ముచ్చి రామలింగ స్వామి, పల్లా అప్పలస్వామి, గదుల సత్యలత, ఇసరపు శేఖర్, ఇప్పిలి శ్రీను, గోలగాని రమేష్, ముద్దాడ మధు, పల్లా రవికుమార్‌యాదవ్, జోగ చంద్రశేఖర్, ఆవాల కమలనాభరావు, కోరాడ వేణుగోపాల్, కొయ్యన సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

పెదతాడివాడలో దంత వైద్యశిబిరం



రోగులకు మందులు అందజేస్తున్న డాక్టర్ బాలాజీ, ప్రజాప్రతినిధులు

డెంకాడ: మండలంలోని పెదతాడివాడలో ఇండియన్ దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యుడు ఎం. బాలాజీ రోగులను పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు కరుమజ్జి త్రినాథరావు, ఎంపీటీసీ సభ్యులు గాదిపల్లి రమేష్, పంటపల్లి జగన్నాథం, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు చింతపల్లి రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వనభోజనాలు ఐక్యతకు, ఆధ్యాత్మికతకు నిలయాలు

● నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం టౌన్: కార్తీక వనభోజనాలు ఐక్యత, ఆధ్యాత్మికతకు నిలయాలని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. శిల్పారామంలో శ్రీ గౌరీ సేవా సంఘం గవర సామాజికవర్గం ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన కార్తీక వనభోజన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆమెను ఉచితరీతిన సత్కరించారు. అదేవిధంగా కొండవెలగాడ రోడ్డులో ఉన్న తోటలో నాగవంశీయుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధనలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు అవనాపు విజయ్, నాగవంశ సామాజికవర్గ పెద్దలు, పాల్గొన్నారు.



పూసపాటిరేగ: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం శంకరరావు, తదితరులు



నెల్లిమర్ల రూరల్: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్‌బాబు



డెంకాడ: ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ గౌరీ, తదితరులు



నెల్లిమర్ల: మాట్లాడుతున్న ఏపీ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

● నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం:

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షురాలు రెడ్డి పద్మావతి అన్నారు. ముందుగా సరస్వతీదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో జరిగిన వారోత్సవాల్లో వారు మాట్లాడుతూ, అక్షర సమాజం పుట్టిన నాటి నుంచి గ్రంథాలయాలు జీవన వికాసానికి, సామాజిక పురోగతికి ఎంతో కృషి చేస్తున్నాయన్నారు. గ్రంథాలయాలు అందిస్తున్న సేవలను ప్రజలకు తెలియజేసే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తోందన్నారు. గ్రంథాలయాలు సమాజ అభివృద్ధిలో అంతర్భాగమని చెప్పారు. నేటి యువత గ్రంథాలయాలను వినియోగించి జ్ఞానాన్ని సముపార్జించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయాల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మన్యం జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణాజీ, రాజాం కళాశాల ప్రిన్సిపాల్ స్వప్న హైందవి, ప్రముఖ రచయిత్రి చాగంటి తులసి, గ్రంథాలయ సెక్రటరీతో పాటు పలువురు పుస్తకాభిమానులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.



విజయనగరం: విజేతలతో మేయర్ విజయలక్ష్మి, తదితరులు

సద్వినియోగం చేసుకోవాలి

పూసపాటిరేగ: గ్రంథాలయాలను యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి. శంకరరావు అన్నారు. రాజీవీధిలో గల గ్రంథాలయంలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, గ్రంథాలయాలలో పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేవారు. కార్యక్రమంలో సర్పంచ్ టొంపల సీతారాం, గ్రంథాలయాధికారి నాగేశ్వరరావుతో పాటు పలువురు పాఠకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కుమిలిలో...

మండలంలోని కుమిలి గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఇందుమతి, ప్రజాప్రతినిధులు, పాఠకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు

డెంకాడ: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల నేపథ్యంలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ముగింపు వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పతివాడ గౌరీ, లైబ్రేరియన్ వై.మహేష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వినియోగించుకోవాలి

నెల్లిమర్ల రూరల్: గ్రంథాలయాలను విద్యార్థులు, యువత వినియోగించుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్‌బాబు అన్నారు. మండలంలోని మొయిద గ్రంథాలయంలో జరిగిన ముగింపు వారోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ, గ్రామీణ గ్రంథాలయాల్లో చదువుకున్న ఎంతోమంది నేడు ప్రభుత్వ కొలువుల్లో స్థిరపడ్డారని.. అటువంటి వారిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అట్టాడ కృష్ణ, సంచాన సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్లలో..

నెల్లిమర్ల: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, ఏపీ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు అన్నారు. నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలోని గ్రామీణ గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమం లైబ్రేరియన్ నారాయణమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు, శ్రీనివాసరావు మాట్లాడుతూ, గ్రంథాలయాలను విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. నారాయణమూర్తి, శ్రీనివాసరావు, ప్రకాశరావు పాల్గొన్నారు.

గాజులరేగలో ..

విజయనగరం అర్బన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు స్థానిక గాజులరేగ గ్రంథాలయ బ్రాంచ్ కార్యాలయంలో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు సభకు ముఖ్య అతిథిగా 48వ డివిజన్ కార్పొరేటర్ పి.ఆదినారాయణ హాజరయ్యారు. వారం రోజుల పాటు నిర్వహించిన వివిధ అంశాల పోటీల విజేతలకు ఆదినారాయణ జ్ఞాపికలు అందజేశారు. గ్రంథాలయ అధికారి ఎం.లక్ష్మణరావు అధ్యక్షతన జరిగిన సభలో తెలుగు యువత సంఘ అధ్యక్షుడు పి.రామునాయుడు, నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ నారాయణరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విజయనగరం అర్బన్: జ్ఞాపికలు అందుకుంటున్న విజేతలు

రెచ్చగొట్టేలా చంద్రబాబు ప్రసంగం..

● ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు

నెల్లిమర్ల: టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు ఇటీవల కర్నూల్‌లో చేసిన ప్రసంగం ప్రజలను రెచ్చగొట్టేలా ఉందని ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. ఆయన 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఓ రౌడీ షీటర్‌లా మాట్లాడించిందని ఆరోపించారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బహిరంగ సభలో తరిమి తరిమి కొడతా, బట్టలిప్పేసి కొడతా, నేను గూండాలకు గూండాని, రౌడీలకు రౌడీని అని రెచ్చగొట్టేలా చేసిన వ్యాఖ్యలు శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్నాయన్నారు. పోలీసులు, అధికారులను బెదిరించడం రాజకీయంగా ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేసే హక్కు ప్రజలందరికీ ఉందని, 'చంద్రబాబు గో బ్యాక్' అన్నందుకే తీవ్ర పదజాలంతో అక్కడి ప్రజలపై విరుచుకుపడడం విడ్డూరంగా ఉందని చెప్పారు. తనకు 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని ప్రతిసారీ గొప్పలు చెప్పుకునే ఆయన మాటలు ఓ వీధి రౌడీని తలపిస్తున్నాయన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాన్ని చూడలేకే టీడీపీ నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వానికి ప్రజల్లో ఉన్న ఆదరణను చూసి ఓర్వలేకే రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. సీఎంతో పాటు మంత్రులను ఎలా తిట్టాలో టీడీపీ నాయకుడు పట్టాభి నుంచి పవన్‌కల్యాణ్ వరకు బాబు నేర్పిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందాలన్నది జగనన్న ఉన్నత లక్ష్యమని చెప్పారు. శ్రీభాగ్ ఒడంబడిక స్ఫూర్తితో రాయలసీమ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఆ ప్రాంత ప్రజలు సీఎంను కోరుతున్నారని తెలిపారు. అదే సమయంలో ఉత్తరాంధ్రను కూడా అభివృద్ధి చేయాల్సి ఉందని, అందుకే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మూడు రాజధానుల పాలసీని అమల్లోకి తీసుకువచ్చారని చెప్పారు. 14 ఏళ్ల పాటు సీఎంగా ఉన్న చంద్రబాబు కప్పంలోని బ్రాంచ్ కెనాల్‌నే పూర్తి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. అలాంటిది రాయలసీమను రతనాల సీమగా అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ రాష్ట్రంలోని 175 స్థానాల్లోనూ విజయం సాధిస్తుందని ఎమ్మెల్సీ ధీమా వ్యక్తం చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

హిందూ ధర్మ పరిరక్షణే మనందరి బాధ్యత

● ఆధ్యాత్మిక ప్రసంగీకులు రాధా మనోహర్‌దాస్

విజయనగరం టౌన్: హిందూ ధర్మ పరిక్షణతో పాటు సనాతన సంప్రదాయాలు, హైందవ సంస్కృతిని నేటితరం చిన్నారులకు నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసంగీకులు రాధా మనోహర్‌దాస్ అన్నారు. ఆదివారం స్థానిక అయోధ్యా మైదానంలో హిందూ ధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలో హైందవ శంఖారావం బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధర్మాన్ని నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత చింతనతో ఆలోచించాలన్నారు. మంచి ఎక్కడున్నా స్వీకరించాలని.. చెడు ఎక్కడున్నా ప్రశ్నించాలని సూచించారు. హిందూ ధర్మాన్ని పరిరక్షించాలన్నారు. హైందవ మతాన్ని, మన సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతి ఒక్కరికీ తెలిసేలా చాటి చెప్పాలన్నారు. భగవద్గీతలోని ప్రతీ అంశాన్ని పెద్దలు చదవడంతో పాటు పిల్లలకు కచ్చితంగా నేర్పించాలన్నారు. హిందువులను మతమార్పిడి పేరుతో మార్చేందుకు ప్రయత్నం చేస్తున్న వారంతా తానడిగే ప్రశ్నలకు సమాధానమిస్తే.. రూ.75 లక్షల బహుమతి ఇవ్వడంతో పాటు తానూ మతం మారుతానని బహిరంగంగా సవాల్ చేశారు. కార్యక్రమంలో మహామండలేశ్వర్ శ్రీయోగ పీఠం నుంచి సురేశ్వరానంద యోగి మహారాజ్, యోగి అతిదేశ్వరానంద పర్వత, కృష్ణ ధర్మరక్షణ వ్యవస్థాప అధ్యక్షుడు కెల్ల దుర్గారావు, హిందూ ధర్మ రక్షా సమితి రాష్ట్ర అధ్యక్షుడు చేదులూరి గవరయ్య, నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, తదితరులు హిందుత్వమంటే మతం కాదని, ధర్మమని గుర్తుచేశారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, హిందూ ధర్మ రక్షా సమితి అధ్యక్షుడు రాయపాటి రామరాజు, కార్యదర్శి శఠగోపం పార్థసారథి, కార్యక్రమ నిర్వాహకుడు ఆబోతుల శ్యామ్‌సుందర్, అధిక సంఖ్యలో హిందువులు, భవానీ, శివ, అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తున్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రాధా మనోహర్ దాస్



హాజరైన హిందువులు

అందరినీ కలవడం సంతోషంగా ఉంది..

విజయనగరం గంటస్తంభం: పంచాయతీరాజ్ ఉద్యోగులందరినీ కలవడం ఆనదంగా ఉందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. రామనారాయణ గుడి వద్ద గల మామిడితోటలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగులు ఆదివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అందరూ ఐకమ్యతంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి డాక్టర్ ఎం.అశోక్‌కుమార్, ఉప ముఖ్య కార్యనిర్వహణాధికారి కె.రాజ్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ చాంబర్ ఇంజినీరింగ్, విద్యా కో–ఆర్డినేటర్‌లు విజయకుమార్, మన్మథకుమార్, గవర కార్పొరేషన్ చైర్మన్ బొద్దేటి ప్రసాద్, జిల్లా సంఘ అధ్యక్షుడు సీహెచ్ మురళి, కార్యదర్శి శ్రీరాములు పాల్గొన్నారు.



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిర్వాహకులు

రహదారి భద్రత నియమాలు పాటించాలి..

● వన్‌టౌన్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: రహదారి భద్రతా నియమాలు పాటించడంతోనే ప్రమాదాలు నియంత్రించవచ్చని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు అన్నారు. వరల్డ్ రిమంబరెన్స్ డే సందర్భంగా ప్రమాదాల నియంత్రణకు తమవంతు సహకారాన్ని అందించే ఆటోడ్రైవర్లు, క్షతగాత్రులకు సహాయపడే ప్రజలు, వైద్యం అందించే వైద్యులు, రహదారి భద్రత పట్ల అవగాహన కల్పించేందుకు కృషిచేసిన వారిని ఆదివారం ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రమాదాల్లో గాయపడిన వారిని రక్షించేందుకు స్థానికులు ముందుకు రావాలన్నారు. అటువంటి వ్యక్తులను కోర్టులకు, పోలీసు స్టేషన్‌కు పిలిచి వేధింపులకు గురిచేస్తారన్న అపోహలు వద్దన్నారు. ప్రమాద సమయాల్లో సహాయపడిన వారిని పోలీస్ శాఖ గౌరవిస్తుందని చెప్పారు. ప్రమాదరహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ రహదారి భద్రతా నియమాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో తిరుమల మెడికవర్ వైద్యులు, వివిధ వాహనాల డ్రైవర్లు, వన్‌టౌన్ ఎస్సైలు అశోక్, విజయకుమార్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



క్షతగాత్రులకు వైద్య సేవలందించిన వైద్యులను సత్కరిస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు

దుప్పట్ల పంపిణీ

శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణానికి చెందిన 'స్నేహ' స్వచ్ఛంద సంస్థ నేతృత్వంలో పుణ్యగిరిలోని గిరిజనులకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఢిల్లీకి చెందిన జీఎస్‌టీ కార్యదర్శి సుమిదాదేవి, విన్నకోట ప్రసాద్ ఆర్థిక సహకారంతో దుప్పట్లు సమకూర్చారు. స్నేహ సంస్థ కార్యదర్శి ఎం.సుబ్బారావు, ఎం.ఎస్.ఎన్.మూర్తి, డాక్టర్ త్రినాథరావు, విన్నకోట ప్రసాద్, విన్నకోట మురళి, పి.శ్రీరాములు, జి.శంకరరావు, మళ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ పోటీలకు ఎంపికలు రేపు

కొత్తవలస: ఎస్.కోట నియోజకవర్గస్థాయి సీఎం కప్పు కబడ్డీ, వాలీబాల్ పోటీలకు మండలంలోని బలిఘట్టాం సమీపంలోని ప్రగతి కళాశాలలో మంగళవారం ఎంపికలు నిర్వహించనున్నట్లు పీడీ కె.కృష్ణంరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 17 ఏళ్లు దాటిన యువకులు, యువతులను ఈ పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. పోటీలకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, ఒక పాస్ పోర్టుసైజ్ ఫొటోతో ఉదయం 9 గంటలకు రావాలని సూచించారు.

జిల్లాస్థాయి షూటింగ్ బాల్ జట్టు ఎంపిక

విజయనగరం ఫూల్‌బాగ్: స్థానిక జమ్మునారాయణపురంలోని ఎంజేపీ ఏపీ బీసీ వెల్ఫేర్ స్కూల్‌లో ఆదివారం అండర్–19 బాలురు, బాలికల విభాగంలో జట్ల ఎంపిక జరిగింది. షూటింగ్ బాల్ జట్టు బాలుర విభాగంలో ఎంజేపీ స్కూల్ పదోతరగతి విద్యార్థులు ఎ. నరసింహ, మణికంఠ ఎంపికపై స్కూల్ ప్రిన్సిపాల్ రమణమ్మ, పీఈటీ శ్రీధర్, తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఆ విద్యార్థులు మంగళవారం అనకాపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరఫున ఆడనున్నారు.

కొండచిలువ హతం

వేపాడ: మండలంలోని జాకేరు గ్రామ సమీపంలో ఆదివారం 12 అడుగుల కొండ చిలువను స్థానికులు హతమార్చారు. గ్రామానికి చెందిన కోలా శ్రీను ఉదయం తన పొలంలో పెసర విత్తనాలు చల్లుతుండగా కొండచిలువ కనిపించింది. వెంటనే రైతులతో కలిసి దాన్ని హతమార్చారు.



హతమైన కొండచిలువను చూపిస్తున్న రైతు

అవగాహనతోనే వ్యాధులకు దూరం



ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న నగర మేయర్, డిప్యూటీ మేయర్, తదితరులు

● మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం: అవగాహనతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని కంటోన్మెంట్ థెరిసా క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్స్, విజయనగరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును జ్యోతి ప్రజ్వలన చేసి ఆదివారం ప్రారంభించారు. ముందుగా మదర్ థెరీసా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, థెరిసా క్లబ్ చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. ముఖ్యంగా మహిళలు స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని క్యాన్సర్ బారిన పడే ప్రమాదం నుంచి బయటపడవచ్చన్నారు. ముఖ్యంగా ఉద్యోగం చేసే మహిళలు అటు ఇంటి పనులు, ఇటు ఆఫీసు పనుల్లో పడి తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసుకోవద్దని సూచించారు. అనంతరం 200 మందికి ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ ప్రసాద్, ఐఎంఏ రాష్ట్ర ఎలెక్టెడ్ అధ్యక్షుడు డాక్టర్ జేసీ నాయుడు, 39వ డివిజన్ కార్పొరేటర్ వింత ప్రభాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతీదేవి, క్యాంపు కోఆర్డినేటర్ డాక్టర్ జె. శ్రీకాంత్, క్లబ్ అధ్యక్షుడు పి. శంకరనారాయణ, డాక్టర్ ఎం. మృత్యుంజయరావు, మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక డ్రైవ్



జామిలో ర్యాలీ నిర్వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, తహసీల్దార్ హేమంత్‌కుమార్, తదితరులు

గజపతినగరం: ఓటు హక్కు నమోదుకు సంబంధించి మండలంలో బీఎల్‌ఓలు ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎం.వెంకటాపురంలో కార్యక్రమాన్ని తహసీల్దార్ ఎం.అరుణకుమారి, గజపతినగరం బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఎలక్షన్ డీటీ సతీష్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ 2023 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాలను పరిశీలించి, తొలగింపులు, మార్పులు, చేర్పులపై బీఎల్‌ఓలను ఆరా తీశారు.ఆర్‌ఐ నరేష్ పాల్గొన్నారు.

విశేష స్పందన

బొండపల్లి: మండలంలో ఆదివారం నిర్వహించిన ఓటరు నమోదు ప్రత్యేక డ్రైవ్‌కు విశేషస్పందన లభించిందని తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా తెలిపారు. బొండప ల్లి, గొట్లాం, అంబటివలస, కనిమెరక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో కార్యక్రమాన్ని పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన వారికి ఫారం–6లు అందజేశారు.

అవగాహన ర్యాలీ


జామి: ఓటు హక్కు ఆవశ్యకతపై తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాలో మార్పులు, సవరణలు, ,తొలగింపులకు సంబంధించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పద్దెనిమిదేళ్లు నిండిన వారంతా గ్రామాల్లో బీఎల్‌ఓలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డీటీ సునీత, ఆర్‌ఐ ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

ఏసీ.. మేడిన్ ఆంధ్రా

దేశవ్యాప్తంగా తయారయ్యే ఏసీల్లో నగం మన రాష్ట్రంలోనే

- దేశంలో ఏటా 75 లక్షల ఏసీల అమ్మకాలు
- రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేస్తున్న ప్రముఖ కంపెనీలు
- శ్రీసిటీలో 6 కంపెనీల యూనిట్లు
- ఏసీల తయారీలోనే రూ.3,755 కోట్ల పెట్టుబడులను ఆకర్షించిన రాష్ట్రం
- త్వరలో ఉత్పత్తికి సిద్ధమవుతున్న కంపెనీలు
- ఏసీల తయారీకోసం పూర్తిస్థాయి ఎకో సిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం
- అవసరమైన మానవవనరుల కోసం పాలిటెక్నిక్‌లో ప్రత్యేక కోర్సులు

శ్రీసిటీలో యూనిట్లు ఏర్పాటు చేస్తున్న ఏసీ తయారీ కంపెనీలు, వాటి పెట్టుబడులు (రూ.కోట్లలో)





సాక్షి, అమరావతి: వచ్చే ఏడాది మార్చి నుంచి దేశవ్యాప్తంగా మేడిన్ ఆంధ్రా ఏసీలు అందుబాటులోకి రానున్నాయి. దేశంలో అమ్ముడయ్యే ప్రతి రెండు ఎయిర్ కండిషనర్లలో ఒకటి మన రాష్ట్రంలో తయారైందే ఉండనుంది. దక్షిణాది రాష్ట్రాల్లో జరిగే ఏసీ అమ్మకాల్లో 80 శాతం ఆంధ్రప్రదేశ్‌లో తయారైనవే ఉండనున్నాయి. దేశంలోని దిగ్గజ ఏసీ తయారీ సంస్థలు మన రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ స్కీం) కింద మార్చినాటికి ఉత్పత్తి ప్రారంభించే విధంగా పనులను వేగంగా చేస్తున్నాయి. నెల్లూరు జిల్లా శ్రీసిటీలో డైకిన్, బ్లూస్టార్, హావెల్స్, పానాసోనిక్, యాంబర్, ఈపాక్ వంటి సంస్థలు భారీ తయారీ యూనిట్లను ఏర్పాటు చేశాయి. ఇందులో ఒక్క డైకిన్ తొలిదశలో ఏటా 10 లక్షల ఏసీలు తయారు చేసే విధంగా యూనిట్ ఏర్పాటు చేయడమే కాకుండా రెండోదశలో మరో 15 లక్షల ఏసీలు తయారు చేసే విధంగా విస్తరించనుంది. ఇందుకోసం రూ.వెయ్యి కోట్లను పెట్టుబడి పెట్టనుంది. బ్లూస్టార్ ఏటా 12 లక్షల ఏసీలను తయారు చేసే విధంగా యూనిట్ ఏర్పాటు చేస్తోంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఏటా 75 లక్షల గృహవినియోగ ఏసీలు అమ్ముడవుతున్నాయి. ఇప్పుడు రాష్ట్రంలో ఈ యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం 50 లక్షల ఏసీలకు పైనే ఉంటుందని అంచనా. ఈ విధంగా చూస్తే వచ్చే మార్చి నుంచి దేశవ్యాప్తంగా అమ్ముడయ్యే ప్రతి ఏసీలో ఒకటి మన రాష్ట్రంలో తయారైందే ఉంటుందని అంచనా. మొత్తం ఈ ఆరు యూనిట్లు, వీటికి సరఫరా చేసే ఉపకరణాల యూనిట్లను చూసుకుంటే ఒక్క ఏసీ తయారీ రంగంలోనే రాష్ట్రం రూ.3,755 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది. అలాగే 10 వేల మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.

ఎంఎస్ఎంఈ యూనిట్లకు ప్రోత్సాహం

రాష్ట్రాన్ని ఏసీ తయారీ హబ్‌గా తీర్చిదిద్దడం ద్వారా మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఏసీ తయారీలో వినియోగించే ఉపకరణాలను తయారు చేసే ఎంఎస్ఎంఈ యూనిట్లను ప్రోత్సహిస్తోంది. శ్రీసిటీలో ఏర్పాటవుతున్న ఆరు ఏసీ తయారీ యూనిట్లకు ఉపకరణాలను సరఫరా చేసే ఐదు కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయి. అంతేగాకుండా ఇక్కడ ఏర్పాటవుతున్న యూనిట్లకు అవసరమైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ యూనిట్లు నిర్మాణ పనులు పూర్తిచేసుకునే సరికి నైపుణ్యం కలిగిన మానవ వనరులను అందించే విధంగా పాలిటెక్నిక్‌లో ప్రత్యేక కోర్సులను ప్రవేశపెట్టారు.

వేగంగా అనుమతులు



శ్రీసిటీలో ఏర్పాటవుతున్న ఏసీ తయారీ యూనిట్లకు అవసరమైన అన్ని అనుమతులను ప్రభుత్వం శరవేగంగా మంజూరు చేస్తోంది. ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే విధంగా పూర్తిస్థాయి ఏసీ తయారీ ఎకో సిస్టమ్‌ను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. బ్లూస్టార్, డైకిన్ సంస్థల నిర్మాణపనులు ఇప్పటికే పూర్తికాగా, మిగిలిన యూనిట్లు కూడా మార్చి నాటికి ఉత్పత్తి ప్రారంభించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాయి. ఈ యూనిట్ల ద్వారా 10 వేలమందికి ఉపాధి లభించనుంది. వీరిలో 75 శాతం మంది స్థానికులకే ఉద్యోగాలు కల్పించే విధంగా విద్యార్థులకు ప్రత్యేకంగా నైపుణ్య శిక్షణను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది.

– రవి సన్నారెడ్డి, వ్యవస్థాపక ఎండీ, శ్రీ సిటీ

● తెలంగాణ

23న 'చలో రామోజీ ఫిలిం సిటీ': సీపీఎం

పట్టాలు ఇచ్చిన పేదలకు ఇళ్లస్థలాలు అప్పగించాలని డిమాండ్



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

ఇబ్రహీంపట్నం: రామోజీ ఫిలింసిటీ సమీపంలోని నాగన్‌పల్లిలో 670 మంది పేదలకు మంజూరైన ఇళ్లస్థలాలను వారికి అప్పగించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామం నుంచి రామోజీ ఫిలిం సిటీ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ తెలిపారు. రాయపోల్‌లో ఆదివారం జరిగిన లబ్ధిదారులు, ఇంటి స్థలాల్లేని పేదల సమావేశంలో ఆయన మాట్లాడారు. 670 మంది పేదలకు 60 గజాల చొప్పున ఇంటి స్థలాలకు సంబంధించిన పట్టాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకునేందుకు అప్పట్లో ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని తెలిపారు. అయితే ఈ స్థలాల్లోకి లబ్ధిదారులు వెళ్లకుండా రామోజీ ఫిలిం సిటీ యాజమాన్యం అడ్డుకుంటోందని ఆరోపించారు. ఆ స్థలాల్లో సినిమా షూటింగ్ సెట్టింగ్‌లను ఏర్పాటు చేసి ఆక్రమణకు పాల్పడుతోందని మండిపడ్డారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిలింసిటీ అధినేత రామోజీరావుకు రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం బాసటగా నిలుస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే పేదలందరికీ స్థలాలు చూపించి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థికసాయం అందించాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, నాయకులు సామేల్, సీహెచ్ జంగయ్య, పి.జగన్, బుగ్గరాములు, లింగస్వామి, వెంకటేశ్, సీహెచ్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మావోయిస్టులతో మంత్రి అల్పాహారం



మాజీ మావోయిస్టు ఒగ్గు సట్వాజి దంపతులతో కలిసి అల్పాహారం చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్ టౌన్: మూడేళ్ల క్రితం లొంగిపోయిన మాజీ మావోయిస్టు ఒగ్గు సట్వాజి దంపతుల ఆహ్వానం మేరకు దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి వారి ఇంట్లో అల్పాహారం చేశారు. నిర్మల్ నూతన కలెక్టరేట్ పనులను ఆదివారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ మావోయిస్టు సట్వాజి అక్కడికి రావడంతో మంత్రి ఆయనను పలకరించారు. అనంతరం సట్వాజి ఆహ్వానం మేరకు ఆయన ఇంటికి వెళ్లి అల్పాహారం చేశారు. హింసామార్గం వీడి జనజీవన స్రవంతిలో కలిసిన సట్వాజి దంపతులను ఈ సందర్భంగా ఇంద్రకరణ్ రెడ్డి అభినందించారు.

మెయిన్స్ షెడ్యూల్‌పై మళ్లీ సందిగ్ధం

- ఇప్పటివరకు నిర్ణయం చెప్పని ఎన్టీఏ
- గతంలో ఏటా జనవరి, మార్చి ఆఖరు లేదా ఏప్రిల్‌లో రెండుసార్లు నిర్వహణ
- జనవరి మెయిన్స్‌కు వీలుగా నవంబర్‌లోనే నిర్ణయం వెలువరించాలి
- ఏప్రిల్‌లో నిర్వహిస్తే మళ్లీ బోర్డు పరీక్షలకు ఆటంకం
- 2022లో జేఈఈ షెడ్యూల్‌లో గందరగోళం.. ఫలితంగా ఇంటర్ పరీక్ష షెడ్యూళ్లు పలుమార్లు మార్పు

సాక్షి, అమరావతి : ఐఐటీ, ఎన్ఐటీ తదితర జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశానికి సంబంధించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్–2023 నిర్వహణపై నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఇంకా నిర్ణయం తీసుకోకపోవడంతో విద్యార్థుల్లో ఉత్కంఠ నెలకొంది. జేఈఈ–2023కి సంబంధించి షెడ్యూల్ అంటూ సామాజిక మాధ్యమాల్లో పలు తేదీలు ప్రచారం అవుతుండడంతో వారు గందరగోళానికి గురవుతున్నారు. వాస్తవానికి జేఈఈ మెయిన్స్‌ను గతంలో ఒక్కసారే నిర్వహించేవారు. ఒకపక్క బోర్డు పరీక్షలకు తయారవ్వడం, మరో పక్క మెయిన్స్ పరీక్షలు రాయాల్సిన పరిస్థితుల్లో పలువురు విద్యార్థులు తొట్రుపాటుతో తక్కువ మార్కులతో అవకాశాలు కోల్పోతున్నారు. దీనివల్ల ఐఐటీ వంటి జాతీయ విద్యాసంస్థల్లో చదవాలనుకునే విద్యార్థులు మరో ఏడాదిపాటు ఆగాల్సి వచ్చేది. ఈ కారణాలతో ఏడాదికి రెండుసార్లు నిర్వహించేలా మార్పు చేశారు. జనవరి, మార్చి ఆఖరు లేదా ఏప్రిల్‌లో నిర్వహించేవారు. జనవరి సెషన్‌కు సంబంధించి నవంబర్‌కు ముందే ఎన్టీఏ షెడ్యూల్ విడుదల చేసేది. కానీ, ఈసారి నవంబర్ మూడో వారంలోకి ప్రవేశిస్తున్నా ఇప్పటివరకు ఎన్టీఏ నుంచి ఎలాంటి ప్రకటనా రాలేదు. మరోవైపు.. జేఈఈ పరీక్షలు ఏప్రిల్ నుంచి ప్రారంభమవుతాయని ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ బోర్డు సహా పలు రాష్ట్రాల బోర్డులు, సీబీఎస్ఈ పరీక్షలు కూడా ఇంచుమించు అదే సమయంలో జరుగుతుంటాయని, దీనివల్ల తాము ఇబ్బందికి గురవుతామని విద్యార్థులు విన్నవిస్తున్నారు. జేఈఈ పరీక్షలకు సంబంధించి ఎన్టీఏ ఒక స్పష్టతనిస్తే ప్రణాళిక ప్రకారం సిద్ధంకావడానికి వీలుంటుందంటున్నారు.

గత ఏడాది తీవ్ర గందరగోళం..

కరోనాతో రెండేళ్ల పాటు జేఈఈ పరీక్షల్లో అనిశ్చిత పరిస్థితి ఏర్పడినా 2022లో కోవిడ్ తగ్గుముఖం పట్టినందున అన్నీ సకాలంలో జరుగుతాయని విద్యార్థులు భావించారు. కానీ, జేఈఈ నిర్వహణ సంస్థ అయిన ఎన్టీఏ పలుమార్లు షెడ్యూళ్లు మార్పుచేసి విద్యార్థులను, బోర్డులను తీవ్ర గందరగోళానికి గురిచేసింది. జేఈఈ మెయిన్స్–2022 షెడ్యూల్‌ను 2021 నవంబర్, డిసెంబర్ నాటికే విడుదల చేయాలి. జనవరిలో నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలను చేపట్టాలి. కానీ, ఎన్టీఏ ఐదు రాష్ట్రాల ఎన్నికల సాకుతో 2022 మార్చి వరకు షెడ్యూల్, నోటిఫికేషన్‌పై ఎలాంటి ప్రకటనా చేయలేదు. చివరకు మార్చి 1న నోటిఫికేషన్ ప్రకటించి అదే రోజు నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది. అలాగే, తొలి సెషన్ పరీక్షల తేదీల విషయంలో ఆయా రాష్ట్రాల బోర్డు పబ్లిక్ పరీక్షలను పరిగణనలోకి తీసుకోకుండా ఏప్రిల్ 16–21 వరకు, మే 24–29 వరకు రెండో సెషన్ పరీక్షలు జరుగుతాయని తేదీలను ప్రకటించింది. ఏపీతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు సహా అనేక రాష్ట్రాల ఇంటర్మీడియెట్, ప్లస్ 2 తరగతుల పరీక్షలు అవే తేదీల్లో నిర్వహించేలా అంతకుముందే ప్రకటించినా వాటిని పట్టించుకోలేదు. జేఈఈ పరీక్షలను అవే తేదీల్లో ఎన్టీఏ షెడ్యూల్ ఇవ్వడంతో ఆయా రాష్ట్రాలు తమ బోర్డుల పరీక్షా తేదీలను ఆ ఏడాది ఏప్రిల్ 22 తరువాత ఉండేలా మార్పులుచేసుకున్నాయి. కానీ, ఎన్టీఏ మళ్లీ జేఈఈ షెడ్యూల్‌ను మార్పుచేసింది. దీంతో ఆయా ఇంటర్ బోర్డులు మళ్లీ మార్పు చేసుకున్నాయి. ఆ తర్వాత ఎన్టీఏ మూడోసారి మళ్లీ షెడ్యూల్‌ను మార్పుచేసింది. 2022 జూన్, జులైలో పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రకటించి ఆయా రాష్ట్రాల బోర్డులను సమస్యల్లోకి నెట్టింది. ఇలా జేఈఈ మెయిన్–2022 పరీక్షల నిర్వహణలో తీవ్ర జాప్యం చేయడంతో ఫలితాల విడుదలపైనా దాని ప్రభావం పడింది. మెయిన్స్ తుది ఫలితాలను ఆగస్టు 5 లేదా 6కల్లా ఎన్టీఏ విడుదల చేయాల్సి ఉంది. వీటిలో ఉత్తీర్ణులైన టాప్ 2.5 లక్షల మందిని అడ్వాన్స్‌కు అనుమతిస్తారు. కానీ, చివరి నిమిషం వరకు మెయిన్స్ ఫలితాలపై గందరగోళానికి గురిచేసింది. ఈసారి అలాంటి గందరగోళానికి లేకుండా పరీక్షలపై స్పష్టతనివ్వాలని విద్యార్థులు కోరుతున్నారు.

అమ్మకు గుడి

ఇంట్లో విగ్రహాన్ని ప్రతిష్టించిన కొడుకులు.



సూర్యకుమారి విగ్రహా విష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: అమ్మంటే ప్రత్యక్ష దైవంగా భావించారు. కన్నతల్లి కన్నుమూసి ఏడేళ్లయిపోయింది. ఇన్నాళ్లు గుండెల్లో కొలువైన అమ్మకు ఇంట్లోనే గుడి కట్టారు. అమ్మ జ్ఞాపకాలు పదిలంగా ఉండాలని.. కళ్లముందు విగ్రహ రూపంలో కనిపిస్తుండాలని.. ఏకంగా ఇంట్లోనే గుడి కట్టారు ముషీరాబాద్ గంగపుత్ర కాలనీకి చెందిన బాదం గణేష్, శ్రీనివాస్, వేణు, శివప్రసాద్‌లు. అమ్మ విగ్రహ ఆవిష్కరణోత్సవానికి బంధుమిత్రులను ఆహ్వానించారు. పండుగలా కార్యక్రమం నిర్వహించి ఆతిథ్యం ఇచ్చి తల్లిపై ప్రేమను చాటుకున్నారు. గణేష్, శ్రీనివాస్, వేణు, శివప్రసాద్‌ల తల్లి బాదం వెంకటసూర్యకుమారి ఏడేళ్ల క్రితం మరణించారు. కొంతకాలంగా తల్లి విగ్రహాన్ని ఇంట్లో ఏర్పాటు చేయాలని నలుగురు కొడుకులు ప్రయత్నిస్తున్నారు. ఇటీవల విగ్రహ ఏర్పాటు కోసం ఇంట్లో ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు. అందులో తల్లి సూర్యకుమారి విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు.


వైభవంగా మహారుద్రాభిషేకం



శివలింగానికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పురుషులు) మైదానంలో మిత్రా ఫౌండేషన్, గుంటూరుకు చెందిన అమ్మ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మహాశివునికి మహారుద్రాభిషేకం వైభవంగా జరిగింది. గుంటూరుకు చెందిన స్వామీజీలు రూపొందించిన ఏడు అడుగుల మట్టి శివలింగానికి 1100 బిందెల నీరు, 250 రకాల సుగంధ ద్రవ్యాలు, 108 రకాల పూలు, పండ్ల రసాలు, భస్మం, అన్నం, తేనె, రుద్రాక్షలతో అభిషేకం చేశారు. ఈ సమయంలో శివనామంతో మైదానం హోరెత్తింది. 30ఏళ్ల అఘోరాగా ఉన్న రాజేష్ నాథ్ మహారాజ్ సమక్షంలో భస్మాభిషేకం నిర్వహించారు. మంత్రి ధర్మన ప్రసాదరావు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, తదితరులు శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ నగర పాలక కార్పొరేషన్ కమిషనర్ ఓబులేసు, మిత్రా ఫౌండేషన్ సభ్యులు దుప్పల వెంకటరావు, పాగిరి సుగుణాకరరావు, జి.తులసీరావు, డాక్టర్ దానేటి శ్రీధర్, కుంచాలకుర్మయ్యపేట రాజరాజేశ్వరీ ఆలయ పీఠాధిపతి టి.బాలభాస్కరశర్మ తదితరులు పాల్గొన్నారు.

మన్యంలో పర్యాటకుల సందడి



మెట్టుగూడ జలపాతం వద్ద పర్యాటకులు

సీతంపేట: మన్యంలో ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన టూరిస్టులతో స్థానికంగా ఉన్న అడ్వంచర్ పార్కు కళకళలాడింది. మెట్టుగూడ జలపాతం వద్ద స్నానాలు చేస్తూ పర్యాటకులు ఆనందించారు. జలవిహార్‌లో బోటుషికారు, తూగే వంతెనపై వాకింగ్ చేశారు. ఆల్‌టర్న్ వెహికల్‌పై రయ్‌రయ్‌మని తిరుగుతూ, షూటింగ్ చేస్తూ సందడి చేశారు.

అపరాలతో ఆశించిన ఆదాయం

- రబీలో అపరాల సాగుకు మొగ్గు
- రాయితీపై విత్తనాలు అందిస్తున్న వ్యవసాయ శాఖ
- 64,504 హెక్టార్లలో సాగుకు సన్నద్ధం
- గతేడాది కంటే పెరిగిన సాగు లక్ష్యం

రాయితీ విత్తనాలు ఇలా..

విత్తన రకం	కిలో ధర	రాయితీ	రైతు ధర
పెసర	రూ.115.40	రూ.34.62	రూ.80.78
మినప	రూ.113.50	రూ.34.05	రూ.79.48
రాగి	రూ. 66.06	రూ. 33.03	రూ.33.03
నువ్వులు	రూ.140లు	రూ. 56లు	రూ. 84



కంచరాం సమీపంలో అపరాల సాగు

రాజాం: ఖరీఫ్ పనులు పూర్తవుతున్నాయి. ఇంతలోనే రబీ పనులు కూడా రైతులు ప్రారంభించేశారు. ప్రధానంగా వరి పంట తరువాత చాలా మంది రైతులు రబీలో లాభాలు వచ్చే పంటల వైపు దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగా ఎటువంటి మదుపులు లేని పంటలకే ప్రాధాన్యత ఇస్తారు. ఈ కోవలోకే అపరాల పంటలు వస్తున్నాయి. వీటికి ఎటువంటి పెట్టుబడులు పెట్టకుండా రైతులు లబ్ది పొందే అవకాశం ఉంది. మొక్కజొన్న, వరి పంటలు కంటే అపరాలే అధికంగా వేసవిలో సాగు చేస్తున్నారు.

ఏఏ పంటలు వేస్తున్నారంటే..

రబీలో అపరాలు సాగులో మినప, పెసర, రాగి, ఉలవ, జొన్న, మొక్కజొన్న, బంగాళదుంప, కంది, నువ్వు వంటి పంటలు సాగు చేస్తున్నారు. ఈ విత్తనాలను ప్రస్తుతం వరి పంట కోత దశలో ఉన్నప్పుడే పొలాల్లో జల్లుతున్నారు. పెసర, మినప, ఉలవ పంటలకు సంబంధించిన విత్తనాలకు 30 శాతం రాయితీ ఇస్తుండగా, చిరుధాన్యాల విత్తనాలకు 40 నుంచి 50 శాతం రాయితీపై విత్తనాలు అందిస్తున్నారు. వరి పంటలో కాలిమార్గాలు ఏర్పాటు చేసి విత్తనాలు వేస్తున్నారు. చివరి దశకు నీటిని విడిచిపెట్టడం ద్వారా పొలాల్లో విత్తనాలు మొక్కలుగా మారుతాయి. వరి పంట ఉన్నప్పుడే ఇవి వేయడం వలన విత్తనాలు పక్షులు వంటివి తినకుండా ఉంటాయి. వరి కోతలు అనంతరం మొక్కలు పెరిగి రెండు నెలలు వ్యవధిలో పంట చేతికంది వస్తుంది. ఎటువంటి పెట్టుబడులు పెట్టకుండా ఎకరా సాగులో రూ.15వేలు నుంచి రూ. 20 వేలు ఆదాయం పొందే అవకాశం ఉంది. ఎకరా సాగులో పెసర విత్తనాలు 12 కిలోలు వేయాల్సి ఉండగా, మినపల 16 కిలోలు విత్తనాలు పొలాల్లో వేయాల్సి ఉంది.

పంట మార్పిడి విధానం

రబీలో వరి పంట వేయకుండా అపరాలు సాగుచేయడం వలన పంట మార్పిడి విధానం అమలవుతుంది. ఈ విధానం ద్వారా ఓ వైపు రైతుకు ఆదాయం రావడంతో పాటు పంట పొలాలు సారవంతంగా మారుతుంటాయి. రైతులు ఆరోగ్యకరమైన పంటలు సాగు చేసే వీలుంది. ఈ పంటల ద్వారా రైతు చిరుధాన్యాలు సాగు చేసి, మార్కెట్‌కు తరలిస్తే మంచి ఫలితాలు వస్తుంటాయి. వీటితో పాటు పలువురు రైతులు కూరగాయలు సాగు కూడా ఈ పొలాల్లో చేస్తున్నారు. అనంతరం వేసవిలో పొలాలను ఖాళీగా విడిచిపెట్టడం ద్వారా పొలాల్లో ఉన్న పంట నాశక కీటకాలు కనుమరుగు కావడంతో పాటు పొలానికి ఆరోగ్యకరమైన వానపాములు వంటివి వృద్ధి చెందే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

మొక్కజొన్న

వాణిజ్య పంటగా ఖ్యాతి గడిస్తున్న మొక్కజొన్న రబీలో అధికంగా రైతులు సాగు చేసేందుకు అనుకూలంగా మారుతుంది. ప్రతీ ఏడాది రబీలో వరి పంట తరువాత మొక్కజొన్న పంటను రైతులు సాగు చేస్తున్నారు. గతేడాది జిల్లాలో 60 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగులో ఉండగా, ఈ ఏడాది రబీలో ఈ సాగు పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ ధ్రువీకరించింది.

రైతులు దృష్టి సారించాలి



పంట మార్పిడి జరిగితే ప్రతీ పంట ఫలసాయం ఎక్కువగా ఉంటుంది. ఇలా ఉండాలంటే ఖరీఫ్‌లో వరి వేసిన అనంతరం పంట మార్పిడి చేయాలి. అపరాల పంటలు సాగు చేస్తే మేలు. అలా కాకుండా వాణిజ్య పంటలుగా ఖ్యాతి గడించిన మొక్కజొన్న, మిరప, టమాట వంటి పంటలు కూడా సాగు చేసుకోవచ్చు. మంచి ఆదాయం వస్తుంది. మేం మా పంట పొలాల్లో ఈ వినూత్న ప్రయోగం ద్వారా ఫలితాలు సాధిస్తున్నాం. – గేదెల వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు, ఉనుకూరు


అపరాల సాగుతోనే లాభాలు



ఖరీఫ్‌లో వరి పంటలు సాగు చేస్తాం. అనంతరం వెంటనే పెసర, మినప వంటి పంటలు వేస్తాం. ఖరీఫ్‌లో వేసే వరి పంటలు నామమాత్రంగానే ఆదాయం వస్తుంది. రబీలో వేసే అపరాలు పంటలకు ఎటువంటి పెట్టుబడులు లేకపోవడంతో మంచి దిగుబడి కూడా వచ్చి ఆదాయం వస్తుంది.

– పప్పల ఈశ్వరరావు, జీఎన్‌పురం

రాయితీపై విత్తనాలు



అన్ని ఆర్‌బీకేలు వద్ద రాయితీపై అపరాల విత్తనాలు అందిస్తున్నాం. అపరాల సాగు ద్వారా ఆర్థిక చేయూత ఉంటుంది. రైతు పొలంలో కూడా పంట మార్పిడి ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో అపరాల పంటలపైనే రైతులు దృష్టి సారిస్తారు.

– కె.చంద్రరావు, వ్యవసాయ శాఖ ఏడీ, రాజాం

పంచారామాలకు ఆర్టీసీ బస్సులు



పంచారామాలకు బయల్దేరిన ఆర్టీసీ బస్సులు

శ్రీకాకుళం అర్బన్: కార్తీక మాసం సందర్భంగా పంచారామాలైన అమరావతి, పాలకొల్లు, భీమవరం, సామర్లకోట, ద్రాక్షారామం తదితర పుణ్యక్షేత్రాలను ఒకేరోజు దర్శించుకునేందుకు శ్రీకాకుళం ఆర్టీసీ బస్‌స్టేషన్ నుంచి ఆదివారం బస్సులు బయలుదేరాయి. ఈ సందర్భంగా శ్రీకాకుళం ఆర్టీసీ ఒకటి, రెండు డిపోల డీఎంలు కె.మాధవ్, కెఆర్ఎస్ శర్మలు మాట్లాడుతూ పంచారామాల క్షేత్ర దర్శని ప్రత్యేక బస్సులకు శ్రీకాకుళం జిల్లాలో గల ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. గతవారం కంటే మరో ఐదుబస్సులు అదనంగా మొత్తం 9 బస్సులను పంపినట్లు తెలిపారు. ఈ ఆదివారం నాడు ప్రయాణికుల స్పందన అధికంగా ఉంటుందని అంచనా వేస్తూ ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేసినట్లు వారు తెలియజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల అసిస్టెంట్ మేనేజర్లు రమేష్, గంగరాజు. సూపరింటెండెంట్ ఎ.శంకర్, ఏడీసీలు పలిశెట్టి దామోదర్, ఎంపీ రావు, యల్.యస్.నాయుడు, స్టేషన్ మేనేజర్ వి.శామ్యూల్, కె.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వాయులీన కచేరీ

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కత్తెరవీధి రాజరాజేశ్వరీ పీఠం పక్కన ఉన్న కమ్యూనిటీ హాలులో జరిగిన వాయులీన కచేరీ ఆకట్టుకుంది. వాడాడకు చెందిన తరుణి కృష్ణస్మారక ధార్మిక ట్రస్టు ఆధ్వర్యంలో మండ వెంకటసత్యనారాయణమూర్తి వర్ధంతి సందర్భంగా ఆదివారం ఈ నాద సుధార్ణవ సంగీత ఝరి జరిగింది. ఆమదాలవలసకు చెందిన డాక్టర్ మావుడూరు సత్యనారాయణశర్మ వాయులీనంపై కీర్తనలు వినిపించగా, వయొలిన్‌పై మావుడూరు వాయునందనశర్మ, మృదంగంపై మావుడూరు సూర్యప్రసాదరావు వాయిద్య సహకారం అందించారు.

నెరవేరిన కర్లాం కల

- పోలినాటి వెలమకు ఓబీసీ ధ్రువీకరణ మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్

చీపురుపల్లి: ఓబీసీ రిజర్వేషన్ కోసం దశాబ్దాలుగా వేచి చూస్తున్న చీపురుపల్లి మండలం కర్లాం గ్రామంలోని పోలినాటి సామాజిక వర్గం కల ఎట్టకేలకు నెరవేరింది. గ్రామసర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీ, జెడ్పీ చైర్మన్, రాష్ట్ర మంత్రి వరకు ప్రజాప్రతినిధులు చేసిన కృషి ఫలించింది. కర్లాంలో పోలినాటి సామాజిక వర్గానికి ఓబీసీ రిజర్వేషన్ ధ్రువీకరణ మంజూరు చేయాలంటూ కలెక్టర్ సూర్యకుమారి నుంచి తహసీల్దార్‌కు ఉత్తర్వులు అందాయి. దీంతో గ్రామంలోని యువత, విద్యార్థులు, ప్రజల ఆనందాలకు హద్దులు లేకుండా పోయాయి. జిల్లాలోని చీపురుపల్లి మండలం కర్లాం గ్రామానికి వింత సమస్య ఉండేది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 34 మండలాల్లో ఒక్క కర్లాం గ్రామంలోనే పోలినాటి వెలమ సామాజిక వర్గం వారు ఉన్నారు. పక్కనే ఉన్న శ్రీకాకుళం జిల్లాలో పోలినాటి వెలమ కులానికి చెందిన సామాజిక వర్గం అత్యధికంగా ఉన్న సంగతి తెలిసిందే. శ్రీకాకుళం జిల్లాలో మాత్రమే కాదు పోలినాటి వెలమ సామాజిక వర్గం రాష్ట్రంలో ఎక్కడున్నా వారికి బిసి'డి', ఓబీసీ కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరవుతున్నాయి. కానీ కర్లాం గ్రామంలో నివసిస్తున్న పోలినాటి వెలమ సామాజిక వర్గానికి మాత్రం బిసి'డి' కుల ధ్రువీకరణ ఇస్తున్నప్పటికీ ఓబీసీ మాత్రం మంజూరు చేయడం లేదు. దీంతో అక్కడి యువత, విద్యార్థులు చదువుల్లో, ఉద్యోగ అవకాశాలు పొందడంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఓబీసీ రిజర్వేషన్ లేక ఎంతో మంది ఉద్యోగావకాశాలకు దూరమయ్యారు. దశాబ్దాల కాలం నుంచి ఉన్న సమస్య పరిష్కారానికి వైఎస్సార్‌సీపీ స్థానిక, జిల్లా ప్రజాప్రతినిధుల కృషితో కర్లాం పోలినాటి వెలమ సామాజిక వర్గానికి ఓబీసీ ధ్రువీకరణ ఇవ్వాలని కలెక్టర్ ఉత్తర్వులు ఇవ్వడంతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు మార్గం సుగమమైంది.

గ్రామస్తులకు పెద్ద బహుమతి



కర్లాం గ్రామంలో పోలినాటి వెలమ సామాజిక వర్గం దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఓబీసీ ధ్రువీకరణ మంజూరైంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌లకు గ్రామం రుణపడి ఉంటుంది. వారందరి కృషితో ఓబీసీ ధ్రువీకరణ మంజూరు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామంలోని యువత, విద్యార్థులకు ఓబీసీ ఎంతో ఉపయోగపడుతుంది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కర్లాం గ్రామానికి ఓబీసీ మంజూరు చేసి గొప్ప బహుమతి అందజేసింది.

– బాణాన భాగ్యలక్ష్మి, సర్పంచ్, కర్లాం



కర్లాం గ్రామం వ్యూ

సాక్షి ఫ్యామిలీ
శ్రీకాకుళం
సోమవారం ॥ 21-11-2022

మంచి మాట

ప్రవర్తన... పర్యవసానం



ప్రవర్తన, దాని పర్యవసానం మనిషి ప్రగతి, పతనాలకు కారణాలవుతాయి. మనిషి ప్రవర్తన తనకో, తన పక్కనున్న వ్యక్తికో, సమాజానికో పతనకారణం కాకూడదు. ప్రవర్తన కారణంగా మనిషంటే మనిషికి భయంగా ఉంటోంది, మనిషి వల్ల మనిషికి హాని జరుగుతోంది. ఇంతకీ ప్రవర్తన పర్యవసానాలేమిటి?

'నేను సరిగానే ప్రవర్తిస్తున్నానా?' అని ప్రతి మనిషీ తన ప్రవర్తనను తాను పరిశీలించుకుంటూ ఉండాలి. ఈ అర్థాన్నిస్తూ 'ప్రత్యహం ప్రత్యవేక్షేత నర శ్చరిత మాత్మనః / కింను మే పశుభిస్తుల్యం కింను సత్పురుషై రివ' అని కొన్ని శతాబ్దుల క్రితం కాళిదాసు (తన కావ్యం రఘువంశంలో) చెప్పాడు. కాళిదాసు చెప్పినట్టు ప్రతి మనిషికీ తన ప్రవర్తనను తాను పరిశీలించుకుంటూండే అభ్యాసమో, అలవాటో ఆ కాలం నుంచే ఉండుంటే బావుండేది. మన సమాజంలో నేరాలు, ఘోరాలూ, శత్రుత్వం వంటివి లేకుండా పోయేవి. లోకంలో అమానుషత్వం ఇంతలా వ్యాపించి ఉండేది కాదు. మనిషికి మనిషి వల్ల కష్టాలు, నష్టాలు కలుగుతూండకపోయేవి. మన జీవనాలు ప్రశాంతంగా సాగుతూండేవి. ఏ మనిషీ కూడా తాను 'పశువులాగా ప్రవర్తిస్తున్నాడా? లేక సత్పురుషుడిలాగా ప్రవర్తిస్తున్నాడా' అని నిజాయితీతో పరిశీలించుకోవడం లేదు.

చైనా కవి, తాత్త్వికులు లావొచు ఒక సందర్భంలో ఇలా అన్నారు: 'నేను మూడు విషయాల్ని మాత్రమే బోధిస్తాను...
సరళత, ఓర్పు, కనికరం.
ఈ మూడూ నీ మహానిధులు.
సరళత పనుల్లోనూ, ఆలోచనల్లోనూ ఉంటే
నువ్వు నీ ఉనికికి ఆధారమైనదానికి మరలుతావు.
ఓర్పుగా మిత్రులతోనూ, శత్రువులతోనూ ఉంటే,
నువ్వు విషయాల వాస్తవికతతో కలుస్తావు.
కనికరాన్ని నీపైనే చూపించుకుంటే,
నువ్వు ప్రపంచంలోని అన్ని ప్రాణులతోనూ పునరైక్యమౌతావు'. లావొచు చెప్పిన సరళత, ఓర్పు, కనికరం ఈ మూడూ మనిషి ప్రవర్తనలో నిండి ఉండాలి. అప్పుడే మనిషి పశువులాగా ప్రవర్తిస్తున్నాడా? అన్న పరిశీలనకు 'కాదు' అని సత్పురుషుడిలాగా ప్రవర్తిస్తున్నాడా? అన్న పరిశీలనకు 'అవును' అని జవాబులు వస్తాయి. సత్పురుషులు వసంత ఋతువు వంటివాళ్లనీ, వాళ్లు లోకహితాన్ని చేస్తారనీ, వాళ్లు శాంతం కలవాళ్లనీ, వాళ్లు గొప్పవాళ్లనీ ఆదిశంకరాచార్య 'శాంతా మహాంతో నివసంతి సంతో వసంతవల్లోక హితం చరంతః' అంటూ చెప్పారు. వసంత ఋతువులాగా హితకరంగా ఉండాలంటే ప్రతి మనిషికీ ప్రవర్తన పునాది.

> జీవితంలో నీవు ఎవరిని కలవాలన్నది
> కాలం నిర్ణయిస్తుంది.
> నీకెవరు కావాలన్నది
> హృదయం నిర్ణయిస్తుంది.
> కానీ
> నీ దగ్గర ఎవరుండాలనేది నిర్ణయించేది
> నీ ప్రవర్తన మాత్రమే.

> తల్లిదండ్రులు ఎలా ప్రవర్తిస్తే పిల్లలూ అలాగే ప్రవర్తిస్తారు. తల్లిదండ్రుల ప్రవర్తన బాగుండాలంటే తల్లిదండ్రులు తమ ప్రవర్తన గురించి ఆలోచించాల్సిన అవసరం ఉంది.

'నీ నమ్మకాలు నిన్ను మేలైన వ్యక్తిని చెయ్యవు నీ ప్రవర్తన చేస్తుంది' అని అంటూ గౌతమ బుద్ధుడు మనిషికి సరైన దిశానిర్దేశం చేశాడు. ప్రతిమనిషీ తన నమ్మకాలకు అతీతంగా ప్రవర్తనను పరిశీలించుకుంటూ ఆ ప్రవర్తనను చక్కగా చెక్కుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. 'నేను పశువులాగా ప్రవర్తిస్తున్నానా? లేక సత్పురుషుడిలాగా ప్రవర్తిస్తున్నానా' అని ప్రతి మనిషీ తన ప్రవర్తనను తాను పరిశీలించుకుంటూ ఉండాలి. ఆ పరిశీలన మనిషిని సత్పురుషుణ్ణి చెయ్యగలిగితే అప్పుడది సమాజానికి హితం ఔతుంది. ఆ పరిశీలనతో మనిషి సత్పురుషత్వాన్ని పొందగలిగితే గొప్ప. అలా కాని పక్షంలో పశుత్వాన్నైనా తనంతతాను వదిలించుకోవాలి.

అంతటా అందరూ సుఖులై ఉండాలి, అందరూ రోగాలు లేనివాళ్లై ఉండాలి, అందరూ భద్రంగా ఉండాలి, ఏ ఒక్కరూ దుఃఖాన్ని పొందకుండా ఉండాలి అన్న ఆకాంక్ష ఒక పూర్వ శ్లోకం 'సర్వత్ర సుఖినస్సంతు సర్వే సంతు నిరామయాః / సర్వే భద్రాణి పశ్యంతు మా కశ్చి ద్దుఃఖ భాగ్భవేత్' ద్వారా మనలో చాల కాలంగా ఉంది. ఈ ఆకాంక్ష సాకారమవాలంటే ప్రతి మనిషీ తన ప్రవర్తనను తాను పరిశీలించుకుంటూండాలి. రండి, ఒక అభ్యాసంగా, ఒక అలవాటుగా మనం మన ప్రవర్తనను పరిశీలించుకుంటూ ప్రశాంతతను సాధించుకుందాం.

– రోచిష్మాన్

సన్నిధి

సువార్త

ఆయన మాటలే ఆశీర్వాదం



యథార్థమైన మాటలు విని నా అంతరింద్రియములు ఆనందించును (సామె 23:16). దావీదు కుమారుడైన సొలొమోను బైబిల్ గ్రంథంలోని సామెతల గ్రంథాన్ని రచించాడు. దేవునియందు భయభక్తులు కలిగి ఆధ్యాత్మిక జ్ఞానంలో ప్రతి ఒక్కరూ వర్ధిల్లాలనేది ఈ గ్రంథం ముఖ్య ఉద్దేశ్యం. మనిషి చుట్టూ జరుగుతున్న ప్రతికూల పరిస్థితులు ఆనందాన్ని హరిస్తున్నట్లు అనిపిస్తుంది. ఎన్నడు తలవని విపత్కర పరిస్థితులు సంతోషాన్ని సమాధి చేస్తుంటాయి. జీవితకాలమంతా తోడుంటా అని వాగ్దానమిచ్చిన వాళ్లు కనుచూపు మేరలో ఎక్కడా కనిపించని పరిస్థితులు దాపురిస్తాయి. పైకి చెప్పుకోకపోయినా మనస్సు నిండా నిరాశ, నిట్టూర్పులు కొందరి జీవితాల్లో కనిపిస్తాయి.

ప్రతికూల వాతావరణంలో దేవుని మాటలు తప్ప మనిషికి ఆదరణ, ధైర్యం మరెవ్వరూ ఇవ్వలేరనేది సుస్పష్టం. ఈ సువిశాల విశ్వంలో దేవుని మాట తప్ప యథార్థమైన మాట ఎక్కడుంది? మనుష్యుల తియ్యని మాటలు అప్పటికప్పుడు వినడానికి బావుంటాయి కానీ కష్టం వచ్చినప్పుడు వారు పలికే చెడ్డ మాటలే విపరీతంగా బాధిస్తాయి. కొందరి మాటలు వరదీసిన కత్తుల వలే పదునుగా ఉంటాయి. దేవుని భయంలేక మాట్లాడే వారు కొందరైతే దేవున్ని కలిగియున్నామని చెప్పుకుంటూ కూడా కానిమాటలు పలుకుతారు. 'మా నాలుకలచేత మేము సాధించెదము. మా పెదవులు మావి, మాకు ప్రభువు ఎవడని వారనుకొందురు (కీర్తన 12:4).

ప్రియ మిత్రమా! ఆనందం కోసం ఎన్నో ఎన్నో ప్రాంతాలు తిరిగి అలసిపోయిన నిన్ను ఊరడించే మాటలు యేసయ్య జీవపు మాటలు. వాటిలో మోసం లేదు... వంచన లేదు. అవి జీవం లేనివారికి జీవాన్ని ప్రసాదించు సజీవమైన మాటలు. దేవుని వాగ్దానాలు, ఆయన ప్రణాళికలు చచ్చిపోలేదు. ఎప్పటికీ చచ్చిపోవు. చరిత్రలో అనేక భక్తుల జీవితాల్లో ఎటువంటి గంభీరమైన కార్యాలు జరిగించాడో ఆ దేవుడే నీతో ఉన్నాడు... నీలో ఉన్నాడు. ఆయన నీతో చేసే సంభాషణ వినడానికి నీకు సమయం ఉందా? ఎందాక మనుష్యుల చుట్టూ తిరిగి అలిసిపోతావు? వారి మాటలు విని ఎందుకు నీవు మానసికంగా కృంగిపోతావు? నీవెందుకూ పనికిరావు అని వారు పలికిన మాటలే కదా నిన్ను సోమరిగా మార్చాయి! నీ దేవుడు నిన్ను వదిలేశాడు అన్న మాటలే కదా నిన్ను అవిశ్వాసిగా మార్చాయి! నీవు బాగుపడాలంటే వాటిని వినడం మానేయి!

భక్తురాలైన మరియ వలే క్రీస్తు పాదాల దగ్గర హృదయపూర్వకంగా కూర్చుని ఎంతకాలమయ్యింది? ఆయన పవిత్రమైన నోటినుండి వచ్చే ఒక్కమాట చాలదా నిన్ను నిలబెట్టడానికి! దివ్యరక్షకుని పెదవుల నుండి జాలువారే ఒక్క వాగ్దానం చాలదా నిన్ను ఆనంద సంతోషాలతో నింపడానికి! ఆనందం కోసం అర్రులు చాస్తున్న నీవు ఇప్పుడే దేవునితో చెప్పు... అయ్యా! నాతో మాట్లాడు. నన్ను బతికించు. నీ పెదవుల నుండి ఆ ప్రార్థన పూర్తిగా జాలువారకముందే నీ చెవుల్లో ఆయన దివ్య సందేశం మారుమ్రోగుతుంది. ఆ మాటలు నిన్ను పరమానందంలో ముంచేస్తాయనుటలో ఏమాత్రం సందేహం లేదు.

– డా. జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్

గురువాణి

ఒక్క చెట్టు పెట్టు... పుణ్యం మూటకట్టు





బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

చెట్టు అనేది ఎంత గొప్పది... ఒక మొక్క నాటడం, దానికి నీళ్ళు పోయడం, చెట్టయ్యేదాకా దానిని సంరక్షించడం... అది చెట్టుగా మారిననాడు అది నాటినవాడికి, పెంచినవాడికి, సంరక్షించినవాడికి ఎంత ఫలితం లభిస్తుందనే దానికి మన శాస్త్రాలు ఏమని చెబుతున్నాయంటే... లోకంలో శరీరం కలిగిన ప్రాణులు ఎన్నో ఉన్నాయి. మనుష్యులే కానక్కరలేదు. శరీరం ఉన్న ప్రతి ప్రాణికీ దాని పోషణకు ఆహారం కావాలి. అది సమయానికి పడకపోతే ఆకలికి విలవిల్లాడిపోతాయి. ఆకలి గొప్ప బాధ.. క్షుత్ అగ్ని.. అది అగ్నిహోత్రం, మంట. ఆ మంట తట్టుకోవడం ఎవరికీ సాధ్యం కాదు. ఆకలేస్తే మొదట ఏది పోతుంది... ధర్మం. ఆకలేసిన వాడికి ధర్మ విచక్షణ ఉండదు. అయ్యా! నా ప్రాణం పోయినా సరే ధర్మాన్ని కాపాడతాను, ఏదీ దొంగిలించను అనడు కదా ! చివరకు తెగించి దొంగతనానికి పాల్పడి అయినా ఆ బాధ తీర్చుకుంటాడు. ఆ మంట అటువంటిది. దహించి వేస్తుంది. అందుకే ఆకలి అన్నది ఎక్కడా ఉండడానికి వీల్లేదు. మనుష్యులకే కాదు, సమస్త ప్రాణులకూ ఆహారం కావాలి. పక్షులు, జంతువులు, క్రిమికీటకాదులు... ఆకలితో ఉన్న మనుష్యులకు వారి ఆర్తిని చూసి జాలిపడి ఎవరయినా ఆహారమిస్తారు.. వీటి ఆకలి ఎవరు తీరుస్తారు?

చెట్టు. దానికి కాండం ఉంటుంది, ఆకులు ఉంటాయి, పూలు ఉంటాయి, కాయలు, పళ్ళను కూడా ఇస్తుంది. దానిని ఆశ్రయించి మనుష్యులే కాదు, క్రిమికీటకాదులు, జంతువులు, పక్షులు తమ ఆకలిని తీర్చుకుంటాయి. దాని బెరడులో చేరిన వందలాది క్రిములు వాటి ఆకలిని అక్కడ తీర్చుకొంటాయి. జంతువులు ఆకులు తింటాయి. పక్షులు గూళ్ళు కట్టుకోవడమే కాక కాయలు, పండ్లు తింటాయి. కొన్ని చిగుళ్ళను తింటాయి. ఎన్నో రెక్కల పురుగులు దాని పూల మీద వాలి ఆకలి తీర్చుకుంటాయి. రాలిన కొమ్మలు, ఆకులు, పూలు, పండ్లు భూమిలో కలిసి అక్కడున్న ఎన్నో పురుగులకు ఆహారమవుతాయి. ఒక చెట్టు... ఒక్క చెట్టే ఇన్నింటికి జీవాధారమవుతున్నది.

మొక్కనాటిన వాడు, చెట్టుగా చేసినవాడు తరువాత కాలంలో శరీరాన్ని వదిలివేయవచ్చుగాక. కానీ అసంఖ్యాకమైన జీవులకు కేవలం ఆకలి తీర్చడమే కాక, వాటి ప్రాణాలను కూడా నిలబెట్టాడు, ఎన్నో జీవులు సేద దీరడానికి కారణమయ్యాడు. చెట్టు ప్రాణవాయువు వదులుతుంది. ప్రకృతి సమతౌల్యతను కాపాడుతుంది. అది మనుష్యులతోపాటూ అనేక జీవులకు ప్రాణాధారంగా నిలబడుతుంది.

అటువంటి మంచి పనికి కారణమయ్యాడు కనుక వాడికి పుణ్యలోక ప్రాప్తి కలుగుతుంది. వారి శరీరం పతనమయిన తరువాత దేవతలు స్వాగతం పలికి వారిని ఉన్నత లోకాలకు తీసుకువెడతారట. అంతేకాదు ఎన్నో ప్రాణులకు కొన్ని సంవత్సరాల పాటు ఆకలిబాధ తీర్చాడు కనుక వారిని మేం సేవిస్తాం అని దేవతలు అంటారట. చెట్లను పెంచే పనిని ప్రోత్సహించడానికి, మనుషులు తమకే కాకుండా సమస్త జీవకోటిపట్ల బాధ్యతాయుతంగా మెలగడానికి, ప్రకృతి సమతుల్యత కాపాడేవిధంగా పర్యావరణాన్ని పరిరక్షించడానికి మన పూర్వీకులు ''యావంతి ఖాసంతి ఫలాని వృక్షాత్ క్షుద్వహ్ని దగ్ధా ...'' అంటూ ఒక శ్లోకం ద్వారా చేసిన ధర్మబోధ ఇది.

సినిమా


పనులు ప్రారంభం



● మహేశ్‌బాబు

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా స్క్రిప్ట్ పనులు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు రాజమౌళి. ''నా సినిమాలకు మా నాన్నగారు (ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్) కథలు అందిస్తుంటారు. నేను ఎప్పట్నుంచో ఓ అడ్వెంచర్ స్టోరీ చేయాలనుకుంటున్నాను. రెండు నెలల క్రితమే ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్స్ మొదలయ్యాయి'' అంటూ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రాజమౌళి పేర్కొన్నారు. దీంతో ఈ సినిమా వచ్చే ఏడాది ద్వితీయార్థంలో సెట్స్‌పైకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. కాగా ప్రస్తుతం మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే.

బాస్ పార్టీ



● చిరంజీవి

బాస్‌పార్టీ టైమ్ ఖరారైంది. చిరంజీవి హీరోగా కొల్లి బాబీ (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మూవీ 'వాల్తేరు వీరయ్య'. రవితేజ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో శ్రుతీహాసన్ హీరోయిన్. మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ మూవీ సంక్రాంతికి విడుదల కానుంది. కాగా ఈ సినిమా నుంచి 'బాస్ పార్టీ..' పాట పూర్తి లిరికల్ వీడియోను ఈ నెల 23న విడుదల చేయనున్నట్లు చిత్రయూనిట్ ఆదివారం వెల్లడించింది. ఈ స్పెషల్ సాంగ్‌లో చిరంజీవితో కలిసి స్టెప్పులేశారు బాలీవుడ్ హీరోయిన్ ఊర్వశీ రౌతేలా. శేఖర్ మాస్టర్ ఈ పాటకు నృత్యరీతులు సమకూర్చారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి దర్శకుడు బాబీ కథ, మాటలు రాయగా, రచయిత కోన వెంకట్, కె.చక్రవర్తి రెడ్డి స్క్రీన్ ప్లే అందిస్తున్నారు. ఈ సినిమాకు సహ నిర్మాతలు: జీకే మోహన్, ప్రవీణ్ ఎం, లైన్ ప్రొడ్యూసర్: కేవీవీ బాలసుబ్రహ్మణ్యం.

ప్రముఖ దర్శకుడు మదన్ కన్నుమూత



తెలుగు చలన చిత్ర పరిశ్రమలో విషాదం చోటుచేసుకుంది. దర్శక-నిర్మాత, రచయిత రామిగాని మదన్‌మోహన్ రెడ్డి(49) కన్నుమూశారు. నాలుగు రోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ ప్రైవేటు ఆస్పత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి తర్వాత తుది శ్వాస విడిచారు.

మదన్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని తంబళ్లపల్లి నియోజకవర్గం బి.కొత్తకోట. కాగా మదన్ చిన్నతనంలోనే ఆయన కుటుంబం మదనపల్లిలో స్థిరపడింది. మదన్ విద్యాభ్యాసం మదనపల్లి, తిరుపతిలో కొనసాగింది. తెలుగు సాహిత్యంపై మంచి పట్టు ఉన్న మదన్ కథలు రాసేవారు. దూరదర్శన్‌లో డాక్యుమెంటరీల చిత్రీకరణ చేశారు. ఆ తర్వాత సినిమాలను కెరీర్‌గా ఎంచుకుని హైదరాబాద్ చేరుకున్న మదన్ ప్రముఖ సినిమాటోగ్రాఫర్ ఎస్.గోపాల్ రెడ్డి వద్ద 'మనసంతా నువ్వే' చిత్రానికి అసిస్టెంట్ కెమెరామేన్‌గా పనిచేశారు. ఆ తర్వాత చంద్రసిద్ధార్థ దర్శకత్వంలో రాజేంద్ర ప్రసాద్ లీడ్ రోల్‌లో నటించిన సూపర్‌హిట్ ఫిల్మ్ 'ఆ నలుగురు'కు కథ, డైలాగ్స్, స్క్రీన్‌ప్లే అందించి, ఇండస్ట్రీలో మంచి పేరు సంపాదించుకున్నారు మదన్. ఆ చిత్రానికి 2004లో ఉత్తమ కథా రచయితగా నంది అవార్డును అందుకున్నారు. జగపతిబాబు, ప్రియమణి జంటగా నటించిన 'పెళ్లైన కొత్తలో..'(2006) చిత్రంతో దర్శకునిగా కెరీర్ ప్రారంభించారాయన. ఆ తర్వాత ఉదయ్ కిరణ్‌తో 'గుండె ఝల్లుమంది' (2008), జగపతిబాబుతో 'ప్రవరాఖ్యుడు' (2009), ఆది సాయికుమార్‌తో 'గరం' (2016), మంచు మోహన్‌బాబు, విష్ణు మంచులతో 'గాయత్రి' (2018) వంటి సినిమాలు మదన్ తెరకెక్కించారు. దర్శకుడిగా 'గాయత్రి' ఆయనకు చివరి చిత్రం. అలాగే కన్నడ చిత్రం 'కాఫీ విత్ మై వైఫ్'తో నిర్మాతగా మారారాయన. విద్యాసాగర్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాకు మదన్ కథ అందించారు. త్వరలో తన దర్శకత్వంలో తెలుగులో మరో సినిమా చేయడానికి కొంత కాలంగా కథాచర్చలు జరుపుతున్నారు మదన్. ఇంతలో ఊహించని విషాదం చోటు చేసుకుని ఆయన మృత్యుఒడికి చేరారు. కాగా మదన్ మోహన్ రెడ్డి మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో ఆదివారం 3గంటలకు మదన్ అంత్యక్రియలు ముగిశాయి.

అప్పుడే ఇండస్ట్రీ బాగుంటుంది – శేఖర్ కమ్ముల



● శివ, శేఖర్ కమ్ముల, నవీన్, అమూల్య

''కొత్త కొత్త ఆలోచనలతో యువ ప్రతిభావంతులు చిత్రపరిశ్రమకి రావాలి.. అప్పుడే ఇండస్ట్రీ బాగుంటుంది. మనం చూసిన ఓ ఊరి కథతో రూపొందిన 'రామన్న యూత్' సినిమా సక్సెస్ కావాలి'' అని దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. నవీన్ బేతిగంటి హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'రామన్న యూత్'. అమూల్య రెడ్డి హీరోయిన్. ఫైర్ ఫ్లై ఆర్ట్స్‌పై రజినీ నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ సినిమా కాన్సెప్ట్ ట్రైలర్‌ను శేఖర్ కమ్ముల విడుదల చేసి, మాట్లాడుతూ–''తన కోసం కష్టపడిన వారిని ఆ నాయకుడు నిర్లక్ష్యం చేస్తే వాళ్లు ఎలా రియాక్ట్ అవుతారు? అనే మంచి కథని తీసుకున్నప్పుడే నవీన్ సక్సెస్ అయ్యాడు'' అన్నారు. ''రాజకీయాల్లో కింది స్థాయిలో తిరిగే ఒక యువకుడి కథే ఈ చిత్రం. ఆరు ప్రధాన పాత్రల చుట్టూ కథ తిరుగుతుంది'' అన్నారు నవీన్. నటులు శ్రీకాంత్ అయ్యంగార్, అనిల్ గీల పాల్గొన్నారు.

ఆనందమో.. ఆవేశమో...



● అనిల్ రావిపూడి, ధర్మ

శివ బాలాజీ, ధర్మ, బ్రిగిడ సాగ (పవి టీచర్) ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సింధూరం'. శ్యామ్ తుమ్మలపల్లి దర్శకత్వంలో ప్రవీణ్ రెడ్డి జంగా నిర్మించారు. ఈ చిత్రంలోని 'ఆనందమో.. ఆవేశమో..' పాట లిరికల్ వీడియోను దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేశారు. ఈ సినిమాకు హరి గౌర సంగీతం అందించారు. బాలాజీ సాహిత్యం అందించిన ఈ పాటను అభయ్ జోద్పూర్కర్ ఆలపించారు. ''మారేడుమిల్లి ఫారెస్ట్‌లో సింగిల్ షెడ్యూల్‌లో ఎంతో కష్టపడి 'సింధూరం' సినిమా షూటింగ్‌ను పూర్తి చేశాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సహ నిర్మాతలు: చైతన్య కందుల, ఎం.సుబ్బారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: డి.రామ బాలాజీ.

మా ఇష్టం



● రామ్‌గోపాల్ వర్మ, నట్టి కుమార్, ఏబీ శ్రీనివాస్

అప్సరా రాణి, నైనా గంగూలీ ప్రధాన పాత్రల్లో కంపెనీ పతాకంపై రామ్‌గోపాల్ వర్మ స్వీయ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'డేంజరస్'. 'మా ఇష్టం' అనేది క్యాప్షన్. ఈ సినిమా డిసెంబరు 9న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ–''నా సినిమాల్లో మరో కొత్త కోణం ఈ సినిమా. మగవాళ్లతో ఇద్దరు అమ్మాయిలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయి? ఆ అమ్మాయిలిద్దరూ ఎందుకు ప్రేమించుకున్నారు? అనే అంశాల నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది'' అని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత-డిస్ట్రిబ్యూటర్ నట్టి కుమార్, నిర్మాత ఏబీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా నాగశౌర్య పెళ్లి

హీరో నాగశౌర్య ఓ ఇంటివాడయ్యాడు. బెంగళూరుకు చెందిన ఇంటీరియర్ డిజైనర్ అనూష శెట్టితో ఆయన ఏడడుగులు వేశారు. బెంగళూరులో ఆదివారం ఉదయం 11.25 గంటలకు నాగశౌర్య-అనూషల పెళ్లి ఘనంగా జరిగింది. వీరి పెళ్లి వేడుకకి సంబంధించిన పలు వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. గత కొన్నేళ్లుగా నాగశౌర్య-అనూషల మధ్య ఉన్న స్నేహం ప్రేమగా మారింది. వీరిద్దరూ ఇరు కుటుంబ పెద్దలను ఒప్పించి పెళ్లి పీటలు ఎక్కారు. ఓ ఫైవ్ స్టార్ హోటల్‌లో జరిగిన ఈ వివాహానికి ఇరు కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, మిత్రులు, హీరోలు బెల్లంకొండ శ్రీనివాస్, నారా రోహిత్‌తో పాటు మరికొందరు తెలుగు సినీ ప్రముఖులు హాజరయ్యారు. పలువురు నెటిజన్లు కూడా నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.



● అనూషశెట్టి, నాగశౌర్య



బొల్లాంట్ ఇండస్ట్రీస్ అధినేత బొల్లా శ్రీకాంత్ బయోపిక్ వెండితెరపైకి వస్తోంది. 'శ్రీ' పేరుతో రూపొందుతున్న ఈ చిత్రంలో శ్రీకాంత్ పాత్రలో బాలీవుడ్ నటుడు రాజ్‌కుమార్ రావు నటిస్తున్నారు. తుషార్ హిద్రానీ దర్శకుడు. జ్యోతిక, అలియా ఎఫ్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమా ఆదివారం ప్రారంభమైంది.

అబ్బా ఓ అబ్బాయా..



● చిత్ర శుక్లా

ఆదర్శ్, చిత్ర శుక్లా, రూపేష్ శెట్టి, శ్రీకాంత్ అయ్యంగార్, జయలలిత, అనిత చౌదరి ముఖ్య పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'గీత సాక్షిగా..'. ఆంథోని మట్టిపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. పుష్పక్, జేబీహెచ్ఆర్ ఎస్‌కేఎల్ సమర్పణలో చేతన్ రాజ్ ఫిలిమ్స్ పతాకంపై చేతన్ రాజ్ నిర్మిస్తున్నారు. గోపీసుందర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'అబ్బా అబ్బా ఓ అబ్బాయా..' అనే పాటను దర్శకుడు రామ్ గోపాల్ వర్మ విడుదల చేసి, మాట్లాడుతూ–''పాట క్యాచీగా ఉంది. పిక్చరైజేషన్, కొరియోగ్రఫీ చాలా బాగున్నాయి'' అన్నారు. ''నిజ జీవిత సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న సినిమా 'గీత సాక్షిగా'. ఈ పాటకి రెహమాన్ సాహిత్యం అందించగా, సాహితీ చాగంటి పాడారు'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: వెంకట్ హనుమ నరిసేటి.

సైకో థ్రిల్లర్



● సాయి ధన్సిక

సాయిధన్సిక ప్రధాన పాత్రలో రూపొందుతోన్న చిత్రం 'దక్షిణ'. ఓషో తులసీరామ్ దర్శకత్వంలో కల్ట్ కాన్సెప్ట్స్ పతాకంపై అశోక్ షిండే నిర్మిస్తున్నారు. ఆదివారం (నవంబరు 20) సాయిధన్సిక బర్త్ డే సందర్భంగా ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది చిత్రయూనిట్. ''సైకో థ్రిల్లర్‌గా రూపొందుతున్న చిత్రమిది. సాయి ధన్సిక హై ఓల్టేజ్ పెర్ఫార్మెన్స్ చేస్తున్నారు. తెలుగు, తమిళంలో రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ 70 శాతం పూర్తయింది. డిసెంబరులో విశాఖలో జరిగే షెడ్యూల్‌తో షూటింగ్ కంప్లీట్ అవుతుంది'' అన్నారు అశోక్ షిండే. బెంగాలీ హీరో రిషవ్ బసు విలన్‌గా నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: బాలాజీ.



అమెరికా చిన్నోడికి పగ్గాలు

'ఫిఫా' ప్రపంచకప్ ఫుట్‌బాల్‌లో అమెరికా పిన్న వయస్కుడి సారథ్యంలో బరిలోకి దిగుతోంది. 23 ఏళ్ల టైలర్ ఆడమ్స్‌కు జట్టు పగ్గాలు అప్పగించింది. 32 జట్లు తలపడుతున్న ఈ మెగా టోర్నీలో పిన్న వయస్సు కెప్టెన్ ఆడమ్స్ కావడం విశేషం. 1950లో కూడా 23 ఏళ్ల వాల్టర్ బహ్ర్ వరల్డ్‌కప్‌లో అమెరికాను నడిపించాడు. అమెరికా సారథిగా 9 మ్యాచ్‌ల్లో జట్టును నడిపించిన ఆడమ్స్ ఏడు మ్యాచ్‌ల్లో గెలిపించాడు. ఒకదాంట్లో ఓడగా, మరొటి డ్రాగా ముగిసింది.

గాయంతో కరీమ్ బెంజెమా అవుట్

ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఫ్రాన్స్ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ప్లేయర్ కరీమ్ బెంజెమా తొడ కండరాల గాయంతో ఈ మెగా ఈవెంట్ నుంచి వైదొలిగాడు. 34 ఏళ్ల కరీమ్ 2014 ప్రపంచకప్‌లో ఫ్రాన్స్ తరఫున టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం సెక్స్ టేప్ కుంభకోణంలో ఇరుక్కొని జట్టులో చోటు కోల్పోయాడు. గత ఏడాది పునరాగమనం చేసిన కరీమ్ ఫ్రాన్స్ తరఫున 97 మ్యాచ్‌లు ఆడి 37 గోల్స్ చేశాడు.



వహ్వా!

అట్టహాసంగా ప్రారంభోత్సవం

'మనల్నందరినీ కలిపే ఈ క్షణం మనందరినీ విడదీసే ఘటనలకంటే ఎంతో గొప్పది... అయితే ఇది ఈ ఒక్క రోజుకు పరిమితం కాకుండా శాశ్వతంగా నిలిచిపోయేందుకు ఏమేం చేయాలి'... హాలీవుడ్ స్టార్ మోర్గన్ ఫ్రీమన్ గంభీర స్వరంతో ప్రేక్షకులను అడిగిన ఈ ప్రశ్నతో విశ్వ సంబరానికి విజిల్ మోగింది. ఖతర్ దేశం అంచనాలకు తగినట్లుగా అద్భుతమైన ప్రారంభోత్సవ వేడుకలతో ప్రపంచ అభిమానుల మనసులు దోచింది. తమ దేశ సంస్కృతిని ప్రతిబింబించేలా కార్యక్రమాలను రూపొందించారు. అల్ బైత్ స్టేడియం మధ్యలో ఫ్రీమన్ ఆద్యంతం తన వ్యాఖ్యానంతో రక్తి కట్టిస్తుండగా... భిన్నమైన సాంస్కృతిక, సంప్రదాయ కార్యక్రమాలు కట్టిపడేశాయి. ప్రపంచకప్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న ఖతర్ 'యూ ట్యూబర్' ఘనిమ్ అల్ ముఫ్తాతో ఫ్రీమన్ సంభాషణ ఆసక్తికరంగా సాగింది. కాడల్ రిగ్రెషన్ సిండ్రోమ్‌తో బాధపడుతూ ఘనిమ్ నడుము కింది భాగం మొత్తం చచ్చుబడిపోయింది. ఈ ప్రపంచంలో ఉన్న భిన్నత్వం గురించి ఫ్రీమన్ అడగ్గా... ఖురాన్‌లోని కొన్ని పంక్తులతో ఘనిమ్ సమాధానమిచ్చాడు. కొరియా ప్రఖ్యాత గాయకుడు జుంగ్ కూక్, ఖతర్ సింగర్ ఫహద్ అల్ కుబైసి కలిసి వరల్డ్ కప్ థీమ్ సాంగ్ 'డ్రీమర్స్'ను ఆలాపించినప్పుడు 60 వేల సామర్థ్యం గల స్టేడియం దద్దరిల్లింది. సాంప్రదాయ కత్తి నృత్యం 'అల్ అర్దా' ప్రదర్శించినప్పుడు కూడా భారీ స్పందన వచ్చింది. వరల్డ్ కప్ మస్కట్ 'లయీబ్'ను, టోర్నీలో పాల్గొంటున్న 32 దేశాల జెండాలను కూడా ఘనంగా ప్రదర్శించారు. చివరగా...ఖతర్ రాజు తమీమ్ బిన్ హమద్ అల్–థని 'అరబ్ ప్రపంచం తరఫున అందరికీ ఈ వరల్డ్ కప్‌లో స్వాగతం పలుకుతున్నాం' అంటూ మెగా టోర్నీ ప్రారంభమైనట్లు అధికారికంగా ప్రకటించడంతో కార్యక్రమం ముగిసింది.

ప్రపంచకప్‌లో నేడు

ఇంగ్లండ్ X ఇరాన్
సాయంత్రం గం. 6:30 నుంచి

నెదర్లాండ్స్ X సెనెగల్
రాత్రి గం. 9:30 నుంచి

వేల్స్ X అమెరికా
అర్ధరాత్రి గం. 12:30 నుంచి

స్పోర్ట్స్ 18, జియో సినిమా చానెల్స్‌లో ప్రత్యక్ష ప్రసారం




హాలీవుడ్ స్టార్ మోర్గాన్ ఫ్రీమన్, ప్రపంచకప్ బ్రాండ్ అంబాసిడర్ ఘనిమ్ అల్ ముఫ్తా


బాణాసంచా మెరుపుల్లో అల్ బైత్ స్టేడియం


కొరియా ప్రఖ్యాత గాయకుడు జంగ్ కూక్


ప్రపంచకప్ అధికారిక మస్కట్ 'లయీబ్'

అయ్యో ఆతిథ్య జట్టు...


ఫుట్‌బాల్ ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో ఖతర్‌కు పరాజయం
గెలుపుతో శుభారంభం చేసిన ఈక్వెడార్ ● రెండు గోల్స్ చేసిన వాలెన్సియా

92 సంవత్సరాల ఫుట్‌బాల్ ప్రపంచకప్ చరిత్రలో ఇప్పటి వరకు ఆతిథ్య జట్టు తాము ఆడిన తొలి మ్యాచ్‌లో ఓడిపోలేదు. విజయం సాధించడం లేదంటే 'డ్రా'తో సంతృప్తి పడటం జరిగింది. కానీ ఆదివారం ఈ ఆనవాయితీ మారింది. టోర్నీ చరిత్రలో తొలిసారి ఆతిథ్య జట్టు ఆడిన తొలి మ్యాచ్‌లోనే ఓటమి మూటగట్టుకుంది. ఈ మెగా ఈవెంట్ నిర్వహణ కోసం లక్షల కోట్లు వెచ్చించిన ఖతర్ దేశానికి తొలి మ్యాచ్ మాత్రం నిరాశను మిగల్చగా... నాలుగోసారి ప్రపంచకప్‌లో ఆడుతున్న ఈక్వెడార్ విజయంతో బోణీ కొట్టి శుభారంభం చేసింది.

అల్ ఖోర్: గతంలో ఏనాడూ ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధించలేకపోయిన ఖతర్ జట్టు ఆతిథ్య జట్టు హోదా కారణంగా తొలిసారి బరిలోకి దిగింది. ఈ మెగా టోర్నీకి సన్నాహాలు చాలా ఏళ్ల నుంచి సాగుతున్నా ఆతిథ్య జట్టు మాత్రం మైదానంలో ఆశించినస్థాయిలో మెరిపించలేకపోయింది. ఆదివారం జరిగిన గ్రూప్ 'ఎ' తొలి లీగ్ మ్యాచ్‌లో ప్రపంచ 44వ ర్యాంకర్ ఈక్వెడార్ 2–0 గోల్స్‌తో ప్రపంచ 50వ ర్యాంకర్ ఖతర్ జట్టును ఓడించి శుభారంభం చేసింది. ఈక్వెడార్ తరఫున నమోదైన రెండు గోల్స్‌ను ఇనెర్ వాలెన్సియా (16వ నిమిషంలో, 31వ నిమిషంలో) సాధించడం విశేషం. ఈ గెలుపుతో ఈక్వెడార్‌కు మూడు పాయింట్లు లభించాయి.


వాలెన్సియాను అడ్డుకుంటున్న ఖతర్ గోల్‌కీపర్

గత ప్రపంచకప్‌నకు అర్హత సాధించడంలో విఫలమైన ఈక్వెడార్ తాజా టోర్నీలో మాత్రం ఖతర్‌పై అదరగొట్టే ప్రదర్శన చేసింది. గతంలో ఈ రెండు జట్ల మధ్య మూడు మ్యాచ్‌లు జరగ్గా... ఇరు జట్లు చెరో మ్యాచ్‌లో గెలిచి, మరో మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించాయి. అయితే ఈసారి మాత్రం ఈక్వెడార్ స్పష్టమైన ఆధిక్యం కనబరిచింది. పూర్తి సమన్వయంతో కదులుతూ ఖతర్ గోల్‌పోస్ట్‌పై తొలి నిమిషం నుంచే దాడులు చేసింది. ఆట మూడో నిమిషంలోనే ఈక్వెడార్ ఖాతా తెరిచింది. ఫెలిక్స్ టోరెస్ ఆక్రోబాటిక్ కిక్ షాట్ గాల్లోకి లేవగా వాలెన్సియా హెడర్ షాట్‌తో బంతిని గోల్‌పోస్ట్‌లోనికి పంపించాడు. ఈక్వెడార్ జట్టు సంబరంలో మునిగింది. అయితే ఖతర్ జట్టు గోల్‌పై సమీక్ష కోరింది. వీడియో అసిస్టెంట్ రిఫరీ (వీఏఆర్) టీవీ రీప్లేను పరిశీలించగా 'ఆఫ్ సైడ్' అని తేలింది. దాంతో రిఫరీ గోల్ ఇవ్వలేదు. అయితే ఈక్వెడార్ పట్టువదలకుండా తమ దాడులకు పదును పెట్టింది. ఫలితంగా ఖతర్ జట్టు ప్రత్యర్థి ఆటగాళ్లను నిలువరించడమే తప్ప ఎదురు దాడులు చేయలేకపోయింది. 16వ నిమిషంలో బంతితో 'డి' ఏరియాలోకి వచ్చిన ఈక్వెడార్ ప్లేయర్ వాలెన్సియాను ఖతర్ గోల్ కీపర్ సాద్ అల్ షీబ్ మొరటుగా అడ్డుకోవడంతో వాలెన్సియా పడిపోయాడు. ఫలితంగా రిఫరీ ఈక్వెడార్‌కు పెనాల్టీ కిక్ ప్రకటించగా... వాలెన్సియా ఈ పెనాల్టీని గోల్‌గా మలిచి ఈక్వెడార్‌కు 1–0 ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత 31వ నిమిషంలో సహచరుడు ఏంజెలో ప్రెసియాడో క్రాస్ షాట్‌ను వాలెన్సియా హెడర్ షాట్‌తో బంతిని లక్ష్యానికి చేర్చాడు. విరామ సమయానికి ఈక్వెడార్ 2–0తో ఆధిక్యంలోకి నిలిచింది. రెండో అర్ధ భాగంలోనూ ఈక్వెడార్ జోరు కొనసాగగా...ఖతర్ జట్టుకు ప్రత్యర్థిని నిలువరించడంలోనే సరిపోయింది. ఈక్వెడార్‌కు మూడో గోల్ ఇవ్వకుండా ఖతర్ మ్యాచ్‌ను ముగించగలిగింది.


వాలెన్సియా తొలి గోల్... →
← గోల్ చేశాక సంబరం....

సూర్య ప్రతాపం

● భారత బ్యాటర్ మెరుపు సెంచరీ
● 51 బంతుల్లో 11 ఫోర్లు, 7 సిక్స్‌లతో 111 నాటౌట్
● రెండో టి20లో న్యూజిలాండ్‌పై టీమిండియా విజయం
● దీపక్ హుడాకు నాలుగు వికెట్లు
● టిమ్ సౌతీ 'హ్యాట్రిక్' వృథా

పరిమిత ఓవర్ల సిరీస్ ఆడేందుకు న్యూజిలాండ్ వచ్చిన టీమిండియా టి20 సిరీస్‌ను మాత్రం ఇక కోల్పోదు. ఎందుకంటే వర్షంతో ఒకటి రద్దు కాగా... రెండో మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్ ధనాధన్ సెంచరీతో భారత్ జయభేరి మోగించింది. దీంతో ఆతిథ్య సీమర్ టిమ్ సౌతీ 'హ్యాట్రిక్' ప్రదర్శన చిన్నబోయింది. ఒకవేళ రేపు ఆఖరి పోరులో ఓడినా సిరీస్ సమం అవుతుందే తప్ప చేజారే ప్రసక్తే లేదు.

మౌంట్ మాంగనుయ్: సూర్యకుమార్ యాదవ్ ఆట న్యూజిలాండ్ గడ్డపైనా చుక్కలను అందుకుంది. ఆతిథ్య బౌలింగ్‌ను తుత్తునియలు చేసింది. దీంతో రెండో టి20 మ్యాచ్‌లో భారత్ 65 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌పై ఘనవిజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 191 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సూర్య (51 బంతుల్లో 111 నాటౌట్; 11 ఫోర్లు, 7 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. సౌతీ 3, ఫెర్గూసన్ 2 వికెట్లు తీశారు. తర్వాత భారీలక్ష్యాన్ని ఛేదించేందుకు దిగిన న్యూజిలాండ్ 18.5 ఓవర్లలో 126 పరుగులకే కుప్పకూలింది. కేన్ విలియమ్సన్ (52 బంతుల్లో 61; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఒంటరి పోరాటం చేశాడు. దీపక్ హుడా (2.5–0–10–4) అద్భుతమైన స్పెల్‌తో కివీస్‌ను కూల్చేశాడు. హైదరాబాద్ సీమర్ సిరాజ్ 2 కీలక వికెట్లు తీశాడు. రేపు నేపియర్‌లో ఆఖరి టి20 మ్యాచ్ జరుగుతుంది.

49 బంతుల్లోనే సూర్య సెంచరీ

సూర్యకుమార్ 51 బంతుల్లో చేసింది 111 పరుగులు... ఎక్స్‌ట్రాలు 11. కలిపితే 122 పరుగులు! సూర్య ఆడగా మిగిలిన బంతులు 69... వచ్చిన పరుగులు కూడా 69! క్రీజులోకి వచ్చిన మిగతా 7 మంది బ్యాటర్లు చేశారు. అంటే ఈ పాటికే సూర్య ఒక్కడి విధ్వంసం ఎలా సాగిందో అందరికీ అర్థమై ఉంటుంది. రిషభ్ పంత్ (6) ఓపెనింగ్ కుదర్లేదు. ఇషాన్ కిషన్ (31 బంతుల్లో 36; 5 ఫోర్లు, 1 సిక్స్) మిగతా ఆరుగురిలో మెరుగ్గా ఆడాడు. తర్వాత వచ్చిన శ్రేయస్ అయ్యర్ (13), కెప్టెన్ హార్దిక్ పాండ్యా (13)లవి తక్కువ స్కోర్లే! అయితే అవతలి వైపు సూర్య వీరవిహారంతోనే భారత్ భారీస్కోరు చేయగలిగింది. ఆరో ఓవర్లో మొదలైన అతని ఆటను ఆరంభంలో వాన అడ్డుకుంది కానీ... ఆ తర్వాత ఏ బౌలర్ ఆపతరం కాలేదు. 17, 18, 19వ ఓవర్లయితే సూర్య విధ్వంసం దశను దాటి సునామీలా మారింది. సౌతీ 17వ ఓవర్లో సిక్స్ 2 ఫోర్లతో 17 పరుగులు పిండాడు. 18వ ఓవర్లో మిల్నేకు 2 భారీ సిక్సర్లతో చుక్కలు చూపాడు. 18 పరుగులొచ్చాయి. ఫెర్గూసన్ 19వ ఓవర్లో 4, 0, 4, 4, 4, 6లతో 22 పరుగులు సాధించాడు. దీంతో ఈ మూడు ఓవర్లలోనే 57 పరుగులు వచ్చాయి. సూర్య సునామీతో సౌతీ ఆఖరి ఓవర్లో వరుస బంతుల్లో హార్దిక్, హుడా (0), వాషింగ్టన్ సుందర్ (0)లను అవుట్ చేసి హ్యాట్రిక్ వికెట్లు తీసినా పెద్దగా ప్రయోజనం లేకపోయింది. తొలి ఫిఫ్టీని 32 బంతుల్లో (5 ఫోర్లు, 2 సిక్సర్లు) చేసిన సూర్యకుమార్ శతకాన్ని 49 బంతుల్లో (10 ఫోర్లు, 6 సిక్సర్లు) పూర్తి చేశాడు. అంటే కేవలం 17 బంతుల్లో రెండో ఫిఫ్టీ సాధించాడు.


సూర్యకుమార్


దీపక్ హుడా

7 ఈ ఏడాది సూర్యకుమార్‌కు లభించిన 'ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డులు. ఒకే ఏడాది అత్యధిక 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డులు గెల్చుకున్న భారత క్రికెటర్‌గా కోహ్లి (2106లో 6 సార్లు) పేరిట ఉన్న రికార్డును సూర్య సవరించాడు.

62 ఈ ఏడాది మూడు ఫార్మాట్‌లలో కలిపి భారత్ ఆడిన అంతర్జాతీయ మ్యాచ్‌లు. ఒకే ఏడాది అత్యధిక మ్యాచ్‌లు ఆడిన జట్టుగా ఆస్ట్రేలియా (2009లో 61) పేరిట ఉన్న రికార్డును టీమిండియా అధిగమించింది.

2 లసిత్ మలింగ తర్వాత అంతర్జాతీయ టి20ల్లో రెండుసార్లు 'హ్యాట్రిక్' నమోదు చేసిన రెండో బౌలర్‌గా సౌతీ నిలిచాడు. సౌతీ 2010లో తొలిసారి పాకిస్తాన్‌పై హ్యాట్రిక్ సాధించాడు.


టిమ్ సౌతీ

విలియమ్సన్ ఒంటరి పోరాటం

తర్వాత ఆతిథ్య న్యూజిలాండ్ లక్ష్యఛేదన పేలవంగా మొదలైంది. స్పిన్‌తో ముగిసింది. ఓపెనర్లలో ఫిన్ అలెన్ (0) డకౌట్ కాగా, కాన్వే (22 బంతుల్లో 25; 3 ఫోర్లు) కాసేపే నిలిచాడు. చహల్, హుడా స్పిన్ ఉచ్చులో ఫిలిప్స్ (12), మిచెల్ (10), నీషమ్ (0) పడ్డారు. అయితే కుదురుగా ఆడిన కెప్టెన్ కేన్ విలియమ్సన్ జట్టు స్కోరును 100 పరుగులు దాటించి పరువు నిలిపాడు. విలియమ్సన్ 48 బంతుల్లో (3 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. 19వ ఓవర్ వేసిన దీపక్ హుడా... మూడు వికెట్లు తీయడంతో కివీస్ ఆట 7 బంతుల ముందే ముగిసింది. అతను ఇష్ సోధి (1), సౌతీ (0), మిల్నే (6)లను పెవిలియన్ చేర్చడంతో కివీస్ ఆలౌటైంది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (సి) సౌతీ (బి) ఇష్ సోధి 36; పంత్ (సి) సౌతీ (బి) ఫెర్గూసన్ 6; సూర్యకుమార్ (నాటౌట్) 111; శ్రేయస్ అయ్యర్ (హిట్ వికెట్) (బి) ఫెర్గూసన్ 13; పాండ్యా (సి) నీషమ్ (బి) సౌతీ 13; హుడా (సి) ఫెర్గూసన్ (బి) సౌతీ 0; సుందర్ (సి) నీషమ్ (బి) సౌతీ 0; భువనేశ్వర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 191. వికెట్ల పతనం:** 1–36, 2–69, 3–108, 4–190, 5–190, 6–190. **బౌలింగ్:** సౌతీ 4–0–34–3, మిల్నే 4–0–35–0, ఫెర్గూసన్ 4–0–49–2, నీషమ్ 1–0–9–0, ఇష్ సోధి 4–0–35–1, సాన్‌ట్నర్ 3–0–27–0.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్: అలెన్ (సి) అర్ష్‌దీప్ (బి) భువనేశ్వర్ 0; కాన్వే (సి) అర్ష్‌దీప్ (బి) సుందర్ 25; విలియమ్సన్ (బి) సిరాజ్ 61; ఫిలిప్స్ (బి) చహల్ 12; మిచెల్ (సి) అయ్యర్ (బి) హుడా 10; నీషమ్ (సి) ఇషాన్ (బి) చహల్ 0; సాన్‌ట్నర్ (సి అండ్ బి) సిరాజ్ 2; మిల్నే (సి) అర్ష్‌దీప్ (బి) హుడా 6; ఇష్ సోధి (స్టంప్డ్) పంత్ (బి) హుడా 1; సౌతీ (సి) పంత్ (బి) హుడా 0; ఫెర్గూసన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (18.5 ఓవర్లలో ఆలౌట్) 126. వికెట్ల పతనం:** 1–0, 2–56, 3–69, 4–88, 5–89, 6–99, 7–124, 8–125, 9–125, 10–126. **బౌలింగ్:** భువనేశ్వర్ 3–0–12–1, అర్ష్‌దీప్ 3–0–29–0, సిరాజ్ 4–1–24–2, సుందర్ 2–0–24–1, చహల్ 4–0–26–2, హుడా 2.5–0–10–4.

విజయంతో వెర్‌స్టాపెన్ ముగింపు



అబుదాబి: ఆద్యంతం ఆధిపత్యం చలాయించిన రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ 2022 ఫార్ములావన్ సీజన్‌ను విజయంతో ముగించాడు. సీజన్‌లో చివరిదైన 22వ రేసు అబుదాబి గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 58 ల్యాప్‌ల ఈ రేసును వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా గంటా 27 నిమిషాల 45.914 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఫెరారీ డ్రైవర్ లెక్‌లెర్క్ రెండో స్థానంలో, పెరెజ్ (రెడ్‌బుల్) మూడో స్థానంలో నిలిచారు. ఓవరాల్‌గా ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్ మొత్తం 15 రేసుల్లో విజేతగా నిలిచి 454 పాయింట్లతో టాప్ ర్యాంక్‌తో ముగించాడు. అంతేకాకుండా ఒకే ఏడాది అత్యధిక ఎఫ్1 రేసుల్లో గెలిచిన డ్రైవర్‌గా వెర్‌స్టాపెన్ రికార్డు నెలకొల్పాడు.

భారత అండర్-19 జట్టులో త్రిష, షబ్నమ్

న్యూజిలాండ్‌తో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్

న్యూఢిల్లీ: న్యూజిలాండ్ అండర్–19 జట్టుతో స్వదేశంలో ఈనెల 27 నుంచి డిసెంబర్ 6 వరకు జరిగే ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో పాల్గొనే భారత మహిళల అండర్–19 జట్టును ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన 17 ఏళ్ల గొంగడి త్రిష, విశాఖపట్నం జిల్లాకు చెందిన బౌలర్ షబ్నమ్ భారత జట్టులో చోటు దక్కించుకున్నారు. ప్రస్తుతం జరుగుతోన్న బీసీసీఐ సీనియర్ మహిళల టి20 ట్రోఫీ టోర్నీలో త్రిష ఏడు మ్యాచ్‌లు ఆడి 100.00 స్ట్రయిక్‌రేట్‌తో 172 పరుగులు సాధించింది. చాలెంజర్ టోర్నీలో నాలుగు మ్యాచ్‌లు ఆడి 117 పరుగులు చేసి రెండో టాప్ స్కోరర్‌గా నిలిచింది. 15 మంది సభ్యులతో కూడిన టీమిండియాకు శ్వేత సెహ్రావత్ కెప్టెన్‌గా, సౌమ్య తివారీ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తారు. ఐదు టి20 మ్యాచ్‌లు ముంబైలో నవంబర్ 27, 29, డిసెంబర్ 1, 4, 6వ తేదీల్లో జరుగుతాయి.


త్రిష
షబ్నమ్

వచ్చే ఏడాది జనవరి 14 నుంచి 29 వరకు దక్షిణాఫ్రికాలో జరిగే తొలి అండర్–19 మహిళల టి20 వరల్డ్‌కప్ టోర్నీ సన్నాహాల్లో భాగంగా ఈ సిరీస్‌ను ఏర్పాటు చేశారు.

భారత అండర్–19 జట్టు: శ్వేత సెహ్రావత్ (కెప్టెన్), శిఖా షాలోట్, గొంగడి త్రిష, సౌమ్య తివారీ (వైస్ కెప్టెన్), సోనియా మెహిదియా, హర్లీ గాలా, రిషిత బసు, నందిని కశ్యప్ (వికెట్ కీపర్), సోనమ్ యాదవ్, మన్నత్ కశ్యప్, అర్చన దేవి, పార్శవి చోప్రా, టిటాస్ సాధు, ఫలక్ నాజ్, షబ్నమ్.

అర్జున్‌కు మూడో విజయం



శాన్‌ఫ్రాన్సిస్కో: మెల్ట్‌వాటర్ చాంపియన్స్ టూర్ ఫైనల్స్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్, తెలంగాణ ప్లేయర్ ఇరిగేశి అర్జున్ ఖాతాలో మూడో విజయం చేరింది. ఆరో రౌండ్ మ్యాచ్‌లో అర్జున్ 2.5–0.5తో క్వాంగ్ లియెమ్ లీ (వియత్నాం)పై గెలిచాడు. అర్జున్ తొలి గేమ్‌లో 66 ఎత్తుల్లో... రెండో గేమ్‌లో 41 ఎత్తుల్లో నెగ్గాడు. మూడో గేమ్‌ను 24 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. ఫలితం తేలిపోవడంతో నాలుగో గేమ్‌ను నిర్వహించలేదు. ప్రపంచ చాంపియన్ కార్ల్‌సన్ (నార్వే)తో జరిగిన మ్యాచ్‌లో భారత్‌కే చెందిన యువ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద 0.5–2.5తో ఓడిపోయాడు. ఆరో రౌండ్ తర్వాత అర్జున్ తొమ్మిది పాయింట్లతో నాలుగో స్థానంలో, ప్రజ్ఞానంద ఆరు పాయింట్లతో ఏడో స్థానంలో ఉన్నారు.

2017 నాటి 'అర్జున' ఇప్పుడు పుజారా చేతికి...



న్యూఢిల్లీ: భారత క్రికెటర్ చతేశ్వర్ పుజారా ఎట్టకేలకు ఐదేళ్ల తర్వాత తనకు ప్రకటించిన 'అర్జున' అవార్డును అందుకున్నాడు. క్రికెట్లో రాణిస్తున్న అతన్ని 2017లోనే భారత ప్రభుత్వం ఆ అవార్డుకు ఎంపిక చేసింది. కానీ టీమిండియా బిజీ షెడ్యూల్ వల్ల ఆ ఏడాది అందుకోలేకపోయాడు. ఢిల్లీలో ప్రస్తుతం సౌరాష్ట్ర తరఫున విజయ్ హజారే ట్రోఫీ ఆడుతున్న అతనికి కేంద్ర క్రీడల మంత్రి అనురాగ్ ఠాకూర్ 'అర్జున' పురస్కారం బహూకరించారు. దీనిపై స్పందించిన పుజారా తనను ప్రోత్సహించిన బోర్డు (బీసీసీఐ)కు, తన ఘనతను గుర్తించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ట్వీట్ చేశాడు.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	87	61,663
నిఫ్టీ ▲	36	18,308

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	11,146	▲	1
డోజోన్స్	33,746	▲	199
ఎఫ్‌టీఎస్ఈ 100	7,386	▲	39
డాక్స్	14,433	▲	165
షాంఘై	3,115	▽	5
నికాయ్	27,931	▽	98

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

వైద్య బిల్లుల భారం తగ్గేది ఎలా..?



- సమగ్రమైన బీమా ప్లాన్ తీసుకోవాలి
- రూమ్ రెంట్ పరిమితులు ఉండకూడదు
- డైలీ క్యాష్, కన్స్యూమబుల్స్ కవర్ తీసుకోవాలి
- ఓపీడీ సేవలకూ కవరేజీ అవసరం
- 'కోపే' షరతులు లేకుండా చూసుకోవాలి
- నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చార్జీలు తక్కువ

కుమార్ ప్రైవేటు ఉద్యోగి. ఇటీవలే కడుపులో తీవ్రమైన నొప్పితో హాస్పిటల్ లో చేరాడు. పరిశీలించిన వైద్యులు పేగు సంబంధిత ఇన్ఫెక్షన్‌గా తేల్చారు. మూడు రోజుల తర్వాత డిశ్చార్జ్ చేయగా, మొత్తం బిల్లు రూ.80వేలు వచ్చింది. నిజానికి కుమార్‌కు రూ.5 లక్షల ఫ్యామిలీ ఫ్లోటర్ హెల్త్ ప్లాన్ ఉంది. దాంతో అతడు నిశ్చింతగా ఉన్నాడు. కానీ, అయిన బిల్లులో బీమా కంపెనీ చెల్లించింది కేవలం రూ.49,000. మిగిలిన రూ.31,000 తను జేబు నుంచి చెల్లించాల్సి వచ్చింది. బీమా సంస్థ అంత మొత్తం ఎందుకు తగ్గించిందన్నది అతడికి అంతుబట్టలేదు. ఇది కుమార్ ఒక్కడికే ఎదురైన పరిస్థితి అనుకోవద్దు. వైద్య చికిత్సల కోసం ప్రజలు పెద్ద ఎత్తున తమ సొంత ఖజానా నుంచి చెల్లించుకోవాల్సిన సందర్భాలు బోలెడు. నీతి ఆయోగ్ 2021 నివేదిక ప్రకారం.. దేశంలో ఆరోగ్య సంరక్షణ కోసం చేస్తున్న మొత్తం వ్యయాల్లో 63 శాతాన్ని ప్రజలు సొంతంగా భరిస్తున్నారు. ప్రపంచదేశాల్లోనే ఇది ఎక్కువ. దీని వెనుక ఎన్నో కారణాలున్నాయి. ఆరోగ్య బీమా పాలసీ ఉన్నా ఇలా మన జేబు నుంచి చెల్లించుకోవాల్సిన పరిస్థితులను తగ్గించుకోవాలంటే ఏం చేయాలో చెప్పే కథనమిది...

అసలు హెల్త్ ఇన్సూరెన్స్ అన్నదే లేకపోవడం, ఉన్నా సమగ్ర కవరేజీతో తీసుకోకపోవడం కూడా క్లెయిమ్ సమయంలో పాలసీదారులపై అదనపు భారం పడేలా చేస్తోంది. చికిత్సలో భాగంగా ఉపయోగించే కొన్ని రకాల వస్తువులు, సేవలకు హెల్త్ ఇన్సూరెన్స్ నుంచి మినహాయింపు ఉన్న విషయాన్ని నివా బూపా హెల్త్ ఇన్సూరెన్స్ అండర్ రైటింగ్, ప్రొడక్ట్స్ క్లెయిమ్ డైరెక్టర్ డాక్టర్ బబతోష్ మిశ్రా గుర్తు చేశారు. ''చాలా మంది సమగ్రమైన కవరేజీని ఎంపిక చేసుకోవడం లేదు. కరోనా సంక్షోభం తర్వాత పెరిగిపోయిన ద్రవ్యోల్బణ ప్రభావంతో, ఎక్కువ రోజుల పాటు హాస్పిటల్‌లో ఉండాల్సి వస్తే కవరేజీ చాలడం లేదు. దాంతో మిగిలిన మొత్తాన్ని పాలసీదారులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది'' అని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ విభాగం హెడ్ భాస్కర్ నెరుర్కర్ పేర్కొన్నారు. ఔట్ పేషెంట్ రూపంలో పొందే వైద్య సేవలకు చాలా ప్లాన్లలో కవరేజీ ఉండదు. కో-పే, సబ్ లిమిట్ తదితర షరతులు క్లెయిమ్ సమయంలో పాలసీదారులపై చెల్లింపుల భారానికి కారణమవుతాయి. అందుకని పాల సీ కవరేజీ విషయంలో కొన్ని ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి. దీనికితోడు పాలసీదారులు తమపై భారం తగ్గించుకునేందుకు అందుబాటులోని ఇతర మార్గాలను గుర్తించడమే పరిష్కారం.

బయటి ల్యాబ్‌లు

ఔట్ పేషెంట్‌గా వైద్య చికిత్సలకు వెళ్లినప్పుడు హాస్పిటల్‌కు సంబంధించిన ల్యాబ్‌లలో కాకుండా, బయటి డయాగ్నోస్టిక్స్‌లో టెస్ట్‌లు చేయించుకోవడం ద్వారా ఖర్చును తగ్గించుకోవచ్చు. హాస్పిటల్ అనుబంధ కేంద్రాల్లో రక్త పరీక్షలు, ఎంఆర్ఐ, సీటీ స్కాన్, అల్ట్రాసౌండ్ తదితర రేడియో ఇమేజింగ్ సేవల చార్జీలు ఎంతో అధికంగా ఉంటుంటాయి. ప్రైవేటులోనూ హెల్త్ స్టార్టప్‌ల రూపంలో ఎన్నో కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. హెల్తియన్స్, థైరోకేర్ ఇలా చాలానే ఉన్నాయి. వైద్యులు పరీక్షలు సూచించినప్పుడు తక్కువ చార్జీలున్న వాటికి (నమ్మకమైన సంస్థలకే పరిమితం) వెళ్లొచ్చు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ పరీక్షలు చేయించుకోవచ్చు. హాస్పిటల్ చార్జీలతో పోలిస్తే 40-50 శాతం తక్కువకే ఎన్నో సంస్థలు ఈ సేవలను ఆఫర్ చేస్తున్నాయి.

జనరిక్ మందులు

వైద్యుల సూచించిన మందులను, హాస్పిటల్ వద్ద నున్న ఫార్మసీల్లోనే తీసుకోవాలని లేదు. ఆ ప్రిస్కిప్షన్‌తో నేరుగా జనరిక్ ఫార్మసీ స్టోర్‌కు వెళ్లి వాటికి ప్రత్యామ్నాయాలను తీసుకోవచ్చు. కంపెనీ ఏదైనా, లోపల అదే మందు ఉంటే చాలు. బ్రాండెడ్ ఔషధాల పేర్లకు బదులు, ఫార్మా ఇంగ్రేడియంట్ పేర్లతోనే రోగులకు మందులు సూచించాలని జాతీయ వైద్య మండలి మార్గదర్శకాలు కూడా ఉన్నాయి. కనుక బ్రాండెడ్ ఔషధాలకు జనరిక్ మందులు మంచి ప్రత్యామ్నాయం. ఫార్మా కంపెనీలు తమ బ్రాండ్లను సిఫారసు చేయాలంటూ వైద్యులను కోరుతుంటాయి. ఇందుకోసం సిబ్బంది, వైద్యులకు ప్రయోజనాల రూపంలో చాలా ఖర్చు చేస్తుంటాయి. దీంతో బ్రాండెడ్ ఔషధాల ధరలు అధికంగా ఉంటాయి. జనరిక్ మందులకు ఈ బెడద లేదు. బ్రాండెడ్‌తో పోలిస్తే 80 శాతం చౌకగా లభిస్తాయి. ప్రధాన మంత్రి భారతీయ జనఔషధి పరియోజన కేంద్రాలు కూడా దేశవ్యాప్తంగా జనరిక్ ఔషధాలను విక్రయిస్తున్నాయి.

తగినంత కవరేజీ

ఒకరి అవసరాలకు తీర్చే, సరిపడా కవరేజీతో హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం ఎంతో ముఖ్యమని మెడి అసిస్ట్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ నిఖిల్ చోప్రా సూచించారు. ఏ పట్టణంలో నివసిస్తున్నారు? వయసు? కుటుంబంలో ఎంత మంది సభ్యులు ఉన్నారు? కుటుంబ ఆరోగ్య చరిత్ర అంశాల ఆధారంగా కవరేజీ ఎంతన్నది నిర్ణయించుకోవాలి. పెళ్లయి, పిల్లలతో మెట్రోల్లో నివసించే వారు కుటుంబం మొత్తానికి మెరుగైన కవరేజీతో ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ తీసుకోవాలి. కనీసం రూ.5-10 లక్షలకు బేస్ ప్లాన్ తీసుకుని, దీనికి రూ.20-25 లక్షలతో సూపర్ టాపప్ ప్లాన్ తీసుకోవాలి. వైద్య ద్రవ్యోల్బణం పెరుగుతున్న తరుణంలో సమ్ అష్యూరెన్స్ (కవరేజీ) చాలుతుందా? లేదా? అన్నది మధ్య మధ్యలో సమీక్షించుకుంటూ ఉండాలి. తీసుకునే హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్ సమగ్రంగా ఉండాలి. మెడికల్, నాన్ మెడికల్ ఖర్చులతోపాటు, ఇంట్లో ఉండి తీసుకునే చికిత్సలకు చెల్లింపులు చేసేలా ఉంటే మంచిది. అలాగే, బీమా సంస్థ హాస్పిటల్స్ నెట్‌వర్క్ పెద్దగా ఉండాలి. అప్పుడు నగదు రహిత చికిత్సలు పొందడానికి వీలుంటుంది. ప్రమాద మరణం, ప్రమాదంలో వైకల్యానికి కవరేజీనిచ్చే రైడర్‌ను జోడించుకోవాలి. కుటుంబంలో గుండె జబ్బులు, కేన్సర్ తదితర వ్యాధుల రిస్క్ ఉంటే, క్రిటికల్ ఇల్‌నెస్ ప్లాన్‌ను సైతం తీసుకోవాలి.

ఓపీడీ/డేకేర్

ఇండెమ్నిటీ ప్లాన్లలో బీమా సంస్థలు హాస్పిటల్‌లో చేరినప్పుడు అయ్యే వ్యయాలకే చెల్లింపులు చేస్తుంటాయి. అలాగే, డేకేర్ ట్రీట్‌మెంట్‌లకు కూడా చెల్లింపులు చేస్తాయి. అంటే హాస్పిటల్‌లో చేరకుండా, చికిత్స తీసుకుని అదే రోజు వెళ్లిపోయే వీలున్నవి. ఇవి కాకుండా, వైద్యం కోసం ప్రజలు చేస్తున్న ఖర్చులో సగం ఔట్ పేషెంట్ రూపంలో (హాస్పిటల్‌లో చేరాల్సిన అవసరం లేకుండా) సేవలపైనే ఉంటున్నట్టు ఆదిత్య బిర్లా హెల్త్ ఇన్సూరెన్స్ సీఈవో మయాంక్ భత్వాల్ తెలిపారు. డాక్టర్ కన్సల్టేషన్ చార్జీలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఔషధాలకు చేస్తున్న వ్యయాలకు బీమా ప్లాన్లలో కవరేజీ ఉండడం లేదు. అందుకుని ఓపీడీ కవరేజీనిచ్చే బీమా ప్లాన్ తీసుకోవాలని భత్వాల్ సూచించారు. ''మీ బీమా ప్లాన్ ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్ (ఓపీడీ) వ్యయాలకు కవరేజీ ఇవ్వకపోతే, అప్పుడు హాస్పిటల్స్‌కు వెళ్లొద్దు. క్లినిక్‌లకు వెళ్లండి. ఎందుకంటే హాస్పిటల్స్ అయితే చార్జీలపై 18 శాతం జీఎస్‌టీ కూడా విధిస్తాయి''అని మిశ్రా వివరించారు. బీమా ప్లాన్‌లో రీస్టోరేషన్ సదుపాయం కూడా ఉండాలి. ఒక పాలసీ సంవత్సరంలో కవరేజీ మొత్తం ఖర్చయిపోతే, తిరిగి మరోసారి హాస్పిటల్‌లో చేరాల్సి వస్తే అప్పుడు ఈ రీస్టోరేషన్ (నూరు శాతం కవరేజీని పునరుద్ధరించేవి) సాయపడుతుంది. హాస్పిటల్‌లో చేరినప్పుడు డైలీ క్యాష్ బెనిఫిట్‌ను కొన్ని పాలసీలు ఇస్తున్నాయి. ఆస్పత్రిలో ఉన్నప్పుడు కవరేజీ పరిధిలోకి రాని వాటి కోసం ఈ మొత్తాన్ని ఖర్చు చేసుకోవచ్చు. ఇప్పటికే ప్లాన్ తీసుకుని, అందులో ఈ ఫీచర్లు లేకపోతే పోర్టింగ్ ద్వారా అన్ని ఫీచర్లు ఉన్న ప్లాన్‌కు మారిపోవడం మంచి మార్గం.

క్యాష్‌లెస్ ఆస్పత్రులు

బీమా కంపెనీ నెట్‌వర్క్ పరిధిలోని ఆస్పత్రికి వెళ్లడం ద్వారా తమపై పడే వ్యయాలను పాలసీదారులు తగ్గించుకోవచ్చు. బీమా సంస్థలకు దేశవ్యాప్తంగా వందల సంఖ్యలో ఆస్పత్రులతో భాగస్వామ్యం ఉంటుంది. వాటిలో చేరితే పాలసీదారులకు తక్కువ చార్జీలు అమలవుతాయి. దీనివల్ల అటు బీమా సంస్థకు, పాలసీదారుకు ప్రయోజనం ఉంటుంది. నగదు రహిత వైద్య సేవలతోపాటు, పాలసీదారు తన వంతుగా చెల్లింపులు చేయాల్సి వస్తే వాటిపైనా తక్కువ చార్జీలు పడతాయి. కన్స్యూమబుల్స్ చార్జీలు విధించవు. లేదా చాలా పరిమితంగా వేస్తాయి. నెట్‌వర్క్ హాస్పిటల్స్‌కే పాలసీదారులు వెళ్లేలా చూడడం కోసం.. కొన్ని బీమా కంపెనీలు నాన్ నెట్‌వర్క్ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటే కో-పేమెంట్ (బిల్లులో కొంత మొత్తం పాలసీదారు చెల్లించేలా) షరతు విధిస్తున్నాయి.

కో-పే, డిడక్టబుల్

హెల్త్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను కో-పేమెంట్ లేదా డిడక్టబుల్ ఆప్షన్లతో తీసుకుంటే ప్రీమియం తక్కువగా ఉంటుంది. కానీ, చికిత్సలు అవసరమైనప్పుడు పాలసీదారు తన వంతు వాటాగా చెల్లించే మొత్తం ఎక్కువగా ఉంటుంది. కో-పే లేదా డిడక్టబుల్ అన్నవి నిర్ణీత మొత్తం దాటినప్పుడు అమల్లోకి వచ్చేవి. అందుకని తక్కువ కో-పే/డిడక్టబుల్ ఉన్న వాటినే ఎంపిక చేసుకోవాలి. ప్రీమియం భారం లేదనుకుంటే, కో-పే లేని ప్లాన్‌కు వెళ్లాలి.

హాస్పిటల్ రూమ్



పాలసీదారుడు హాస్పిటల్‌లో చేరినప్పుడు వైద్యేతర ఖర్చులకు (నాన్ మెడికల్) బీమా కంపెనీలు చెల్లింపులు చేయవు. రోగి రూమ్‌లో ఉన్నప్పుడు ఇచ్చే టిష్యూ, హ్యాండ్ వాష్, టూత్ పేస్ట్ తదితర ఉత్పత్తులతోపాటు, హౌస్ కీపింగ్ చార్జీలు పాలసీలో కవర్ కావు. అలాగే, హాస్పిటల్‌లో చేరేందుకు రిజిస్ట్రేషన్ చార్జీలు, పోషకాహార నిపుణుడి చార్జీలు, కాటన్, బ్యాండేజీలు, డిస్పోజబుల్‌కు బీమా సంస్థల చెల్లింపులు చేయవు. అయితే, వీటికి సైతం చెల్లింపులు చేసే ఆప్షన్‌ను బీమా సంస్థలు కొన్ని అందిస్తున్నాయి. ఇందుకోసం కొంత అదనపు ప్రీమియం వసూలు చేస్తాయి. హాస్పిటల్‌లో అన్ని చార్జీలు రూమ్ విభాగం ఆధారంగానే ఉంటాయని నివాబూపాకు చెందిన బబతోష్ మిశ్రా తెలిపారు. డాక్టర్ ఫీజులు, ఐసీయూ అడ్మిషన్ చార్జీలు, ఆహారం, ఇతర సేవలకు చార్జీలను రూమ్ కేటగిరీ ఆధారంగానే విధిస్తారు. సింగిల్ రూమ్‌కు బదులు ట్విన్ షేరింగ్ ఎంపిక చేసుకుంటే, అప్పుడు పాలసీదారు తాను సొంతంగా చెల్లించాల్సిన చార్జీలు చాలా వరకు తగ్గుతాయి. ఒకవేళ పాలసీలో సింగిల్ ఏసీ ప్రైవేటు రూమ్ అనే నిబంధన ఉంటే, దీనికంటే ఎగువ కేటగిరీ అయిన డీలక్స్ రూమ్‌లో చేరి చికిత్స పొందినప్పుడు, చార్జీలు కూడా అధికంగా పడతాయి. అప్పుడు పాలసీదారు జేబు నుంచి చెల్లించే మొత్తం పెరిగిపోతుంది.

రైడర్లు



ఎప్పుడో హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుని, అందులో అన్ని రకాల ఫీచర్లు లేకపోతే.. అలాంటి అన్ని సదుపాయాలను ఆఫర్ చేస్తున్న బీమా కంపెనీకి పోర్ట్ ద్వారా మారిపోవాలి. పోర్టింగ్‌తో వేరే కంపెనీకి మారే ఉద్దేశ్యం లేకపోతే అప్పుడు అదనపు కవరేజీలను ఆఫర్ చేసే రైడర్లు తీసుకోవడం ద్వారా, చికిత్సలు అవసరమైనప్పుడు తమపై పడే భారాన్ని తగ్గించుకోవచ్చు. అన్ని యాడాన్‌లు అందరికీ ఉద్దేశించినవి కావు. అవసరమైన రైడర్లను జోడించుకోవచ్చు. ప్రస్తుత ప్లాన్‌లో రూమ్ రెంట్‌కు పరిమితులు ఉంటే, అప్పుడు రూమ్‌రెంట్ వేవర్ రైడర్ తీసుకోవాలి. డైలీ క్యాష్, కన్స్యూమబుల్స్ కవరేజీలను కూడా ఎంపిక చేసుకోవాలి.

డిస్కౌంట్స్



హాస్పిటల్స్ డిజిటల్ సేవలపై తగ్గింపులను ఆఫర్ చేస్తున్నాయి. కొన్ని ఆన్‌లైన్‌లో అపాయింట్‌మెంట్‌పై 10 శాతం డిస్కౌంట్ ఇస్తున్నాయి. డిస్కౌంట్‌తో కూడిన హెల్త్‌కార్డ్‌లను ఆఫర్ చేసేవీ ఉన్నాయి. ఫార్మసీ బిల్లులపైనా తగ్గింపు ఇస్తున్నాయి. ఇలాంటివి తెలుసుకుని వాటిని పొందడం ద్వారా ఖర్చుల భారం తగ్గించుకోవచ్చు.

డీమ్యాట్ ఖాతాలు జూమ్

- అక్టోబర్‌కల్లా 41 శాతం ప్లస్
- 10.4 కోట్లకు మొత్తం ఖాతాలు
- కొద్ది నెలలుగా తగ్గిన స్పీడ్



న్యూఢిల్లీ: గత కొద్ది నెలలుగా మ్యాట్ ఖాతాల స్పీడ్ తగ్గుతున్నప్పటికీ 2022 అక్టోబర్‌కల్లా ఇవి 10.4 కోట్లను తాకాయి. వెరసి 2021 అక్టోబర్‌లో నమోదైన 7.4 కోట్ల ఖాతాలతో పోలిస్తే 41 శాతం జంప్ చేశాయి. ఈక్విటీ మార్కెట్లు అందిస్తున్న ఆకర్షణీయ రాబడులు ప్రభావం చూపుతున్నట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. నిజానికి 2022 ఆగస్ట్ నుంచి కొత్త డీమ్యాట్ ఖాతాలు నీరసిస్తున్నాయి. ఈ నెలలో కొత్తగా 26 లక్షలు జతకాగా.. సెప్టెంబర్‌లో ఇవి 20 లక్షలకు తగ్గాయి. అక్టోబర్‌లో మరింత నీరసించి 18 లక్షలు మాత్రమే జమయ్యాయి. మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ విశ్లేషణ ప్రకారం 2021 అక్టోబర్‌లో 36 లక్షల డీమాట్ ఖాతాలు కొత్తగా ప్రారంభమయ్యాయి. ఇందుకు ప్రధానంగా పబ్లిక్ ఇష్యూల జోరు తగ్గడం కారణమైనట్లు ఆనంద్ రాఠీ షేర్స్ అండ్ స్టాక్ బ్రోకర్స్ నిపుణులు రూప్ భూత్రా పేర్కొన్నారు. ప్రపంచ పరిణామాలతో ఈ ఏడాది దేశీ స్టాక్ మార్కెట్లు ఆటుపోట్లకు లోనుకావడం, మార్కెట్లను మించి మిడ్, స్మాల్ క్యాప్స్ బలహీనపడటం వంటి అంశాలు ఇన్వెస్టర్లపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నట్లు విశ్లేషించారు.

ఇతర కారణాలున్నాయ్

రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధ వాతావరణం కారణంగా ఈ ఏడాది జనవరి నుంచీ డీమాట్ ఖాతాల స్పీడ్ తగ్గినట్లు మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ నిపుణులు నితిన్ అగర్వాల్ తెలియజేశారు. మరోవైపు అంతర్జాతీయ స్థాయిలో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, వడ్డీ రేట్లు పెరగడం ఆందోళనలకు దారితీసినట్లు పేర్కొన్నారు. ఇలాంటి అనిశ్చితుల నేపథ్యంలో బ్రోకర్లు కస్టమర్లను ఆకట్టుకునే ప్రణాళికలపై వ్యయాలను తగ్గించినట్లు వివరించారు. గతేడాది అక్టోబర్‌తో పోలిస్తే ఈ ఏడాది ఇదే నెలలో కొత్తగా ప్రారంభమైన డిమ్యాట్ ఖాతాలు సగానికి పడిపోవడానికి పండుగల సీజన్ ప్రభావం చూపింది. 2022 అక్టోబర్‌లో 18 రోజులు మాత్రమే మార్కెట్లు పనిచేశాయి. సెలవులను మినహాయిస్తే సెప్టెంబర్‌లో 22 రోజులపాటు ట్రేడింగ్ జరిగింది. దేశీయంగా ఈక్విటీ మార్కెట్లు బలోపేతం కానుండటం, మరింతమంది మార్కెట్లలోకి ప్రవేశించే వీలు వంటి అంశాలు ఇందుకు దోహదం చేయనున్నట్లు అభిప్రాయపడ్డారు.

యాత్రా ఆన్‌లైన్ ఐపీవోకు ఓకే

సెబీ గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ: ప్రయాణ సంబంధ సేవలందించే యాత్రా ఆన్‌లైన్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి గ్రీన్‌సిగ్నల్ పొందింది. యాత్రా ఆన్‌లైన్ ఇంక్‌కు దేశీ అనుబంధ సంస్థ అయిన కంపెనీ ఇష్యూలో భాగంగా రూ. 750 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 93,28,358 షేర్లను కంపెనీలో ఇప్పటికే పెట్టుబడులున్న సంస్థలు విక్రయానికి ఉంచనున్నాయి. ఈక్విటీ జారీ నిధులను వ్యూహాత్మక కొనుగోళ్లు, కస్టమర్లను ఆకట్టుకునే పెట్టుబడులు తదితర వృద్ధి అవకాశాలకు వినియోగించనుంది. 700 భారీ కంపెనీలు కస్టమర్లుగా కలిగిన యాత్రా ఆన్‌లైన్ దేశీయంగా కార్పొరేట్ ట్రావెల్ సర్వీసుల విభాగంలో ముందుంది.

స్టాక్స్ వ్యూ

ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ | వెంచురా సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 251 టార్గెట్: రూ. 729

ఎందుకంటే: కంపెనీ షేరు చాలా కాలంగా మార్కెట్ల స్థాయిలో లాభపడిందిలేదు. కంపెనీ యాజమాన్య వ్యూహాలు ఇన్వెస్టర్లలో ఆందోళనలు పెంచడం ప్రభావం చూపుతూ వస్తోంది. కంపెనీ బీవోటీ ప్రాజెక్టులనే అత్యధికంగా చేపడుతుందన్న అంచనాలు దీనికి కారణం. ఇవి బ్యాలన్స్‌షీట్‌పై ఆర్థికపరమైన ఒత్తిడిని పెంచుతాయన్నది ఇన్వెస్టర్ల ఆలోచనకాగా.. కొద్ది రోజులుగా యాజమాన్యం విభిన్న వ్యూహాలు అమలు చేస్తోంది. బ్యాలన్స్‌షీట్‌పై ఒత్తిడిని తగ్గించే చర్యలను చేపడుతూ వస్తోంది. వీటిలో భాగంగా ఇన్విట్స్, ప్రయివేట్ ఇన్విట్‌కు తెరతీసింది. ప్రయివేట్ ఇన్విట్‌లో 51 శాతం వాటాను కలిగి ఉంటూనే ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజం జీఐసీతో భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకుంది. ఇటీవల ప్రిఫరెన్షియల్ కేటాయింపుల ద్వారా రూ. 5,347 కోట్లు సమకూర్చుకుంది. దీనిలో భాగంగా ఫెరోవియల్ అనుబంధ సంస్థ సింట్రాకు 24.9% వాటాను విక్రయించింది. పబ్లిక్ ఇన్విట్‌లో 16% వాటాను కలిగి ఉంటూ మరో 16.9% జీఐసీకి కేటాయించింది. ఇటీవల జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) కాంట్రాక్టుల జారీని వేగవంతం చేసే సన్నాహాలు ప్రకటించింది. కాగా.. హోల్డింగ్ కంపెనీగా చూస్తే ఐఆర్‌బీ నికర రుణరహితంగా కనిపిస్తోంది. కంపెనీ రుణ వ్యయాలు 9.8% చొప్పున తగ్గనున్నాయి. మా అంచనా ప్రకారం రానున్న మూడేళ్లలో మొత్తం రుణ భారం ప్రస్తుత రూ. 13,823 కోట్ల నుంచి రూ. 13,232 కోట్లకు తగ్గనుంది.

ఏపీఎల్ అపోలో ట్యూబ్స్ | మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ | కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 1,090 టార్గెట్: రూ. 1,330

ఎందుకంటే: వ్యక్తిగత గృహ, వాణిజ్య సముదాయాలు, వేర్‌హౌస్‌లు, ఫ్యాక్టరీలు, వ్యవసాయం సహా ఇతర మౌలిక సదుపాయ విభాగాలలో వ్యవస్థాగత స్టీల్ ట్యూబ్స్ వినియోగం పలు రకాలుగా పెరుగుతోంది. దీంతో కంపెనీ దీర్ఘకాలిక వృద్ధి కొనసాగనుంది. అధిక స్టీల్ ధరల కారణంగా గత త్రైమాసికంలో అటు పరిశ్రమ, ఇటు కంపెనీ నిల్వలను తగ్గించుకునేందుకు ప్రాధాన్యమిచ్చాయి. అయితే ఇటీవల స్టీల్ ధరల దిద్దుబాటు నేపథ్యంలో తిరిగి ఇన్వెంటరీకి ప్రాధాన్యమిస్తున్నాయి. స్టీల్ ధరల నిలకడ లేదా స్వల్ప పెరుగుదల అంచనాల నేపథ్యంలో ప్రొడక్టుల రీస్టాకింగ్ ఊపందుకుంటోంది. మరోవైపు మొత్తం డిమాండ్ వాతావరణం పటిష్టంగా కనిపిస్తోంది. ప్రధాన స్టీల్(హాట్ రోల్డ్ క్వాయిల్స్) ధరలు చరిత్రాత్మక గరిష్టాల నుంచి దిగివస్తున్నాయి. వెరసి ప్రైమరీ, సెకండరీ స్టీల్ ధరల మధ్య వ్యత్యాసం తగ్గుతోంది. వివిధ రంగాల నుంచి కంపెనీ ప్రొడక్టులకు డిమాండు ఊపందుకోనున్న అంచనాలు బలపడుతున్నాయి. వీటి ఫలితంగా కంపెనీ వృద్ధి బాటలో సాగే వీలుంది. పటిష్ట పంపిణీ వ్యవస్థ దన్నుతో ప్రొడక్టుల అమ్మకాలు మరింత విస్తరించనున్నాయి. విలువ జోడింపు ఉత్పత్తుల అమ్మకాల వాటా పెరగనుండటంతో కంపెనీ లాభదాయకతకు బూస్ట్ లభించే అవకాశముంది. కొత్తగా ఆవిష్కరించిన అపోలో మార్ట్, రాయ్‌పూర్ యూనిట్ నుంచి వెలువడే ప్రొడక్టులు మార్జిన్ల మెరుగుకు దోహదపడనున్నాయి. తద్వారా అధిక నగదు సాధనకూ వీలుంది.

గమనిక: షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే..

హెచ్‌డీఎఫ్‌సీ బిజినెస్ సైకిల్ ఫండ్

హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ తాజాగా బిజినెస్ సైకిల్ ఫండ్ పేరిట కొత్త ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ ఎన్ఎఫ్‌వో నవంబర్ 25తో ముగుస్తుంది. సానుకూల పరిస్థితుల్లోకి మళ్లుతున్న వ్యాపారాల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మెరుగైన రాబడులు అందించేందుకు ఈ ఫండ్ కృషి చేస్తుంది. వ్యాపార పరిస్థితులు మెరుగ్గా ఉన్నప్పుడు ఇన్వెస్టర్లు ఇటు కంపెనీల ఆదాయ వృద్ధిపరంగాను, అటు వేల్యుయేషన్ల వృద్ధిపరంగాను ఒనగూరే ప్రయోజనాలను అందుకోవచ్చని హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ ఎండీ నవనీత్ మునోత్ తెలిపారు. మూడేళ్ల అంతకు పైబడిన వ్యవధి కోసం ఇన్వెస్ట్ చేయదల్చుకునే వారికి ఇది అనువైనదిగా ఉండనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

21-11-2022	
విశాఖ	522-00
చిత్తూరు	558-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	519-00
విజయవాడ	519-00
రిటైల్ ధర (డజను)	78.00
20-11-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

రిటైర్మెంట్ తర్వాత స్థిరమైన ఆదాయానికి..



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్

స్మాల్‌క్యాప్ విభాగంలో పదుల సంఖ్యలో పథకాలున్నాయి. కనుక ఒకటికి మించిన స్మాల్‌క్యాప్ పథకాల్లో పెట్టుబడులు చేసుకోవచ్చా? ఎందుకంటే అసెస్‌మెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలన్నవి ఒక్కోటీ వేర్వేరు వెలుగు చూడని జెమ్స్ లాంటి కంపెనీలను గుర్తించొచ్చు కదా..? - యోగేష్

పెట్టుబడులన్నవి ఎల్లప్పుడూ చాలా సులభంగా ఉండాలి. మేము అనుసరించే సూత్రం ఇదే. స్మాల్ క్యాప్ పెట్టుబడుల్లో వైవిధ్యం పాటించొచ్చా? అన్నది మీ ప్రశ్న. పూర్తి స్థాయి పోర్ట్‌ఫోలియో నిర్మాణానికి వివిధ మార్కెట్ క్యాప్ సైజుల నుంచి నాలుగు లేదా ఐదు పథకాలను సూచిస్తుంటాం. చిన్న పోర్ట్‌ఫోలియో అయితే ఒక్కో కేటగిరీ నుంచి ఒక పథకాన్ని కలిగి ఉండొచ్చు. పెద్ద పోర్ట్‌ఫోలియో అయితే ఒకే విభాగం నుంచి రెండు పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. వేర్వేరు పథకాల మధ్య వైవిధ్యాన్ని, వైరుధ్యాన్ని గమనించి, ఆయా పథకాల పట్ల నమ్మకం ఏర్పడితే రెండు స్మాల్‌క్యాప్ పథకాల్లో పెట్టుబడులను పరిశీలించొచ్చు. ఇలా రెండు పథకాలను ఎంపిక చేసుకున్నప్పుడు వాటి పెట్టుబడుల పరంగా ఏకరూపత (ఒకే స్టాక్స్) 50% మించి ఉండకూడదు. ఏకరూపత అంటే రెండు స్మాల్‌క్యాప్ పథకాలు అవే కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం. ఇంతకు మించితే పోర్ట్‌ఫోలియోకు రిస్క్ పెరుగుతుంది. ఈ రిస్కును వైవిధ్యం చేసుకునేందుకు.. వేర్వేరు పెట్టుబడుల విధానంతో కూడిన వేర్వేరు అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీలకు సంబంధించి రెండు పథకాలను ఎంపిక చేసుకోవచ్చు. దీనివల్ల ఏకరూపత రిస్క్ తగ్గుతుంది. మొత్తంపెట్టుబడుల్లో స్మాల్‌క్యాప్ విభాగానికి 20% మించకుండా చూసుకోవాలి.

నా వయసు 62 ఏళ్లు. స్థిరమైన ఆదాయం కోసం పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నాను. నాకు ఉన్న మార్గాలు ఏంటి? - నారాయణ

విశ్రాంత జీవనాన్ని ప్రశాంతంగా గడపాలంటే అందుకు తగినంత నిధిని సమకూర్చుకుని ఉండాలి. ఈ నిధి నుంచి క్రమం తప్పకుండా ఆదాయం పొందడం ద్వారా సౌకర్యవంతమైన జీవితాన్ని గడపొచ్చు. సీనియర్ సిటిజన్లు సహజంగా సంప్రదాయ మార్గాలనే ఎంపిక చేసుకుంటూ ఉంటారు. అత్యవసరాల్లో కావాల్సినప్పుడు వెంటనే పొందే లిక్విడిటీ ఉండాలని కోరుకుంటారు. ఇన్వెస్ట్ చేయడానికి ముందు ప్రతీ నెలా ఎంత మొత్తం కావాలో నిర్ణయించుకోవాలి. ఇతర మార్గాల ద్వారా ఏదైనా ఆదాయం వస్తుంటే దానిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అంటే అద్దె రూపంలో ఆదాయం, పెన్షన్ లేదా మరొకటి కావచ్చు. ఒకవేళ ఏటా 4-6 శాతానికంటే ఎక్కువ రాబడి కోరుకుంటుంటే అంచనాలను తగ్గించుకోవాల్సిందే. ఉదాహరణకు మీ పెట్టుబడి నిధి రూ.కోటి ఉందనుకుంటే వార్షికంగా ఉపసంహరించుకునే మొత్తం రూ.6 లక్షలకు మించి ఉండకూడదు. ఒకవేళ 6 శాతానికి మించి వెనక్కి తీసుకుంటే ఆ తర్వాతి సంవత్సరాల్లో తక్కువ ఆదాయానికి సిద్ధం కావాల్సిందే. ద్రవ్యోల్బణాన్ని విస్మరించడానికి లేదు. నేడు నెలవారీ ఖర్చులకు రూ.50,000 సరిపోతుంటే.. 5, 10, 15 ఏళ్ల తర్వాత ఈ మొత్తం చాలదు. ఆ సమయంలో ఇంకాస్త అధికంగా కావాల్సి ఉంటుంది. అందుకనే రిటైర్మెంట్ తీసుకున్న వారు ద్రవ్యోల్బణాన్ని తట్టుకుని రాబడులను ఇచ్చే మార్గాలను చూసుకోవాలి. అందుకని రిటైర్మెంట్ తర్వాత కూడా ఈక్విటీల్లో పెట్టుబడులు కొనసాగించాలి. అప్పుడే దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణం మించి రాబడులకు అవకాశం ఉంటుంది. పెట్టుబడుల మొత్తాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయకూడదు. 30-40% చాలు. మిగతా మొత్తాన్ని ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల్లోనే ఉంచాలి. ప్రభుత్వ హామీతో కూడిన పథకాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్‌స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్), ప్రధానమంత్రి వయవందన యోజన, పోస్టాఫీసు నెలవారీ ఆదాయ పథకాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. ఒక ఇన్వెస్టర్ ఈ పథకాలు అన్నింటిలోనూ కలిపి రూ.34.5 లక్షలు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. మిగిలిన మొత్తాన్ని అధిక నాణ్యతతో కూడి డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి.

ఘనంగా కెనరా బ్యాంక్ 117వ వ్యవస్థాపక దినోత్సవం

బెంగళూరు: ప్రభుత్వ రంగ కెనరా బ్యాంక్ 117వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. బెంగళూరు ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంక్ వ్యవస్థాపకుడు దివంగత అమ్మెంబళ్ సుబ్బారావు పాయ్‌కు ఘనంగా నివాళులర్పించారు. బ్యాంక్ 117 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణాన్ని విజవంతంగా పూర్తి చేసుకోవడంలో ఖాతాదారుల పాత్ర అమోఘమైందని బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ ఎల్‌వీ ప్రభాకర్ తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా క్యూర్ ఇంటర్నేషనల్ ఇండియా ట్రస్ట్‌కు ఆర్థిక చేయూతను అందించినట్లు తెలిపారు. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న స్వచ్ఛంద సంస్థ చిరంతనకు కూడా ఆర్థిక సాయాన్ని అందించినట్లు ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఉన్నతాధికారులు, పలు రాష్ట్రాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీరాముడితో చంద్రబాబుకు పోలికా!

టీడీపీ నేత అయ్యన్నపాత్రుడుపై బీజేపీ మండిపాటు

సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబును ఆ పార్టీ నేత అయ్యన్నపాత్రుడు ఏకంగా శ్రీరాముడితో పోల్చడాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుబట్టింది. ఈ మేరకు బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహరావు ఆదివారం ట్విట్టర్ ద్వారా స్పందించారు. 'భగవంతుడయిన శ్రీరాముడితో చంద్రబాబును పోలుస్తూ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నాను. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే సహించేది లేదు. ఇతర పార్టీల పొత్తు కోసం పరితపిస్తూ ఈ బిల్డప్ ఏంటి? మీ నాయకుడి ఆరాటం లోక కళ్యాణం కోసం కాదు.. లోకేశ్ కళ్యాణార్థం అని అందరికీ తెలుసు' అని పేర్కొన్నారు.

వాయుగుండంగా మారిన తీవ్ర అల్పపీడనం

సాక్షి, అమరావతి/విశాఖపట్నం/వాకాడు: ఆగ్నేయ బంగాళాఖాతానికి ఆనుకుని నైరుతి బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం ఆదివారం వాయుగుండంగా బలపడింది. ఇది గంటకు 12 కిలోమీటర్ల వేగంతో ఉత్తర వాయవ్య దిశగా కదులుతోంది. ఆదివారం రాత్రికి శ్రీలంకలోని జాఫ్నాకు తూర్పుగా 560 కిలోమీటర్లు, చెన్నైకి తూర్పు ఆగ్నేయ దిశగా 570 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ వాయుగుండం అదే తీవ్రతతో నెమ్మదిగా కొనసాగుతూ రానున్న 24 గంటల్లో ఉత్తర వాయవ్య దిశగా ఉత్తర తమిళనాడు, దక్షిణ కోస్తాంధ్ర తీరాల వైపు పయనిస్తుందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. అనంతరం క్రమంగా అల్పపీడనంగా బలహీనపడుతుందని అంచనా వేసింది. దీని ప్రభావంతో సోమ, మంగళవారాల్లో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో అనేక చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఉత్తర కోస్తాంధ్రలో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలకు అవకాశం ఉందని పేర్కొంది. రెండు రోజులు దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఉరుములు, మెరుపులు కూడా సంభవించే అవకాశం ఉందని వివరించింది. మరోవైపు వాయుగుండం ప్రభావంతో తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 కిలో మీటర్లు, గరిష్ఠంగా 65 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, సముద్రం అలజడిగా ఉంటుందని తెలిపింది. మత్స్యకారులు మంగళవారం వరకు దక్షిణ కోస్తా-తమిళనాడు తీరం వెంబడి వేటకు వెళ్లవద్దని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ అంబేడ్కర్ తెలిపారు. మరోవైపు వాయుగుండం ప్రభావంతో కోస్తా జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోయాయి. రానున్న రెండు రోజులు ఉష్ణోగ్రతలు మరింత తగ్గి చలి బాగా పెరిగే అవకాశం ఉంది.

అల్లకల్లోలంగా సముద్రం

వాయుగుండం ప్రభావంతో ఆదివారం తిరుపతి జిల్లాలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. చిల్లకూరు, కోట, వాకాడు, సూళ్లూరుపేట, తడ మండలాల తీర ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ధనవంతులూ వలసబాట



హెన్లీ గ్లోబల్ సిటిజన్ రిపోర్టు వెల్లడి

అది పేదలకే పరిమితం కాదు.. పెద్దలకూ తప్పడంలేదు

- 2022లో ప్రపంచవ్యాప్తంగా 88 వేల మంది అవకాశాల కోసం ఇతర దేశాలకు వెళ్తారని అంచనా
- కనీసం 10 లక్షల డాలర్ల పెట్టుబడి పెట్టే వ్యక్తుల డేటా విశ్లేషణ
- రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఫలితంగా ఆ దేశాల నుంచి ఎక్కువ మంది ధనికులు వలసబాట
- మన దేశం నుంచి 8 వేల మంది కోటీశ్వరులు వలస వెళ్తారని అంచనా
- వలస వెళ్తున్న పెట్టుబడిదారుల తొలి చిరునామా యూఏఈ.. తర్వాత స్థానంలో ఆస్ట్రేలియా

(ఎం. విశ్వనాథరెడ్డి, సాక్షి ప్రతినిధి)

పొట్ట చేతబట్టుకుని బతుకుదెరువు వెతుక్కుంటూ పేదలు వలస వెళ్లడం మనం ఎప్పుడూ చూసేదే. వ్యాపార అవకాశాలను, సౌకర్యాలను, పన్ను రాయితీలను వెతుక్కుంటూ కోటీశ్వరులు కూడా వలసబాట పట్టడం కూడా ఎప్పుడూ ఉన్నదే. సాధారణంగా పేదలు దేశంలోనే ఒక ప్రాంతం నుంచి ఒక ప్రాంతానికి వలస వెళ్తారు. ధనవంతులు అందుకు భిన్నంగా వ్యాపార అవకాశాలు పుష్కలంగా ఉన్న దేశాలకు వెళ్తారు. కానీ, పత్రికల్లో పేదల వలసలే పతాక శీర్షికలవుతాయి. పెద్దల వలసల గురించి వార్తలు పెద్దగా కనిపించవు. కరోనా మహమ్మారి విసిరిన సవాళ్లకు బెదిరి.. మన దేశంలో కోట్ల మంది పేదలు వలసబాట పట్టారు. కానీ, కోటీశ్వరులు మాత్రం కరోనా సమయంలో వలస బాటపట్టలేదు. ఉన్న దేశం నుంచి కదల్లేదు. కరోనా శాంతించిన వెంటనే అవకాశాలు వెతుక్కుంటూ రెట్టింపు సంఖ్యలో ప్రపంచవ్యాప్తంగా తమకు అనుకూలంగా ఉన్న దేశాలకు వలస వెళ్లడం ప్రారంభించారు. 2022లో 88వేల మంది హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (10 లక్షల డాలర్ల సంపద కలిగి ఉన్న వ్యక్తులు) తమ మాతృదేశాన్ని వదిలి మరో దేశానికి వలస వెళ్తారని 'హెన్లీ గ్లోబల్ సిటిజన్ రిపోర్ట్' అంచనా వేసింది. ధనవంతుల వలసలు పెరుగుతాయే తప్ప కనుచూపు మేరలో తగ్గే అవకాశంలేదని చెప్పింది. ధనవంతులంతా ఏ దేశం నుంచి ఏ దేశం వెళ్తున్నారనే విషయం ఆసక్తికరం. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఎక్కువమందిని ఆకర్షిస్తోంది. ఆ దేశం అనుసరిస్తున్న టైలర్‌మేడ్ వలస విధానాలు ప్రపంచవ్యాప్తంగా ప్రతిభావంతులను, ధనవంతులను ఆకర్షించడానికి కారణంగా నిలుస్తున్నాయి. రెండోస్థానంలో ఉన్న ఆస్ట్రేలియాలో చౌకగా వైద్యం అందుబాటులో ఉండటం, వారసత్వ పన్ను లేకపోవడం, మంచి ఆర్థికవ్యవస్థ కావడం.. ధనవంతులను ఆకర్షిస్తున్న కారణాలని నిపుణులు చెబుతున్నారు. గత రెండు దశాబ్దాల్లో వివిధ దేశాల నుంచి 80 వేల మంది కోటీశ్వరులు ఆస్ట్రేలియాకు వలస వెళ్లారని నివేదిక పేర్కొంది.

రష్యా, ఉక్రెయిన్ నుంచి అధికంగా..


ఇక రష్యా, ఉక్రెయిన్ యుద్ధంవల్ల ఆ రెండు దేశాల నుంచి కోటీశ్వరులు పెద్ద సంఖ్యలో వలస వెళ్తున్నారు. ఉక్రెయిన్‌లోని కోటీశ్వరుల్లో 42 శాతం మంది వలసబాట పడతారని అంచనా వేస్తున్నారు. అలాగే, రష్యాలో 15 శాతం మంది కోటీశ్వరులు దేశం విడిచిపెట్టి వెళ్తారని అంచనా. మిగతా అన్ని దేశాలు రెండు శాతం, అంతకంటే తక్కువ మంది కోటీశ్వరులు వలస వెళ్లొచ్చని భావిస్తున్నారు. భారత్ నుంచి వలస వెళ్తారని అంచనా వేస్తున్న 8 వేల మంది, దేశంలోని మొత్తం కోటీశ్వరుల్లో 2 శాతం అని నివేదిక పేర్కొంది.

ధనవంతులను ఆకర్షిస్తున్న యూఏఈ


యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రపంచంలోని అన్ని దేశాల ధనవంతులను ఆకర్షిస్తోంది. దీని కోసం..

- వీసా నిబంధనలను సరళతరం చేసింది.
- 5.44 లక్షల యూఎస్ డాలర్ల విలువైన ఆస్తి కొనుగోలు చేసే వారికి 10 సంవత్సరాల గోల్డెన్ వీసా ఇస్తున్నారు.
- 2.72 లక్షల డాలర్లు యూఏఈ స్టార్టప్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టేవారికీ గోల్డెన్ వీసాకు అర్హత ఉంటుంది.
- ప్రపంచంలో ఎక్కడైనా తమ స్టార్టప్ కంపెనీని 1.9 మిలియన్ డాలర్లకు విక్రయించిన వారికి కూడా గోల్డెన్ వీసా తీసుకోవడానికి అర్హత కల్పిస్తూ యూఏఈ నిబంధనలను సడలించింది.
- కంపెనీలు ఏర్పాటు చేసుకోవడానికే కాకుండా, ప్రతిభావంతులైన సిబ్బందిని ప్రపంచం నలుమూలల నుంచి తెచ్చుకోవడానికి కూడా యూఏఈ అవకాశం కల్పిస్తోంది.
- ఇక ఔత్సాహిక పారిశ్రామికవేత్తలనే కాకుండా, శాస్త్రవేత్తలు, ప్రొఫెషనల్స్, వివిధ రంగాల్లో అత్యంత ప్రతిభావంతులకు ఆహ్వానం పలుకుతోంది.

2022లో ఏ దేశానికి ఎంతమంది కోటీశ్వరులు వలస వెళ్తారంటే..



2022లో ఏ దేశం నుంచి ఎంతమంది ధనవంతులు వలస వెళ్తున్నారంటే..



రేస్ లేకుండానే ముగిసిన లీగ్

ప్రమాదం కారణంగా అర్ధంతరంగా ఆగడంతో ప్రేక్షకులకు నిరాశ

సాక్షి, హైదరాబాద్: ఇండియన్ రేసింగ్ లీగ్... గత కొద్ది రోజులుగా భాగ్యనగరంలో చర్చగా మారిన స్పోర్ట్స్ ఈవెంట్! శనివారమే లీగ్‌లో భాగంగా క్వాలిఫయింగ్‌తోపాటు ఒక ప్రధాన రేసు జరగాల్సి ఉన్నా... వేర్వేరు కారణాలతో అన్నింటినీ ఆదివారానికి వాయిదా వేశారు. వీకెండ్‌లో ఉత్సాహంగా పెద్ద సంఖ్యలో అభిమానులు హుస్సేన్ సాగర్ తీరానికి తరలి వచ్చి 'స్ట్రీట్ సర్క్యూట్'లో రేసింగ్ పోటీలను తిలకించేందుకు సిద్ధమయ్యారు. అయితే అనూహ్యంగా జరిగిన ఒక ఘటన తొలి అంచెలో మూడు రేసులను ముగించింది. అప్పటికి ఇంకా క్వాలిఫయింగ్ రేసులు ప్రారంభమే కాలేదు. ప్రాక్టీస్ మాత్రమే సాగుతోంది. అయితే మధ్యాహ్నం 3 గంటల సమయంలో చెన్నై జట్టుకు చెందిన డ్రైవర్ విష్ణు ప్రసాద్ కారు ప్రమాదానికి గురైంది. దాంతో అతడిని వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. బ్రేక్‌ల సమస్యే ఇందుకు కారణమని తేలింది. ప్రాక్టీస్ సమయంలో వుల్ఫ్ జీబీ08 థండర్స్ కారు బ్రేక్‌లు ఆశించిన రీతిలో సరిగా పని చేయడం లేదని అప్పటికే డ్రైవర్లు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కొత్తగా ఏర్పాటు చేసిన ట్రాక్‌లో మలుపుల వద్ద హెవీ బ్రేకింగ్ జోన్‌లో అవి ప్రభావం చూపలేకపోయాయి. ప్రమాదం జరిగాక ఆ కారును సర్క్యూట్ నుంచి తప్పించిన నిర్వాహకులు తర్జనభర్జనల అనంతరం ప్రధాన రేస్‌లను ప్రారంభించరాదని నిర్ణయించారు. 'డ్రైవర్ల భద్రతే అన్నింటికంటే ముఖ్యం. ఎఫ్ఎంఎస్‌సీఐ సూచనల మేరకు ముందు జాగ్రత్తగా రేస్‌లను రద్దు చేశాం. ఘటనపై విచారణ జరిపిస్తాం'అని ఇండియన్ రేసింగ్ లీగ్ అధికారులు వెల్లడించారు. దాంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. లీగ్‌లో భాగంగా తర్వాతి రెండు అంచెలు చెన్నైలో, ఆపై చివరి అంచె డిసెంబర్ 10, 11లో మళ్లీ హైదరాబాద్‌లోనే జరగాల్సి ఉంది. అయితే తాజా ఘటన అనంతరం వాయిదా పడిన తొలి అంచెలోని మూడు రేస్‌లను ఎప్పుడు నిర్వహిస్తారో? మరోవైపు అదే ట్రాక్‌పై ఆదివారం సమాంతరంగా జరగాల్సిన జేకే టైర్ నేషనల్ రేసింగ్ చాంపియన్‌షిప్‌ను విజయవంతంగా నిర్వహించారు. దీనిలో భాగంగా 'ఓపెన్ వీల్'కార్లతో సాగిన మూడు రేస్‌లూ అభిమానులను అలరించాయి.




గాయపడ్డ డ్రైవర్‌ను ఆస్పత్రికి తీసుకెళుతున్న దృశ్యం, ప్రమాదానికి గురైన కారు



రేసుకి సిద్ధమైన కార్లు

సీతావర్ణ చిలుకలు!

చిత్తూరుజిల్లా భాకరాపేట ఘాట్ రోడ్డులో అందమైన సీతాకోక చిలుకలు సందడి చేస్తున్నాయి. ఇవి అటుగా వెళుతున్న ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. భాకరాపేట ఘాట్‌రోడ్డులో కనిపిస్తున్న సీతాకోక చిలుకలను పక్షి శాస్త్రవేత్త కార్తీక్ తన కెమెరాలో బంధించి 'సాక్షి'తో తన మాటలను పంచుకున్నాడు. శేషాచలంలో అరుదైన పక్షులు అప్పుడప్పుడూ కనువిందు చేస్తుంటాయని చెప్పారు. వాటిపై అధ్యయనం చేస్తుండగా భాకరాపేట ఘాట్ రోడ్డులో అరుదైన సీతాకోక చిలుకలు కనిపించినట్లు తెలిపారు. – తిరుపతి అలిపిరి





కామన్ పైరట్



కామన్ సెరూలియన్



కామన్ లైమ్ బటర్‌ఫ్లై



బ్లూ ప్యాన్సీ



ఆరెంజ్ టిప్



లెమన్ ప్యాన్సీ



క్రిమసన్ ట్రిప్



పైనీర్ వైట్

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798.